SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267

సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

**విలేకరులు కావలెను**

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ, విశేష ప్రజాదారణ పొందుతున్న 'సమయం న్యూస్' తెలుగు దినపత్రికలో పని చేయుటకు విలేకరులు కావలెను. ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించండి.

**7036644111, 9490140565**

సంపుటి: 19 | సంచిక: 188 | ఎడిటర్ : విక్రం కుమార్ | శనివారం 16 మే 2026 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 14 | వెల:రూ.10 |

# జూన్ 21న 'నీట్' రీ-ఎగ్జామ్

ప్రశ్నపత్రం లీకేజీతో రద్దయిన పరీక్షకు కొత్త షెడ్యూల్ విడుదల

గతేడాది లీక్ మాఫియాపై సీబీఐ దృష్టి

వచ్చే ఏడాది నుంచి పూర్తిగా ఆన్‌లైన్ విధానం: కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్

4





# పెట్రో, డీజిల్ ధరల పెరుగుదల

4

లీటర్‌పై కనీసంగా రూ.3 పెంపు

ధరలు పెంచుతూ ఆయిల్ కంపెనీల నిర్ణయం



## డ్రోన్ టెక్నాలజీతో యుద్ధరంగంలో
# కొత్త అధ్యాయం

**యుద్ధరంగంలో 'డ్రోన్' టెక్నాలజీ గేమ్ ఛేంజర్**

**కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్**

**పుట్టపర్తిలో భారీ డిఫెన్స్ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన**

యుద్ధరంగంలో డ్రోన్ టెక్నాలజీ గేమ్ ఛేంజర్‌గా మారిందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ పేర్కొన్నారు. రక్షణ రంగంలో స్వావలంబన సాధించడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఆర్థిక, వ్యవసాయ రంగాల్లో కూడా డ్రోన్ వినియోగం కీలకంగా మారుతోందన్నారు. శుక్రవారం పుట్టపర్తి పర్యటనలో భాగంగా సీఎం చంద్రబాబుతో కలిసి భారీ డిఫెన్స్ తయారీ పరిశ్రమకు ఆయన శంకుస్థాపన చేశారు. పుట్టపర్తి- కోదూరు రోడ్డులో 130 ఎకరాల్లో రూ.15,803 కోట్ల వ్యయంతో యుద్ధ విమానాలు, రక్షణ పరికరాల తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయనున్నా రు.

మిగతా 5 లో

## దేశం గర్వించేలా పుట్టపర్తి అభివృద్ధి

రాయలసీమ ఒకప్పుడు డ్రాట్ జోన్

జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్‌లో బంగారం ఉత్పత్తి

ముఖ్యమంత్రి చంద్రబాబు

5



# 2034 వరకు నేనే సీఎం

## ఆ తర్వాత జాతీయ రాజకీయాల్లోకి..

రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యంగా పనిచేస్తా

రాహుల్ తర్వాత సెకండ్ ప్లేస్ ఆక్రమిస్తా

మరోమారు రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు

"సీఎం రేవంత్ రెడ్డి తన రాజకీయ ప్రస్థానంపై మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాబోయే పదేళ్ల పాటు అంటే 2034 వరకు సీఎంగా తానే కొనసాగుతానని, ఆ తర్వాత జాతీయ రాజకీయాల్లోకి ప్రవేశిస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీని దేశ ప్రధానిని చేయడమే తన ప్రధాన లక్ష్యమని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు."



**హైదరాబాద్, మే 15(సమయం న్యూస్):** తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 2034లో రాష్ట్రంలో కాంగ్రెస్‌ను గెలిపించి జాతీయ రాజకీయాల్లోకి వెళ్తానని చెప్పారు. అప్పటి వరకు తానే సీఎంగా ఉంటానన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే తన లక్ష్యమని చెప్పారు. జాతీయ రాజకీయాల్లోకి వెళ్లి రాహుల్ తర్వాతి స్థానంలో ఉంటానని వ్యాఖ్యానించారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవడమే రాహుల్ గాంధీ లక్ష్యమన్నారు. ఆయనకు ప్రధాని కావాలనే కోరిక లేదని.. ఆ పదవికి పోటీ పడాలని తాను ఒప్పించానని రేవంత్ చెప్పారు. గాంధీ కుటుంబానికి దేశం పట్ల విశ్వాసం ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు.. కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ తనకు చాలా చొరవ ఉందని పేర్కొన్నారు. తన గీత తాను దాటనని స్పష్టం చేశారు.

2

## బండి సంజయ్ కుమారుడిని అప్పగించాలి



2

నైతికత నిరూపణలకు ఇదే సమయం

పారిపోవడం సరికాదు

కుమారుడి తీరుతో తండ్రికి తలవంపులు..

సీఎం రేవంత్ రెడ్డి

# పొదుపు చర్యల్లో టీడీపీ మరో అడుగు


**వర్చువల్‌గా మహానాడుకు నిర్ణయం**


నెల్లూరులో నిర్వహించాలనుకున్న మహానాడు రద్దు

మంగళగిరి పార్టీ కార్యాలయంలో ఏర్పాట్లు

వర్చువల్గా జిల్లా పార్టీ కార్యాలయాలద్వారా ప్రసారం

5





## తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు
# ప్రత్యేక కమిటీ

డాక్టర్ కేశవరావు ఛైర్మన్‌గా నియామకం

ఉద్యమ త్యాగాలు, సేవలకు అధికారిక గుర్తింపు కల్పించనున్న ప్రభుత్వం

2

## బండి సంజయ్‌పై దుష్ప్రచారం ఆపండి

ఆయన ప్రతిష్టను దెబ్బతీసే పోస్టులు, వీడియోలను తక్షణమే తొలగించాలి

సిటీ సివిల్ కోర్టు కీలక ఉత్తర్వులు

2




2

## న్యాయం కోసమే మా పోరాటం

కన్నీటి పర్యంతమైన బండి భగీరథ బాధిత బాలిక తల్లి

కుమార్తె భద్రత, గౌరవంపై ఆందోళన..

నిందితుడిని కఠినంగా శిక్షించాలని సుదీర్ఘ లేఖ విడుదల



# పెట్రో ధరల పెంపు అనివార్యం

**కాంగ్రెస్, బీఆర్ఎస్‌వి పనీపాటలేని విమర్శలు**

**మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

**ఉద్యమ కెరటం, హైదరాబాద్:** పెట్రోల్, డీజిల్ ధరల పెంపును అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు రాజకీయంగా వాడుకొంటున్నాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ రెండు పార్టీలకు పనీపాట లేదని.. అందువల్లే ఈ తరహా ఆరోపణలు చేస్తున్నాయంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దయచేసి ఆ యా పార్టీల నేతల మాటలు విని మోసపోవద్దంటూ ప్రజలకు స్పష్టం చేశారు.

మిగతా 3 లో




# తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపునకు ప్రత్యేక కమిటీ

## డాక్టర్ కేశవరావు చైర్మన్‌గా నియామకం

### ఉద్యమ త్యాగాలు, సేవలకు గుర్తింపు కల్పించనున్న ప్రభుత్వం



**హైదరాబాద్, మే 15:** తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారుల సేవలు, త్యాగాలను అధికారికంగా గుర్తించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తూ సాధారణ పరిపాలన శాఖ శుక్రవారం జీఓ ఆర్టీ నం.679 జారీ చేసింది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రాణత్యాగాలు చేసినవారు, శారీరక వైకల్యానికి గురైనవారు, జైలు జీవితం గడిపినవారు, వివిధ రూపాల్లో ఉద్యమంలో పాల్గొన్నవారిని గుర్తించి వారికి గౌరవం కల్పించాలనే డిమాండ్ చాలా కాలంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం కమిటీ ఏర్పాటు చేసింది. ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె. కేశవరావును కమిటీ చైర్మన్‌గా నియమించారు. సభ్యులుగా మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం, ఎమ్మెల్సీ విప్ అద్దంకి దయాకర్, మాజీ ఎమ్మెల్సీ ఎస్. రాములు నాయక్, మోతె శోభన్ రెడ్డి నియమితులయ్యారు. సాధారణ పరిపాలన శాఖ పొలిటికల్ సెక్రటరీ కమిటీ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. తెలంగాణ ఉద్యమకారులను గుర్తించేందుకు అనుసరించాల్సిన స్పష్టమైన ప్రమాణాలను రూపొందించడం కమిటీ ప్రధాన బాధ్యతగా ప్రభుత్వం పేర్కొంది. ఆ ప్రమాణాల ఆధారంగా ఉద్యమకారుల జాబితాను సిద్ధం చేసి, వారికి ఇవ్వాల్సిన గుర్తింపు, గౌరవం, సౌకర్యాలపై ప్రభుత్వానికి సిఫారసులు చేయనుంది. అవసరమైతే కమిటీ వివిధ శాఖల అధికారులను పిలిపించుకుని సమాచారం సేకరించవచ్చు. సమావేశాలు నిర్వహించవచ్చు. ఇతర నిపుణులు, వ్యక్తులను కూడా సంప్రదించవచ్చు. కమిటీ తన నివేదికను వీలైనంత త్వరగా ప్రభుత్వానికి సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కమిటీ పనితీరుకు అవసరమైన సహకారం అందించాలని అన్ని శాఖల కార్యదర్శులు, అధికారులకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

# బండి భగీరథ పోక్సో కేసులో సోషల్ మీడియాలపై కేసులు

## బాలల సంక్షేమ కమిటీ ఫిర్యాదుతో రంగంలోకి పోలీసులు

**హైదరాబాద్, మే 16:** బండి భగీరథ్ పోక్సో కేసులో బాధిత బాలిక, ఆమె కుటుంబ సభ్యుల వివరాలను బహిర్గతం చేసిన సోషల్ మీడియా నిర్వాహకులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. బాధితురాలి ఫోటోలు, వీడియోలు, ఆమె తల్లిదండ్రుల వివరాలను వైరల్ చేసిన పలు ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, యూట్యూబ్ ఛానళ్లపై చర్యలు తీసుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా బాధిత కుటుంబం వివరాలు బహిర్గతమయ్యేలా సోషల్ మీడియాలో పోస్టులు ప్రసారం కావడంపై మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా బాలల సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ తీవ్రంగా స్పందించారు. బాధితురాలి గోప్యతను దెబ్బతీస్తూ ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. నిబంధనలను ఉల్లంఘించిన పలు సోషల్ మీడియా ఖాతాలను పోలీసులు ఇప్పటికే గుర్తించారు. వాటికి సంబంధించిన యుఆర్‌ఎల్ లను సేకరించి ఉన్నతాధికారులు, సంబంధిత సంస్థలకు పంపించారు. ఈ ఖాతాలను నిర్వహిస్తున్న వ్యక్తులను గుర్తించే ప్రక్రియ వేగవంతమైంది. పోక్సో చట్టం ప్రకారం బాధితుల వివరాలను బయటపెట్టడం తీవ్రమైన నేరమని, ఇలాంటి పోస్టులను షేర్ చేసినా లేదా ప్రసారం చేసినా శిక్ష తప్పదని పోలీసులు స్పష్టం చేశారు. సోషల్ మీడియా వేదికగా బాధిత బాలిక వ్యక్తిగత సమాచారాన్ని వైరల్ చేస్తున్న వారిపై నిఘా ఉంచామని, చట్టాన్ని అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. బాధితురాలి భవిష్యత్తు, భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని వారు కోరారు.

# క్యాన్సర్‌పై 'అట్లాస్' విడుదల

## సీఎం రేవంత్‌కు నివేదిక అందజేసిన నోరి దత్తాత్రేయుడు

**హైదరాబాద్, మే 15:** తెలంగాణలో క్యాన్సర్ వ్యాధి వ్యాప్తి, ప్రభావంపై సమగ్ర సమాచారంతో రూపొందించిన 'క్యాన్సర్ అట్లాస్ ఆఫ్ తెలంగాణ' నివేదికను ప్రభుత్వ సలహాదారు, ప్రముఖ క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ నోరి దత్తాత్రేయుడు సీఎం రేవంత్‌రెడ్డికి అందజేశారు. జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో జరిగిన కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, సీఎంవో ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టియానా జెడ్ చోంగ్తూ పాల్గొన్నారు. తెలంగాణలో క్యాన్సర్ పరిస్థితులపై సమగ్ర నివేదిక రూపొందించినందుకు డాక్టర్ నోరి దత్తాత్రేయుడిని ముఖ్యమంత్రి అభినందించారు. క్యాన్సర్‌పై పోరాటంలో ఈ అట్లాస్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో క్యాన్సర్ అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి, వ్యాధి వ్యాప్తికి గల కారణాలను అధ్యయనం చేయడానికి ఈ నివేదిక దోహదపడుతుందని సీఎం తెలిపారు. నివేదికలో పొందుపరిచిన డేటా ఆధారంగా అవసరమైన ప్రాంతాల్లో ప్రత్యేక స్క్రీనింగ్ సెంటర్లు ఏర్పాటు చేసే అవకాశం ఉంటుందన్నారు. హైదరాబాద్‌కే పరిమితం కాకుండా, క్యాన్సర్ బాధితులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక ఆస్పత్రులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు సీఎం వెల్లడించారు. అలాగే ఆరోగ్యశ్రీ పథకం కింద కార్పొరేట్ ఆస్పత్రుల్లో క్యాన్సర్ చికిత్సను మరింత సమర్థవంతంగా అందించాలని అధికారులకు సూచించారు.



# 2034 వరకు నేనే ముఖ్యమంత్రిని

మొదటి పేజీ తరువాయి

శుక్రవారం హైదరాబాద్ వేదికగా సీఎం మాట్లాడారు. టీడీపీలో పదేళ్లు పనిచేశానని.. సీఎం చంద్రబాబు ఇప్పటికి తనను గౌరవిస్తారని ప్రస్తావించారు. పార్టీని వదిలిపెట్టిన తర్వాత నాయకుల మధ్య మంచి సంబంధాలు ఉండటం చాలా అరుదని తెలిపారు.. పార్టీని వదిలిపెట్టే సమయంలో విజయవాడకు వెళ్లి చంద్రబాబుకు చెప్పి వచ్చానని గుర్తుచేశారు.. కాంగ్రెస్‌ను దేశంలో అధికారంలోకి తేవాలని రాహుల్ గాంధీకి లక్ష్యం ఉందని...కాని ప్రధాని కావాలన్న లక్ష్యం లేదని స్పష్ట చేశారు. వికారాబాద్‌లో జరిగిన కాంగ్రెస్ సమావేశంలో ప్రధాని పదవి తీసుకోవాలని తానే రాహుల్ గాంధీకి చెప్పి ఒప్పించానని ప్రస్తావించారు. ఇప్పుడు జనం స్విగ్గి పాలిటిక్స్ కోరుకుంటున్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇండియా కూటమి నుంచి ప్రధాని అభ్యర్థి రాహుల్ గాంధీనే



అని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ముందు ప్రకటించి తర్వాత ఇండియా కూటమిని ఒప్పిస్తామని తెలిపారు. ఇండియా కూటమి తరుపున ఒక పాలసీ డాక్యూమెంటును తీసుకువచ్చి ప్రజలను తీర్పు ఇవ్వమని కోరతామని అన్నారు. 2024 నుంచి 2034 వరకు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తారని చెప్పుకొచ్చారు.. 2034 వరకు తాను తెలంగాణలోనే ఉంటానని.. ఈ ప్రజల కోసమే పనిచేస్తానని తెలిపారు. పదిశాతం జీడీపీని తెలంగాణ దేశానికి ఇచ్చేలా పనిచేస్తానని స్పష్టం చేశారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రినని చెప్పుకొచ్చారు. 2034 తర్వాత తాను ముఖ్యమంత్రిగా ఉండనని.. తర్వాత తరానికి అవకాశం ఇస్తానని తెలిపారు. దేశానికి కూడా సేవలందిస్తా అని.. తన అనుభవాన్ని దేశం కోసం పంచుతానని చెప్పుకొచ్చారు. రాహుల్ గాంధీని ప్రధానిని చేసిన తర్వాత.. ఆయన ఏ బాధ్యతలు అప్పగించిన తీసుకుంటానని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

# బండి సంజయ్ కుమారుడిని అప్పగించాలి

## నైతికత నిరూపణలకు ఇదే సమయం: రేవంత్

**హైదరాబాద్, మే 15:** పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్ పోలీసులకు దొరకకుండా పరారీలో ఉండటం సరికాదని సీఎం రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన నైతిక బాధ్యతను చాటుకుంటూ, తక్షణమే తన కుమారుడిని పోలీసులకు అప్పగించాలని ఆయన సూచించారు. అలా చేయడం వల్ల బండి సంజయ్ గౌరవం పెరుగుతుందని సీఎం వ్యాఖ్యానించారు. ఎలాంటి కేసులనైనా చట్టబద్ధంగా, ధైర్యంగా ఎదుర్కోవాలని.. పారిపోవడం వల్ల సమస్యలకు పరిష్కారం లభించదని సీఎం హితవు పలికారు. "తప్పయినా, ఒప్పయినా నిలబడి సమాధానం చెప్పాలి. పారిపోవడం వల్ల మరింత అప్రతిష్ట వస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. బండి సంజయ్ కింది స్థాయి నుంచి కష్టపడి పైకి ఎదిగిన నాయకుడని, అయితే తన కుమారుడి ప్రవర్తన కారణంగా ఆయనకు ఇప్పుడు తలవంపులు వచ్చాయని సీఎం వ్యాఖ్యానించారు. కేసులో ఎవరిది తప్పు, ఎవరిది ఒప్పు అనే విషయాన్ని విచారణ అధికారులు నిష్పాక్షికంగా తేలుస్తారని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. విచారణకు సహకరించకుండా తప్పించుకు తిరగడం భావ్యం కాదని, తక్షణమే భగీరథ్‌ను పోలీస్ స్టేషన్‌లో అప్పగించాలని ఆయన సూచించారు. చట్టం తన పని తాను చేసుకుపోతుందని, ఈ విషయంలో రాజకీయాలకు



తావులేదని సీఎం స్పష్టం చేశారు.

# బండి సంజయ్‌పై దుష్ప్రచారం ఆపండి

## సిటీ సివిల్ కోర్టు కీలక ఉత్తర్వులు

## ఆయన ప్రతిష్టను దెబ్బతీసే పోస్టులు, వీడియోలను తక్షణమే తొలగించాలి

## ఈనెల 26లోగా చర్యలు తీసుకోకుంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరిక

**హైదరాబాద్, మే 16:** కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ను వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని సాగుతున్న దుష్ప్రచారంపై హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు కీలక మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. బండి భగీరథ్ పోక్సో కేసును సాకుగా చూపుతూ ఆయన ప్రతిష్టకు భంగం కలిగించేలా సామాజిక మాధ్యమాలు, ఇతర వేదికల్లో చేస్తున్న ప్రచారాన్ని తక్షణమే నిలిపివేయాలని కోర్టు ఆదేశించింది. కోర్టు ఉత్తర్వుల ప్రకారం.. బండి సంజయ్‌ను టార్గెట్ చేస్తూ




ఇప్పటివరకు సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వీడియో క్లిప్పింగులు, డిజిటల్ కంటెంట్, పత్రికా కటింగులు, వాల్ పోస్టర్లను తక్షణం తొలగించాలని స్పష్టం చేసింది. ఈ నెల 26వ తేదీలోగా సదరు కంటెంట్‌ను తొలగించని పక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించింది. ఇకపై ఆయన వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీసేలా ఎలాంటి అసత్య ప్రచారాలు చేసినా కఠిన చర్యలు తప్పవని న్యాయస్థానం స్పష్టం చేసింది. బండి సంజయ్ తరఫు న్యాయవాదులు కోర్టులో వాదనలు వినిపిస్తూ.. రాజకీయ ప్రత్యర్థులు ఉద్దేశపూర్వకంగా ఆయనను అప్రతిష్టపాలు చేసేందుకు సోషల్ మీడియాను వేదికగా చేసుకున్నారని ఫిర్యాదు చేశారు. తప్పుడు వీడియోలు, వార్తలను వ్యాప్తి చేస్తూ ఆయన సామాజిక, రాజకీయ ప్రతిష్టకు భంగం కలిగిస్తున్నారని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం.. ఇలాంటి చర్యలు న్యాయవ్యవస్థ దృష్టిలో తీవ్రమైనవని అభిప్రాయపడుతూ పిటిషనర్ అనుకూలంగా ఉత్తర్వులు ఇచ్చింది. భగీరథ్‌పై కేసు నమోదైన నాటి నుంచి బండి సంజయ్ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలంటూ ప్రతిపక్ష పార్టీలు పెద్ద ఎత్తున డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలో కోర్టు ఇచ్చిన తాజా ఆదేశాలు రాజకీయ నాయకులపై వ్యక్తిగత దూషణలకు దిగేవారికి ఒక బలమైన సందేశాన్ని పంపినట్లయింది.

# న్యాయం కోసమే మా పోరాటం

- కన్నీటి పర్యంతమైన బండి భగీరథ బాధిత బాలిక తల్లి
- కుమార్తె భద్రత, గౌరవంపై ఆందోళన..
- నిందితుడిని కఠినంగా శిక్షించాలని సుదీర్ఘ లేఖ

హైదరాబాద్, మే 16: కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసులో బాధితురాలి తల్లి శనివారం ఒక సుదీర్ఘ లేఖను విడుదల చేశారు. తాము ఏ రకమైన ప్రచారం కోసమో లేదా రాజకీయ లబ్ధి కోసమో ఈ పోరాటం చేయడం లేదని, కేవలం తమ బిడ్డకు జరిగిన అన్యాయంపై చట్టబద్ధమైన పోరాటం చేస్తున్నామని ఆమె స్పష్టం చేశారు. మైనర్ బాలిక గుర్తింపును రహస్యంగా ఉంచుతూనే, జరిగిన దారుణాలను ఆమె ఆ లేఖలో వివరించారు. 2025లో తన కుమార్తెకు భగీరథ్‌తో పరిచయం ఏర్పడిందని, అది కాస్తా వేధింపులకు దారితీసిందని బాధితురాలి తల్లి ఆరోపించారు. 2025 డిసెంబర్ 31వ తేదీ రాత్రి మొయినాబాద్‌లో జరిగిన ఒక వేడుకలో తన కుమార్తెను మద్యం సేవించమని బలవంతం చేశాడని, ఆమె స్పృహలో లేని సమయంలో అనుచితంగా


Press Release

1. This statement is being issued by a helpless mother whose minor daughter is the victim in FIR No. 684/2026 registered under the Protection of Children from Sexual Offences Act, 2012. Even while carrying unbearable emotional pain, I am consciously withholding the identity of my child in obedience to the law of this country, the provisions of the POCSO Act, and the directions of the Hon'ble Supreme Court of India. My daughter deserves protection, dignity, and a future free from public humiliation.

2. We are an ordinary middle-class family. We are not politically powerful people. We are not influential people. We are parents who raised our daughter with dreams, values, education, and hope. Never in our worst nightmares did we imagine that one day we would have to stand before society begging institutions to protect our child and hear our cries for justice. This statement is not issued out of revenge or publicity. It is issued because silence has become more painful than speaking.

3. My daughter informed us that she came into contact with Mr. Bandi Bageerath during the year 2025. What began as normal interaction slowly turned into emotional dependence through constant communication, emotional assurances, repeated persuasion, and sustained personal contact. As parents, it shatters us to say this publicly, but our daughter alleges that she was emotionally manipulated, psychologically controlled, discouraged from focusing on her studies and future, and repeatedly pressured for physical involvement despite her discomfort and resistance on several occasions.

4. As a mother, no words can fully describe the pain of hearing my daughter narrate incidents that allegedly occurred at different locations including apartments, private premises, and particularly during the night of 31st December 2025 and early hours of 1st January 2026 at Moinabad. My daughter disclosed that she was allegedly pressured to consume alcohol despite resistance and later subjected to inappropriate physical conduct and coercive behaviour when she was in a vulnerable condition. Every time she recalled these incidents, we saw fear, shame, and emotional collapse in her eyes. These allegations are now under investigation and we trust the law to uncover the truth.

Page 1 of 5

ప్రవర్తించాడని పేర్కొన్నారు. ఈ ఘటన తర్వాత తన కుమార్తె తీవ్ర మానసిక వేదనకు గురైందని, అప్పటి నుంచి భగీరథ్ వాట్సాప్ చాటింగ్‌లు, ఫోన్ కాల్స్ ద్వారా తీవ్ర ఒత్తిడికి గురిచేశాడని ఆరోపించారు. తమ వద్ద ఇందుకు సంబంధించిన డిజిటల్ ఆధారాలు ఉన్నాయని వెల్లడించారు. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లో తాము చట్టపరంగా ముందుకెళ్లాలని ప్రయత్నించినప్పుడు, కేసు పెట్టవద్దంటూ పరోక్షంగా రాజీ ప్రయత్నాలు మరియు ఒత్తిళ్లు వచ్చాయని బాధితురాలి తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. ఏప్రిల్ 22న బీజేపీకి చెందిన ఒక వ్యక్తి తమ ఇంటికి వచ్చాడని, ఆ తర్వాతి రోజు తాము కేంద్ర మంత్రి బండి సంజయ్‌ని కలిసినప్పుడు తమకు భరోసా ఇవ్వాల్సింది పోయి భయపెట్టారని ఆమె ఆరోపించారు. చివరికి తమపైనే ఎదురు కేసులు పెట్టి బ్లాక్‌మెయిల్ చేసే ప్రయత్నం జరిగిందని వాపోయారు. పోలీసులను ఆశ్రయించినప్పుడు కూడా మైనర్ బాలిక కేసు అయినప్పటికీ గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చిందని, చివరకు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిట్ దర్యాప్తుపై తమకు నమ్మకం ఉందని, అయితే నిందితుడు ఇప్పటికీ స్వేచ్ఛగా తిరగడంపై ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. తన కుమార్తె వయస్సును తక్కువ చేసి చూపేలా రికార్డులను సవరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, వాటన్నింటినీ అరికట్టి న్యాయం చేయాలని కోరారు. సోషల్ మీడియా, మెయిన్ స్ట్రీమ్ మీడియా తమ వ్యక్తిగత సమాచారాన్ని, కుమార్తె గుర్తింపును బయట పెట్టవద్దని ఆమె వేడుకున్నారు. దీనివల్ల బాధితురాలు మరింత మానసిక కుంగుబాటుకు గురయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. భారత రాజ్యాంగం, న్యాయవ్యవస్థపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, చివరికి నిజమే గెలుస్తుందని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు.

# గూడులేని ప్రతి పేద కుటుంబానికి సొంత ఇల్లే లక్ష్యం

మొదటి పేజీ తరువాయి

గూడులేని ప్రతి అర్హ పేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వని విధంగా ఒక్కో ఇంటికి రూ.5 లక్షల ఆర్థిక సాయం అందిస్తూ తెలంగాణ ప్రభుత్వం పేదల గృహనిర్మాణంలో దేశానికి ఆదర్శంగా నిలుస్తోందన్నారు. తొలి విడతలో 3 లక్షలకు పైగా ఇండ్లను మంజూరు చేశామని, అందులో 2.90 లక్షల ఇండ్లకు గ్రౌండింగ్ పూర్తి కాగా ఇప్పటికే సుమారు 50 వేల గృహప్రవేశాలు జరిగాయని తెలిపారు. మరో రెండు లక్షలకు పైగా ఇండ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయని, రెండు నెలల్లో పూర్తి అవుతాయని చెప్పారు. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఐటీడీఏ ప్రాంతాల నియోజకవర్గాలకు అదనపు ఇండ్లు కేటాయించినట్లు తెలిపారు. రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కార్యక్రమాన్ని జూన్ 2న ఆదిలాబాద్ జిల్లాలో ప్రారంభిస్తామని పేర్కొన్నారు.



ఇది ఇక్కడితో ఆగిపోదని, అర్హులైన ప్రతి లబ్ధిదారునికి ఇల్లు అందే వరకు మూడో, నాలుగో విడతలుగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో ఇందిరమ్మ పథకం కింద రూ.20 వేల వరకు సాయం పొందిన వారికి కూడా మళ్లీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని తెలిపారు. పైలట్ గ్రామాల్లో 600 చదరపు అడుగులకు పైగా నిర్మించిన ఇండ్ల బిల్లులను వెంటనే క్లియర్ చేయాలని అధికారులను ఆదేశించారు. పేదలు నివసిస్తున్న గుడిసెల స్థానంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించుకునే సమయంలో ఫారెస్ట్ అధికారులు లేదా సింగరేణి యాజమాన్యం అడ్డంకులు కల్పించవద్దని మంత్రి సూచించారు. ఇండ్ల నిర్మాణానికి అవసరమైన మట్టిని చెరువులు, కుంటల నుంచి తరలించడంపై రెవెన్యూ, పోలీసు శాఖలు ఇబ్బందులు కలిగించకూడదన్నారు. ఖమ్మం, వరంగల్ జిల్లాల్లో ఎక్కువ అటవీ భూములు ఉండటంతో రెవెన్యూ-ఫారెస్ట్ శాఖల మధ్య సరిహద్దు వివాదాలు అధికంగా ఉన్నాయని పేర్కొన్న మంత్రి, జాయింట్ సర్వే నిర్వహించి శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం కొనుగోలు చేసిన రోవర్స్ సాయంతో భూ సర్వే నిర్వహించి వివాదాలకు ముగింపు పలకాలని సూచించారు. ఈ సమావేశంలో మంత్రులు వాకిటి శ్రీహరి, సీతక్క, కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.



## పెట్రో ధరల పెంపు అనివార్యం

**కాంగ్రెస్, బీఆర్ఎస్‌వి పనీపాటలేని విమర్శలు**

**మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**

**హైదరాబాద్, మే 15:** పెట్రోల్, డీజిల్ ధరల పెంపును అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీలు రాజకీయంగా వాడుకొంటున్నాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఈ రెండు పార్టీలకు పనీపాట లేదని.. అందువల్లే ఈ తరహా ఆరోపణలు చేస్తున్నాయంటూ ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దయచేసి ఆ యా పార్టీల నేతల మాటలు విని మోసపోవద్దంటూ ప్రజలకు స్పష్టం చేశారు. శుక్రవారం హైదరాబాద్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు పెంపుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. దేశవ్యాప్తంగా పెట్రోలు ధరలు పెరిగాయన్నారు. ఈ పెంచిన ధరలు శుక్రవారం ఉదయం నుంచి అమల్లోకి వచ్చాయని చెప్పారు. అమెరికా, ఇరాన్ యుద్ధ ప్రభావంతోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంపు అనివార్య మైందన్నారు. అంతేకానీ ఇది ప్రజల మీద భారం వేసేందుకు కాదన్నారు. క్రూడాయిల్ దిగుమతికి భారీగా ఖర్చు అవుతుందని వివరించారు. అందుకోసమే కేంద్రం ఈ నిర్ణయం తీసుకుందని ఆయన వివరించారు. అంతర్జాతీయ స్థాయిలో అమెరికా, జర్మనీ, జపాన్ తదితర దేశాల్లో పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి సోదాహరణగా వివరించారు. పెట్రోల్, డీజిల్ లీటర్ ధరలు రూ.3కు పైగా పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. వీటి ధరలు పెంచడం వల్ల ప్రజలపై అదనపు భారం పడుతుందంటూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు విమర్శలు గుప్పిస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి పైవిధంగా స్పందించారు.

## ఇప్పట్లో ఎన్నికలు లేవు

**సర్ ప్రక్రియను హడావిడిగా అమలు చేయడం తగదు**

**రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషన్‌కు టీపీసీసీ వినతి**



**హైదరాబాద్, మే 15:** ఎస్ఐఆర్‌ను హడావిడిగా చేయాల్సిన అవసరం లేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. సర్ అంశంపై పీసీసీ బృందం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించింది. అనంతరం మహేశ్‌గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ వల్లే బెంగాల్‌లో రాజకీయ సమీకరణలు మారాయన్నారు. గెలవాల్సిన పార్టీలు ఓడిపోయాయి. తెలంగాణలో వచ్చే రెండేళ్లలో ఎలాంటి ఎన్నికలు లేవు. ఎస్ఐఆర్‌ను హడావిడిగా చేయాల్సిన అవసరం లేదు. ఆ పక్రియను ఏడాదిన్నరపాటు జాగ్రత్తగా చేయాలని ఇసిని కోరామని వెల్లడించారు.జనగణన పక్రియ ఇప్పటికే జరుగుతోంది. జనగణనతో పాటే ఎస్ఐఆర్ నిర్వహిస్తే సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతుంది. ఎస్ఐఆర్‌లో ఓటు తొలగిస్తే దరఖాస్తు చేసుకునే గడువు 3 నెలలకు పెంచాలన్నారు. ప్రత్యక్షంగా 3-4 సార్లు బీఎల్‌వోలు ప్రతి ఇంటికీ వెళ్లి ఓటు తనిఖీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఈసీని కలిసిన వారిలో మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీలు అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్‌కుమార్‌రెడ్డితో పాటు పలువురు కాంగ్రెస్ నేతలు ఉన్నారు.

## కాళేశ్వర క్షేత్రంలో సరస్వతీ అంత్య పుష్కరాలు

**డిప్యూటీ సీఎం భట్టికి మంత్రి కొండా సురేఖ ఆహ్వానం**



**హైదరాబాద్, మే 15:** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరం వేదికగా సరస్వతీ నది అంత్య పుష్కరాలను తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. ఈ పుష్కరాలలో పాల్గొనాల్సిందిగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ప్రజా భవన్ కు ప్రత్యేకంగా వచ్చి దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ డైరెక్టర్ ఎం. హనుమంతరావు, ఇతర ఉన్నతాధికారులు ప్రత్యేకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా వేద పండితులు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను వేదోఛ్చారణలతో ఆశీర్వదించారు. సరస్వతీ అంత్య పుష్కరాలను మే 21 నుంచి జూన్ 1 వరకు 12 రోజుల పాటు కాళేశ్వరంలో నిర్వహిస్తున్నట్లు డిప్యూటీ సీఎంకు మంత్రి కొండా సురేఖ వివరించారు. మే 21న ఉదయం 5:43 గంటలకు తొలి పుష్కర స్నానంతో వేడుకలు ప్రారంభమవుతాయి. కంచి పీఠాధిపతి శ్రీ శంకర విజేంద్ర సరస్వతి స్వామి తొలి పుష్కర స్నానాన్ని ఆచరిస్తారని డిప్యూటీ సీఎంకు వివరించారు. త్రివేణి సంగమం వద్ద ప్రతిరోజూ గంగా హారతి నిర్వహించడం జరుగుతుందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోందని వివరించారు.

# జహీరాబాద్‌లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్

- రూ.650 కోట్ల పెట్టుబడితో భారీ ఫుడ్ ఇండస్ట్రీ
- దామోదరతో కలసి ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు
- త్రీ ట్రిలియన్ ఎకానమీ లక్ష్యం



**సంగారెడ్డి, మే 15:** తెలంగాణ రైజింగ్‌తో త్రీ ట్రిలియన్ ఎకానమీ కోసం తాము పనిచేస్తున్నామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వ్యాఖ్యానించారు. జహీరాబాద్ లాంటి ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం తాము కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. శుక్రవారం కొండాపూర్ మండలం తొగర్‌పల్లిలో మంత్రులు శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహలు పర్యటించారు. రూ.650 కోట్ల పెట్టుబడితో 44 ఎకరాల్లో భారీ ఫుడ్ ఇండస్ట్రీకి మంత్రులు భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మలా జగ్గారెడ్డి, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. 1500 మంది స్థానిక మహిళలకు ఉపాధి కల్పనే లక్ష్యంగా కేజేఎస్ యూనిట్‌కి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడారు. తొగర్‌పల్లిలో ఇంత పెద్ద పరిశ్రమ రావడానికి నిర్మల జగ్గారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి కారణమని చెప్పుకొచ్చారు. 1500 మంది మహిళలకు ఈ పరిశ్రమతో ఉపాధి లభిస్తుందని తెలిపారు. ఈ పరిశ్రమ పూర్తిగా కాలుష్య రహితమని అన్నారు. ఈ ప్రాంత ప్రజలకు ఉపాధి కల్పించేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. రాబోయే కాలంలో అంతర్జాతీయ కారిడార్‌లో ఓ ఇండస్ట్రీ నెలకొల్పుతామని వెల్లడించారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అంతర్జాతీయ సదస్సులో పాల్గొని పరిశ్రమల కోసం పెట్టుబడులను ఆకర్శిస్తున్నామని చెప్పుకొచ్చారు. స్థానిక యువతకు ఉపాధే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని తెలిపారు. రాబోయే కాలంలో 2047 నాటికి దేశ జాతీయ ఉత్పత్తిలో 10 శాతం ఉత్పత్తి పెంచేలా తాము పనిచేస్తున్నామని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలోనే మొదట పరిశ్రమలు సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరులో ఏర్పడ్డాయని మంత్రి దామోదర రాజనర్సింహ వ్యాఖ్యానించారు. మంత్రి శ్రీధర్‌బాబుకి పరిశ్రమల శాఖ తగినవిధంగా సెట్ అవుతుందని తెలిపారు. మెదక్ ప్రజలు చాలా అదృష్టవంతులని చెప్పుకొచ్చారు. వెనుకబడ్డ ప్రాంతాల్లో పరిశ్రమలు వస్తే ఆ ప్రాంత ప్రజలకు ఉపాధి లభిస్తుందని దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్ బాబు ఈ పరిశ్రమ ఏర్పాటు కోసం సహకరించారని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. 1500 మంది మహిళలకు ఈ పరిశ్రమతో ఉపాధి లభిస్తుందని అన్నారు. సంగారెడ్డి జిల్లాకు కేంద్ర సంస్థలను తీసుకువచ్చామని జగ్గారెడ్డి తెలిపారు.

# హైదరాబాద్‌కు 'హైస్పీడ్' వెలుగులు



- ముంబై, బెంగళూరు, చెన్నైకు బుల్లెట్ రైళ్లు!
- ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీఎస్ రామకృష్ణారావు ఆదేశం
- తెలంగాణ రైజింగ్ 2047: ఆర్థిక వృద్ధికి ఇంజిన్‌గా మారనున్న రవాణా వ్యవస్థ

**హైదరాబాద్, మే 15:** భాగ్యనగరం వేదికగా దేశంలోని ప్రధాన నగరాలను అనుసంధానించే 'హైస్పీడ్ రైలు కారిడార్' ప్రాజెక్టులపై తెలంగాణ ప్రభుత్వం కసరత్తు వేగవంతం చేసింది. కేంద్ర రైల్వే శాఖతో సమన్వయం చేసుకుంటూ ఈ ప్రాజెక్టులకు సంబంధించిన సమగ్ర ప్రతిపాదనలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో జరిగిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన ఈ ప్రాజెక్టుల పురోగతిపై చర్చించారు. హైదరాబాద్ నుండి ముంబై, బెంగళూరు మరియు చెన్నై నగరాలకు హైస్పీడ్ రైలు మార్గాలను ఏర్పాటు చేయడం ద్వారా తెలంగాణ 'రైజింగ్ 2047' ఎకనామిక్ గ్రోత్ కారిడార్‌గా అభివృద్ధి చెందుతుందని సీఎస్ పేర్కొన్నారు. ఈ మార్గానికి సంబంధించి సుమారు 671 కిలోమీటర్ల మేర డీపీఆర్ సిద్ధమైందని రైల్వే అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా తెలంగాణలో 93 కిలోమీటర్ల మేర భూసేకరణ అవసరమవుతుంది. ఈ రెండు మార్గాలకు సంబంధించి రాష్ట్రంలో సుమారు 123 కిలోమీటర్ల నిడివిలో భూసేకరణ చేపట్టాల్సి ఉంటుందని అధికారులు వెల్లడించారు. ప్రాజెక్టు అమలులో భూసేకరణ, కనెక్టివిటీ మరియు మౌలిక వసతుల కల్పనపై అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సీఎస్ సూచించారు. ముఖ్యంగా కోకాపేట, శంషాబాద్ ప్రాంతాలలో రైల్వే డిపోల ఏర్పాటుకు అవసరమైన భూమిని సేకరించాలని అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి హెచ్ఎండీఏ, జీఎంఆర్ ఎయిర్‌పోర్టు, రోడ్లు భవనాల శాఖ అధికారులు రైల్వే అధికారులతో కలిసి పనిచేయాలని స్పష్టం చేశారు. దేశంలోనే అత్యంత వేగవంతమైన ఈ రవాణా వ్యవస్థ అందుబాటులోకి వస్తే.. పారిశ్రామిక, ఐటీ మరియు పర్యాటక రంగాల్లో తెలంగాణ సరికొత్త పుంతలు తొక్కుతుందని రామకృష్ణారావు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజల భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టును తీర్చిదిద్దనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, కేంద్ర రైల్వే శాఖ ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఎన్నికలు కాగానే పెట్రోల్ ధర పెంచారు

**మోడీ వైఫల్యానికి ఇది నిదర్శనం**

**మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శ**



**హైదరాబాద్, మే 15:** ఎన్నికలు పూర్తి కాగానే పెట్రోల్ ధరలు పెంచి బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలను మోసం చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. దేశంలో నాలుగు రాష్ట్రాల ఎన్నికలు పూర్తయ్యే వరకు అందరూ ఊహించిన విధంగా పెట్రోల్ డీజిల్ పెంచకుండా ఆపారన్నారు. ఎన్నికలు పూర్తికాగానే ముఖ్యమంత్రుల ప్రమాణ స్వీకారం కూడా కాకముందే దేశ ప్రజలకు ముఖ్యంగా తెలంగాణ ప్రజలకు పెట్రోల్ ధరలు పెంచి మ-రోసారి అన్యాయం చేసిందని వెల్లడించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బండి సంజయ్ పెట్రోల్ ధరలు పెరగవని చాలాసార్లు అన్నారని తెలిపారు. నరేంద్ర మోడీ ప్రభుత్వం పెట్రోల్ ధరలు పెంచిందని గుర్తు చేశారు.గతంలో యూపీఏ ప్రభుత్వం నయా పైసా పెంచక ముందే గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న నరేంద్ర మోడీ అపహాస్యం చేసే విధంగా వ్యవహరిస్తుండే అని చెప్పారు. మూడు రోజుల క్రితం హైదరాబాద్ పర్యటనలో పెట్రోల్, డీజిల్ తక్కువ వాడండి బంగారం కొనవద్దు, నూనె తక్కువ వాడాలి అన్నప్పుడే నడ్డివిరుస్తారని అనుమానం వచ్చిందన్నారు. ఆరు నెలల స్టాక్ ఉందని చెప్పారు. యుద్ధం కారణం చూపుతున్నారని.. యుద్ధం ఈరోజు రాలేదు.. ఇప్పటి నుండో ఉందన్నారు. పెట్రోల్ డీజిల్ ధరలపై కాంగ్రెస్ పార్టీ అందరం కలిసి వ్యతిరేకిస్తున్నామని.. పెట్రోల్ ధరలపై బీజేపీ నేతలు స్పందించి ముక్కు నేలకు రాయాలని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

# భూగర్భ జలాల సంరక్షణే లక్ష్యం..

- నీటి వృథాపై ఉక్కుపాదం!
- ఫ్లోరైడ్, నైట్రేట్ సమస్యలపై ప్రత్యేక దృష్టి
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
- అధిక వినియోగ ప్రాంతాల్లో కొత్త బోరుబావుల తవ్వకాలపై ఆంక్షలు



హైదరాబాద్, మే 15: తెలంగాణ రాష్ట్రంలో భూగర్భ జలాల సంరక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజలకు తాగునీటి భద్రత కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యంగా ఫ్లోరైడ్, నైట్రేట్ వంటి సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించామని వెల్లడించారు. శుక్రవారం సచివాలయంలో భూగర్భ జలాల శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో నీటి లభ్యత పెరుగుతున్నప్పటికీ, అదే స్థాయిలో వినియోగం కూడా పెరుగుతుండటంపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. 2024తో పోలిస్తే 2025లో భూగర్భ జలాల వినియోగం 45.93% నుండి 46.86% శాతానికి పెరిగిందని ఆయన గుర్తు చేశారు. భూగర్భ జలాల వినియోగం అధికంగా ఉన్న 16 జిల్లాల్లో భవిష్యత్ అవసరాల దృష్ట్యా కఠిన నియంత్రణలు అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. రాజధాని హైదరాబాద్‌లోని ఎనిమిది మండలాలు 'అధిక వినియోగ' కేటగిరీలో ఉన్నాయని అధికారులు ఈ సందర్భంగా మంత్రికి వివరించారు. భూగర్భ జలాల ఒత్తిడి ఎక్కువగా ఉన్న గ్రామాల్లో కొత్తగా బోరుబావుల తవ్వకాలు మరియు అదనపు నీటి వినియోగాన్ని నియంత్రించాలని మంత్రి ఆదేశించారు. ఈ మేరకు ఆయా గ్రామాల వివరాలను జిల్లా యంత్రాంగానికి పంపించి, పర్యవేక్షణ పెంచాలని సూచించారు. అలాగే, ఇసుక తవ్వకాల అనుమతులు ఇచ్చే ముందు భూగర్భ జలాల శాఖతో తప్పనిసరిగా సంప్రదింపులు జరపాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా భూగర్భ జల మట్టాలను నిరంతరం గుర్తించేందుకు 1,771 ఫిజోమీటర్లను వినియోగిస్తున్నట్లు మంత్రి తెలిపారు. జాతీయ హైడ్రాలజీ ప్రాజెక్టు అమలులో తెలంగాణ భూగర్భ జల విభాగం ఉత్తమ పనితీరు కనబర్చడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇకపై కృత్రిమ మేధస్సు (ఏఐ) వంటి ఆధునిక సాంకేతికతను వినియోగించి మరింత మెరుగైన ఫలితాలు సాధించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. భూగర్భ జలాల సంరక్షణను ఒక సామాజిక ఉద్యమంలా ముందుకు తీసుకెళ్లాలని, ప్రతి ఇంటి వద్ద ఇంకుడు గుంటల నిర్మాణాన్ని ప్రోత్సహించాలని మంత్రి పిలుపునిచ్చారు. కాగా, పరిశ్రమలు, అపార్టుమెంట్లు, ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ యూనిట్లకు అనుమతులు ఇవ్వడం ద్వారా శాఖకు రూ. 25.80 కోట్ల ఆదాయం లభించిందని అధికారులు వెల్లడించారు. ఈ సమావేశంలో నీటిపారుదల శాఖా ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్, డైరెక్టర్ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



సంపాదకీయం

# ప్రపంచానికి 'ట్రంప్' సెగ

అస్తవ్యస్తంగా ఆర్థిక రంగం!

భగ్గుమంటున్న ఇంధన ధరలు

సామాన్యుడిపై భారాల మోత

ఐటీలో లేఆఫ్స్ కల్లోలం..

ఒరాకిల్, సిస్కో సంస్థల్లో వేలాది మంది ఇంటికి



**ఇరాన్‌పై దాడులతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను మరింత పెంచిన అమెరికా మాజీ అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్‌చర్యలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. యుద్ధ భయాలు, చమురు రవాణా అంతరాయం, ముడి చమురు ధరల పెరుగుదలతో భారత్ వంటి దిగుమతులపై ఆధారపడిన దేశాలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి.**

భారత్‌లో ఇప్పటికే పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. ఈ ప్రభావం కేవలం ఇంధన రంగానికే పరిమితం కాకుండా అన్ని రంగాలపై పడనుంది. రవాణా ఖర్చులు పెరగడంతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా ఆకాశాన్ని అంటనున్నాయి. విమానయాన రంగం ఇప్పటికే భారమైన పరిస్థితుల్లో ఉండగా, తాజా సంక్షోభంతో మరింత కుదేలయ్యే పరిస్థితి కనిపిస్తోంది.

**ఇంధన పొదుపు కోసం ప్రధాని నరేంద్ర మోదీ వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని ప్రోత్సహించాలని సూచించారు. హైదరాబాద్ వంటి ఐటీ నగరాల్లో దీని వల్ల భారీ స్థాయిలో ఇంధన ఆదా సాధ్యమవుతుందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో సుమారు 9 లక్షల మంది ఐటీ ఉద్యోగులు పనిచేస్తుండగా, వారిలో కనీసం సగం మంది వారానికి మూడు రోజులు ఇంటి నుంచే పనిచేస్తే నెలకు సుమారు రూ.140 కోట్ల విలువైన ఇంధనం ఆదా అయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.**

అయితే, కరోనా సమయంలో అమలైన వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని ఇప్పుడు పూర్తిస్థాయిలో కొనసాగించేందుకు అనేక ఐటీ సంస్థలు ఆసక్తి చూపడం లేదు. ఉత్పాదకత తగ్గిపోతుందనే ఆందోళనతో కొన్ని కంపెనీలు కార్యాలయ హాజరుపై మళ్లీ దృష్టి పెడుతున్నాయి.

**ఇక ఆర్థిక ఒత్తిడితో ఐటీ రంగంలో ఉద్యోగ కోతలు కూడా మొదలయ్యాయి. ఒరాకిల్ గత నెలలో ప్రపంచవ్యాప్తంగా వేలాది ఉద్యోగులను తొలగించిన తర్వాత, ఇప్పుడు ఐఐటీలు, ఎన్ఐటీల విద్యార్థులకు ఇచ్చిన జాబ్ ఆఫర్‌లను కూడా రద్దు చేసింది. సిస్కో కూడా భారీ స్థాయిలో ఉద్యోగులను తగ్గించేందుకు సిద్ధమైంది. లింక్డ్ఇన్‌కూడా సిబ్బంది పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఉద్యోగ కోతల దిశగా అడుగులు వేస్తోంది.**

ఇదిలా ఉండగా, పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కేంద్రం నుంచి వస్తున్న సంకేతాలు ప్రజల్లో మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పూరి "పెట్రో ధరలు పెరగవని చెప్పలేను" అని వ్యాఖ్యానించగా, ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా కూడా అంతర్జాతీయ పరిస్థితుల దృష్ట్యా ధరల పెంపు తప్పదని సూచించారు.

**నిపుణుల అభిప్రాయం ప్రకారం, కేవలం కాన్వాయ్‌లలో కార్లు తగ్గించడం వల్ల పరిస్థితి మారదు. ప్రజాప్రతినిధుల దుబారా ఖర్చులు, భారీ భత్యాలు, విదేశీ పర్యటనలు, విలాసవంతమైన ఖర్చులపై కూడా నియంత్రణ అవసరమని వారు సూచిస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాలంటే ఇంధన పొదుపుతో పాటు చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, వ్యవసాయ రంగానికి బలమైన మద్దతు అవసరమని అభిప్రాయపడుతున్నారు.**



# జూన్ 21న 'నీట్' రీ-ఎగ్జామ్

## విద్యార్థులకు ఊరట

**ప్రశ్నపత్రం లీకేజీతో రద్దయిన పరీక్షకు కొత్త షెడ్యూల్ విడుదల**

- గతేడాది లీక్ మాఫియాపై సీబీఐ దృష్టి
- వచ్చే ఏడాది నుంచి పూర్తిగా ఆన్‌లైన్ విధానం: కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్



**న్యూఢిల్లీ, మే 15:** ప్రశ్నపత్రం లీకేజీ ఆరోపణల నేపథ్యంలో రద్దయిన నీట్ యూజీ-2026 పరీక్షను తిరిగి నిర్వహించేందుకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ కొత్త షెడ్యూల్‌ను ఖరారు చేసింది. జూన్ 21వ తేదీ ఆదివారం ఈ పరీక్షను నిర్వహించనున్నట్లు ఎన్‌టీఏ శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. మే 3న జరిగిన పరీక్షలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు తేలడంతో, దేశవ్యాప్తంగా దరఖాస్తు చేసుకున్న సుమారు 23 లక్షల మంది విద్యార్థులు ఇప్పుడు మళ్లీ పరీక్ష రాయాల్సి ఉంది. ఈ పునర్విచారణ పరీక్ష కోసం విద్యార్థులు కొత్తగా దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని, ఎటువంటి అదనపు ఫీజు చెల్లించాల్సిన పనిలేదని అధికారులు స్పష్టం చేశారు. విద్యార్థులు తమకు నచ్చిన పరీక్షా కేంద్రాన్ని (నగరాన్ని) ఎంచుకోవడానికి వారం రోజుల పాటు గడువు ఇస్తున్నట్లు, జూన్ 14న హాల్‌టికెట్లు విడుదల చేస్తామని ఎన్‌టీఏ వెల్లడించింది. నీట్ వ్యవహారం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ స్పందిస్తూ, విద్యార్థుల భవిష్యత్తుకు నష్టం కలగకుండా పారదర్శకంగా పరీక్ష నిర్వహించడమే తమ ప్రథమ కర్తవ్యమని పేర్కొన్నారు. లీకేజీలకు శాశ్వత పరిష్కారంగా వచ్చే ఏడాది నుంచి నీట్ పరీక్షను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు. ఈ కేసు దర్యాప్తును ఇప్పటికే సీబీఐకి అప్పగించామని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే తప్పుడు వార్తలను నమ్మి విద్యార్థులు ఆందోళన చెందవద్దని, అధికారిక వెబ్‌సైట్లలో వచ్చే సమాచారాన్నే ప్రామాణికంగా తీసుకోవాలని ఆయన సూచించారు. మరోవైపు, సీబీఐ దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. రాజస్థాన్‌లోని సికార్ కేంద్రంగా జరిగిన ఈ లీకేజీ వ్యవహారంలో గతేడాది కూడా అక్రమాలు జరిగినట్లు అధికారులు అనుమానిస్తున్నారు. కీలక నిందితుడు వికాస్ బివాల్ కుటుంబంలోని పలువురు సభ్యులు గతేడాది లీకైన పేపర్ల సహాయంతోనే ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీట్లు సాధించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. టెన్త్, ఇంటర్ మార్కులతో పోలిస్తే నీట్‌లో అనూహ్యంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల జాబితాను సీబీఐ క్షుణ్ణంగా పరిశీలిస్తోంది. లీకైన ఒక్కో పేపర్‌ను నిందితులు సుమారు 5 లక్షల రూపాయలకు విక్రయించినట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది. మహారాష్ట్రలోని నాసిక్ నుంచి ప్రారంభమైన ఈ లీకేజీ నెట్‌వర్క్ హరియాణా, జమ్మూకశ్మీర్, కేరళ వంటి పలు రాష్ట్రాలకు విస్తరించినట్లు సమాచారం.

# తమిళనాడులో 'విదేశీ' ఓట్లు

ఇమ్మిగ్రేషన్ అధికారుల దర్యాప్తులో వెల్లడి.. పది మంది అరెస్ట్

చూపుడు వేలిపై ఇంకు గుర్తుతో దొరికిపోయిన వైనం..

ఓటర్ల జాబితా తయారీపై వెల్లువెత్తుతున్న విమర్శలు



**చెన్నై, మే 15:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విదేశీయులు ఓటు హక్కు వినియోగించుకోవడం ఇప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. ఎన్నికల అధికారుల కళ్లు గప్పి విదేశీ పౌరులు ఓటింగ్ లో పాల్గొన్న వైనాన్ని ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంలో ఇప్పటివరకు పది మందిని అరెస్ట్ చేయగా, వీరిలో అధిక శాతం శ్రీలంకకు చెందిన వారే ఉండటం గమనార్హం. ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాత, భారత్ నుంచి విదేశాలకు వెళ్తున్న కొందరు ప్రయాణికుల చూపుడు వేలుపై 'ఓటింగ్ ఇంకు' గుర్తు ఉండటాన్ని చెన్నై, మధురై విమానాశ్రయాల్లోని ఇమ్మిగ్రేషన్ అధికారులు గమనించారు. విదేశీ వీసాలు, పాస్‌పోర్టులు కలిగి ఉండి కూడా భారత ఎన్నికల్లో ఎలా ఓటు వేశారనే అనుమానంతో వారిని ప్రశ్నించగా, తాము ఓటు వేసినట్లు అంగీకరించారు. దీంతో గత మంగళవారం (మే 12) నుంచి వరుస అరెస్టులు మొదలయ్యాయి. అరెస్టయిన పది మందిలో శ్రీలంకకు చెందిన రంజిని (59), సర్ఫుదీన్ (68), నీలాంతి (44), జయంతన్ (40) వంటి వారితో పాటు బ్రిటన్‌కు చెందిన అయ్యదురై (53), ఇండోనేషియాకు చెందిన టిటిన్ మరియాట్టి (47), కెనడా పౌరుడు జితేంద్రనాథ్ (38) ఉన్నారు. విదేశీ పౌరులైన వీరికి కేంద్ర ఎన్నికల సంఘం అధికారికంగా ఓటరు గుర్తింపు కార్డులు జారీ చేయడం గమనార్హం. ఇది చట్టవిరుద్ధమని పేర్కొన్న అధికారులు, ఈ కార్డులు జారీ చేసిన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### సర్వే ప్రక్రియపై ప్రశ్నలు

ఇటీవలే ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక తనిఖీల ద్వారా తమిళనాడులో సుమారు 74 లక్షల బోగస్ ఓట్లను తొలగించి, 28 లక్షల కొత్త ఓటర్లను చేర్చారు. ఇంత పెద్ద ఎత్తున సర్వే జరిగినప్పటికీ, విదేశీయుల పేర్లు ఓటరు జాబితాలో ఎలా కొనసాగుతున్నాయని విపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. ఓటర్ల జాబితా ప్రక్షాళన సరిగ్గా జరగలేదని, ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి. విదేశీయుల ఓటింగ్ అంశం ఇప్పుడు తమిళనాడు రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది.



# పెట్రో, డీజిల్ ధరల పెరుగుదల

లీటర్‌పై కనీసంగా రూ.3 పెంపు

ధరలు పెంచుతూ ఆయిల్ కంపెనీల నిర్ణయం

**న్యూఢిల్లీ, మే 15:** ఊహించినట్లుగానే.. దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగాయి. లీటరు పెట్రోల్‌పై సగటున రూ.3, డీజిల్‌పై రూ.3 పెంచుతూ ఆయిల్ కంపెనీలు నిర్ణయం తీసుకున్నాయి. పెరిగిన ధరలు శుక్రవారం ఉదయం 6 గంటల నుంచే అమల్లోకి వచ్చాయి. పశ్చిమాసియాలో కొనసాగుతోన్న సంక్షోభం నేపథ్యంలో.. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు పెరిగాయి. అయినప్పటికీ.. ప్రభుత్వరంగ చమరు కంపెనీలు దాదాపు 11 వారాల పాటు ఇంధన ధరలను స్థిరంగా ఉంచాయి. అయితే, అవి తీవ్ర ఆర్థికఒత్తిళ్లు ఎదుర్కొంటున్న నేపథ్యంలో.. లీటరుకు రూ.3 పెంచి వాహనదారులపై కొంత భారాన్ని మోపాయి. 2022 ఏప్రిల్ నుంచి పెట్రోల్, డీజిల్ ధరలు దాదాపు మారలేదు. అయితే, లోక్‌సభ ఎన్నికలకు ముందు 2024 మార్చిలో లీటరుకు రూ.2 చొప్పున తగ్గించాయి. తాజా ఉద్రిక్తతల నేపథ్యంలో దేశంలో ఇంధన ధరలు పెరుగుతాయంటూ ఇటీవల పెద్దఎత్తున ప్రచారం జరిగింది. అయితే, సరిపడా నిల్వలు ఉన్నాయంటూ కేంద్రం వాటిని ఎప్పటికప్పుడు తోసిపుచ్చుతూ వచ్చింది. ఈ క్రమంలో ధరలు పెంచడం గమనార్హం. కాగా.. ఈ ప్రకటనలకు ముందే ఇంధన ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందనే వార్తలు దేశంలోని వాహనదారులను ఆందోళనకు గురిచేశాయి. దీంతో పెట్రోల్ బంకుల వద్ద బారులు తీరారు. ఈ క్రమంలో కొన్ని బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. సీఎన్‌జీ వాహనదారులకు కూడా గ్యాస్ కంపెనీలు షాకిచ్చాయి. కిలో సీఎన్‌జీని రూ.2 చొప్పున పెంచాయి. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ3.29, డీజిల్‌పై రూ.3.14, తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ఆయిల్ కంపెనీలు పెంచాయి. పెట్రోల్ ధరలు: ఢిల్లీలో రూ.97.77, కోల్‌కతాలో 108.74, ముంబయిలో 106.68, చెన్నైలో 103.67 (2.83)గా ఉండనున్నాయి. ఇక డీజిల్ ధరలు: ఢిల్లీలో 90.67, కోల్‌కతాలో 95.13, ముంబయి 93.14, చెన్నైలో 95.25గా ఉండనున్నాయి. దాంతో దేశంలోని ప్రధాన మెట్రో నగరాల్లో వీటి ధరలు మారాయి. పశ్చిమాసియాలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో ప్రపంచంలో ముడి చమురు ధరలు విపరీతంగా పెరిగాయి. దీంతో పెట్రోల్, డీజిల్ ధరలు పెంచాలని ఆయిలు కంపెనీలు నిర్ణయించాయి. ఈ ఏడాది మార్చి, ఏప్రిల్ మాసాల్లోనే పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిన సంగతి తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌లో పెట్రోల్‌పై రూ.3.29, డీజిల్‌పై రూ.3.14పై పెంచాయి. తెలంగాణలో పెట్రోల్, డీజిల్‌పై రూ.3 చొప్పున ధరలు పెంచాయి.

# ఆర్జీ కర్ హత్యాచారం కేసులో ముగ్గురు ఐపీఎస్‌ల సస్పెన్షన్

**కోల్‌కతా:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిన ఆర్జీ కర్ మెడికల్ కాలేజీలో అత్యాచారం, హత్య కేసులో విధినిర్వహణల్లో నిర్లక్ష్యం వహించిన ముగ్గురు అధికారులపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆ ముగ్గురినీ సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటించారు. వీరిలో అప్పటి కోల్‌కతా పోలీస్ కమిషనర్ వినీత్ గోయెల్, అభిషేక్ గుప్తా, మనోజ్ మఖోపాధ్యాయ్ ఉన్నారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో ఈ ఘటనను బీజేపీ ప్రధానంగా ఆర్జీ కర్ బాధితురాలికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చింది. బాధితురాలి తల్లికి రత్న దేబ్‌నాథ్‌కు పానిహతి అసెంబ్లీ నియోజకవర్గం నుంచి టికెట్ కూడా ఇచ్చింది. ఆ నియోజకవర్గం నుంచి టీఎంసీ అభ్యర్థి తీర్థంకర్ ఘోష్‌పై రత్న దేబ్‌నాథ్ 28,836 ఓట్ల భారీ ఆధిక్యంతో గెలుపొందారు.




# ఆ స్థలం ఆలయానిదే!

భోజ్‌శాల వివాదంలో ఇండోర్ కోర్టు తీర్పు

సరస్వతీ దేవి విగ్రహ ఏర్పాటుకు అనుమతి

మసీదుకు ప్రత్యామ్నాయ స్థలం చూసుకోవాలని సూచన

ఇండోర్, మే 15: దశాబ్దాలుగా నలుగుతున్న మధ్యప్రదేశ్‌లోని ధార్ 'భోజ్‌శాల' వివాదానికి తెరదించుతూ ఇండోర్ కోర్టు శుక్రవారం సంచలన తీర్పునిచ్చింది. వివాదాస్పదంగా మారిన ఆ స్మారక కట్టడం హిందూ దేవాలయమేనని హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం స్పష్టం చేసింది. అక్కడ తిరిగి వాగ్దేవి (సరస్వతి) విగ్రహాన్ని ఏర్పాటు చేసుకునేందుకు హిందూ వర్గాలకు అనుమతినిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. 2024లో భారత పురావస్తు శాఖ (ఏఎస్ఐ) సుమారు 98 రోజుల పాటు ఈ ప్రాంగణంలో శాస్త్రీయ సర్వే నిర్వహించింది. దీనికి సంబంధించిన నివేదికను జూలై 15, 2024న కోర్టుకు సమర్పించింది. ఆ నివేదికలోని ఆధారాలను, చారిత్రక వాస్తవాలను పరిశీలించిన ధర్మాసనం.. అది ప్రాచీన సరస్వతీ క్షేత్రమేనని నిర్ధారించింది. ఈ నేపథ్యంలో, మొత్తం ఆలయ ప్రాంతాన్ని పురావస్తు శాఖ తన ఆధీనంలోకి తీసుకుని పర్యవేక్షించాలని కోర్టు ఆదేశించింది. హిందువులు వాగ్దేవి ఆలయంగా, ముస్లింలు కమల్ మౌలా మసీదుగా భావించే ఈ ప్రదేశంలో 2003 నాటి ఒప్పందం ప్రకారం ఇరు వర్గాలు వేర్వేరు రోజుల్లో ప్రార్థనలు చేసుకుంటున్నాయి. అయితే, తాజా తీర్పుతో ఆ నిబంధనలకు తెరపడింది. సదరు స్థలం ఆలయానికి



చెందినదని తేల్చిన కోర్టు.. ముస్లిం వర్గం మసీదు కోసం ప్రత్యామ్నాయ స్థలాన్ని కోరుతూ దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న ఈ సుదీర్ఘ న్యాయపోరాటంలో ఇండోర్ బెంచ్ ఇచ్చిన ఈ తీర్పు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.



# ఉన్నత విద్యారంగం బలోపేతానికి చర్యలు

## యూనివర్సిటీల్లో 1,523 ఫ్యాకల్టీ పోస్టులు భర్తీ

### విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్ వెల్లడి

**అమరావతి, మే 15:** ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యారంగం బలోపేతానికి ప్రభుత్వం మరో ముందడుగు వేస్తుందని రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. రాష్ట్రంలోని 19 యూనివర్సిటీలు, ఆర్జీయూకేటీ వర్సిటీల్లో 1,523 ఫ్యాకల్టీ పోస్టులు భర్తీ చేయనున్నట్లు ఆయన వివరించారు. అందుకు సంబంధించిన నియామకాల నోటిఫికేషన్ ఈ రోజు విడుదల చేస్తున్నట్లు ప్రకటించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు 1,020.. అసోసియేట్ ప్రొఫెసర్లు 334 పోస్టులు.. ప్రొఫెసర్లు 63, లెక్చరర్లు 104 సహా 279 బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేస్తున్నట్లు వివరించారు. ఈ నియామకాల్లో కాంట్రాక్ట్ ఫ్యాకల్టీకి అదనపు వెయిటేజ్ వర్తింప చేస్తామని లోకేశ్ తెలిపారు. మే 18వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. ఇది ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యారంగం బలోపేతానికి మరో ముందడుగు అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 4,343 పోస్టులకు గాను ప్రస్తుతం 972 మంది మాత్రమే సేవలు అందిస్తున్నారని ఆయన సోదాహరణగా వివరించారు. అకడమిక్ ఎక్సలెన్స్, రీసెర్చ్, ఇన్నోవేషన్‌కు ప్రాధాన్యం ఇస్తున్నట్లు మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఎన్ఏఏసీ, ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్ మెరుగుదల లక్ష్యంగా ఈ నియామకాలు చేపడుతున్నట్లు చెప్పారు. పారదర్శక, ప్రతిభ ఆధారంగా ఈ నియామక పక్రియ చేపడతామని వివరించారు. వివరాలను వెబ్‌సైట్ లో దరఖాస్తు చేసుకోవాలని అభ్యర్థులకు మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. మరిన్ని వివరాలు అందులోనే ఉంటాయని మంత్రి నారా లోకేశ్ చెప్పారు. యువత భవిష్యత్తును తీర్చిదిద్దే అవకాశమిదేనని ఆయన అభివర్ణించారు. సమయ పాలనతో ఈ నియామకాలు పూర్తి చేస్తామని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. ఈ మేరకు మంత్రి లోకేశ్ తన ఎక్స్ ఖాతా వేదికగా వివరాలను వెల్లడించారు.

# బాబాయే కీచకుడు

## బాలికపై పలుమార్లు లైంగికదాడి..

### ఫొటోలతో బ్లాక్‌మెయిల్ చేసి ఘాతుకం..




**తిరుపతి, మే 15:** రక్షణగా ఉండాల్సిన బాబాయే కామాంధుడిలా మారి, కన్నబిడ్డలా చూసుకోవాల్సిన బాలికపై అఘాయిత్యానికి ఒడిగట్టిన ఘటన తిరుపతిలో వెలుగుచూసింది. వేసవి సెలవులకు వచ్చిన బాలిక వ్యక్తిగత ఫొటోలను అడ్డుపెట్టుకుని, సోషల్ మీడియాలో పెడతానంటూ బెదిరించి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లి ఫిర్యాదుతో ఈ దారుణం ఆలస్యంగా బయటపడింది. వివరాల్లోకి వెళితే.. హైదరాబాద్ కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన 16 ఏళ్ల బాలిక ఇంటర్ చదువుతోంది. ఏప్రిల్ నెలలో వేసవి సెలవుల కోసం తిరుపతిలోని తన చిన్నమ్మ ఇంటికి వెళ్లింది. అక్కడ పిన్ని భర్త రామమూర్తి బాలిక ఫోన్‌లోని కొన్ని వ్యక్తిగత ఫొటోలను చూసి, వాటిని సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేస్తానని బెదిరించడం మొదలుపెట్టాడు. ఆ ఫొటోలను అడ్డుపెట్టుకుని బాధితురాలిపై పలుమార్లు లైంగికదాడి చేశాడు. సెలవుల అనంతరం బాలిక హైదరాబాద్‌కు తిరిగి వచ్చినప్పటికీ, నిందితుడు ఫోన్ ద్వారా బ్లాక్‌మెయిల్ చేయడం ఆపలేదు. కాగా, పరీక్షలు రాసేందుకు సిద్ధమవుతున్న బాలిక మానసికంగా కుంగిపోవడాన్ని గమనించిన తల్లి, ప్రేమతో నిలదీయగా అసలు విషయం బయటపడింది. బాబాయే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని తెలిసి షాక్‌కు గురైన తల్లి వెంటనే జగద్గిరిగుట్ట పోలీసులను ఆశ్రయించింది. ఘటన తిరుపతిలో జరగడంతో పోలీసులు 'జీరో ఎఫ్ఐఆర్' నమోదు చేసి, కేసును తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. తిరుపతి పోలీసులు నిందితుడు రామమూర్తిపై లైంగికదాడి, పోక్సో చట్టం కింద కఠిన సెక్షన్లతో కేసు నమోదు చేశారు. బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహిస్తుండగా, శరీరంపై గాయాలు ఉన్నట్లు గుర్తించారు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉండటంతో పోలీసులు ప్రత్యేక బృందాలతో గాలింపు ముమ్మరం చేశారు.

# ఆగివున్న లారీని ఢీకొన్న కారు

### ప్రమాదంలో ఇద్దరు మహిళల దుర్మరణం

**చిత్తూరు, మే 15:** జిల్లాలోని పూతలపట్టు మండలం పి.కొత్తకోట రైల్వే బ్రిడ్జి సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలుకోల్పోయారు. ఆగి ఉన్న లారీని ఓ కారు బలంగా ఢీకొట్టింది. ప్రమాద సమయంలో కారులో ఎనిమిది మంది ప్రయాణిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఇద్దరు మహిళలు అక్కడికక్కడే మృతి చెందారు. మిగిలిన వారు గాయపడ్డారు. సమాచారం అందిన వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని గాయపడిన వారిని చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన వారు తెలంగాణకు చెందిన వారుగా సమాచారం. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# డ్రోన్ టెక్నాలజీతో యుద్ధరంగంలో కొత్త అధ్యాయం

- యుద్ధరంగంలో 'డ్రోన్' టెక్నాలజీ గేమ్ ఛేంజర్
- కర్నూలు ఇక 'డ్రోన్ హబ్'..
- కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్
- పుట్టపర్తిలో భారీ డిఫెన్స్ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన



**పుట్టపర్తి, మే 15(మనసులో మాట):** ఆధునిక యుద్ధతంత్రంలో డ్రోన్ సాంకేతికత ఒక గేమ్ ఛేంజర్‌గా మారిందని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అభివర్ణించారు. శుక్రవారం సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి ఆయన పర్యటించారు. పుట్టపర్తి-కోడూరు రోడ్డులోని 130 ఎకరాల విస్తీర్ణంలో రూ. 15,803 కోట్ల భారీ వ్యయంతో నిర్మించనున్న యుద్ధ విమానాల తయారీ పరిశ్రమకు వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో కేంద్ర మంత్రి కీలక ప్రసంగం చేశారు. ఒకప్పుడు రక్షణ పరికరాల దిగుమతిలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్న భారత్, ఇప్పుడు ఆయుధాల తయారీలో స్వయం సమృద్ధి సాధిస్తోందని రాజ్‌నాథ్ సింగ్ గర్వంగా ప్రకటించారు. 2004లో కేవలం రూ. 46 వేల కోట్లుగా ఉన్న దేశీయ ఆయుధ ఉత్పత్తి, గత పదేళ్ల కఠోర శ్రమ ఫలితంగా ఇప్పుడు రికార్డు స్థాయిలో రూ. 1.75 లక్షల కోట్లకు చేరిందని ఆయన వెల్లడించారు. రక్షణ రంగంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం పెరగడం వల్లే ఈ అద్భుత ప్రగతి సాధ్యమైందని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌ను రక్షణ రంగ కేంద్రంగా తీర్చిదిద్దే క్రమంలో కర్నూలు జిల్లాను 'డ్రోన్ హబ్'గా మార్చనున్నట్లు మంత్రి ప్రకటించారు. సుమారు 8 డ్రోన్ కంపెనీలు కలిసి కర్నూలులో 'డ్రోన్ సిటీ' ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని, ఇకపై కర్నూలును డ్రోన్ హబ్‌గా పిలుస్తారని తెలిపారు. కేవలం యుద్ధరంగంలోనే కాకుండా ఆర్థిక, వ్యవసాయ రంగాల్లోనూ డ్రోన్ల పాత్ర కీలకమని ఆయన గుర్తు చేశారు. వీటితో పాటు ఏపీలో రూ. 480 కోట్లతో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ యూనిట్‌ను ప్రారంభిస్తున్నామని, అలాగే హెచ్ఎఫ్ సీఎల్‌సంస్థ రూ. 1,294 కోట్ల పెట్టుబడితో ముందుకు వస్తోందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, అనగాని సత్యప్రసాద్, టీజీ భరత్, సత్యకుమార్ యాదవ్ మరియు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. పుట్టపర్తిలో ఏర్పాటు చేస్తున్న ఈ భారీ పరిశ్రమ ద్వారా వేలాది మందికి ఉపాధి లభించడమే కాకుండా, రాయలసీమ ప్రాంత పారిశ్రామిక రూపురేఖలు మారనున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ సందర్భంగా ఆశాభావం వ్యక్తం చేశారు.

# దేశం గర్వించేలా పుట్టపర్తి అభివృద్ధి

- రాయలసీమ ఒకప్పుడు డ్రాట్ జోన్
- ఇప్పుడు గ్రోత్ జోన్‌గా మారింది
- జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్‌లో 600 కిలోల బంగారం ఉత్పత్తి
- అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టుకు శంకుస్థాపన
- దేశ అభివృద్ధిలో ఇక ఎపి కీలక భూమి అన్న చంద్రబాబు



**పుట్టపర్తి, మే 15:** దేశం గర్వించే రక్షణ కేంద్రంగా పుట్టపర్తి తయారుకాబోతందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో 650 ఎకరాల్లో అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టు నిర్మాణానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, చంద్రబాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు మాట్లాడారు. పుట్టపర్తి అనగానే సత్యసాయిబాబా గుర్తొస్తారు. తన బోధనలతో విశ్వశాంతికి కృషి చేశారు. రాయలసీమ ఒకప్పుడు డ్రాట్ జోన్ అని.. ఇప్పుడు గ్రోత్ జోన్‌గా మారిందన్నారు. ఒకప్పుడు గోల్డ్ అంటే కేజీఎఫ్ గుర్తొచ్చేదని.. ఇకపై జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్ అని చెప్పుకుంటారని తెలిపారు. ఈ ఏడాది జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్‌లో 600 కిలోల బంగారం ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్స్‌లో 1,500 కిలోల బంగారం ఉత్పత్తి చేస్తామన్నారు. బంగారం ఉత్పత్తికి చిరునామాగా ఏపీ నిలవనుందని చెప్పుకొచ్చారు. ఆపరేషన్ సిందూర్ భారతీయులకు గర్వకారణం. ఇప్పుడు అడ్వాన్స్ మీడియం కంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్ ప్రాజెక్టు రావడం ఎంతో కీలకమన్నారు. ఏఎంసీఏ ప్రాజెక్టు ద్వారా ఆత్మనిర్భర్ భారత్ లక్ష్య సాధనలో ఆంధ్రప్రదేశ్ ముఖ్య పాత్ర పోషిస్తుందని చంద్రబాబు తెలిపారు. ఆధునిక స్టెల్త్ యుద్ధ విమానాల తయారీకి ఈ ప్రాజెక్టు దోహదపడుతుందన్నారు. భారత రక్షణ శక్తిని ప్రపంచానికి చాటడంలో ఆపరేషన్ సిందూర్ ఓ ప్రత్యక్ష ఉదాహరణగా నిలిచిందని సీఎం తెలిపారు. ఆపరేషన్ సిందూర్‌లో వినియోగించిన డ్రోన్లు ఏపీలోనే తయారు చేసి పరీక్షించారని చెప్పారు. ఈ ప్రాజెక్టును ఏపీకి కేటాయించినందుకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా రూ.15 వేల కోట్లకు పైగా పెట్టుబడితో 7,500 మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఫైటర్ జెట్ ఇంటిగ్రేషన్‌తో పాటు పైలట్ టెస్టింగ్ కేంద్రంగా పుట్టపర్తి అభివృద్ధి చెందుతుందన్నారు. కేవలం 36 రోజుల్లోనే ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగలిగామని.. జెట్ స్పీడ్‌తో అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఏరోస్పేస రంగంలో ఈ కీలక ప్రాజెక్టుతో మరిన్ని డిఫెన్స్ ప్రాజెక్టులు రాబోతున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. భారత్ ఫోర్జ్, హెచ్ఎఫ్‌సీఎల్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్‌తో కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీలకు శంకుస్థాపన చేశామని తెలిపారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేసి ఉత్పత్తి ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. శ్రీహరికోట అంతరిక్ష శక్తి, నాగాయలంక క్షిపణి శక్తి, పుట్టపర్తి రక్షణ శక్తి, విశాఖ నౌకాదళ శక్తిగా ఏపీ దేశానికి అండగా నిలుస్తుందని సీఎం అన్నారు. కడప స్టీల్ ప్లాంట్ పనులను జూన్‌లో ప్రారంభిస్తామని ప్రకటించారు. 2028 నాటికి కడప స్టీల్‌ప÷-లాంట్‌ను పూర్తిచేస్తామన్నారు. నాడు ఎన్టీఆర్, నేడు కూటమి ప్రభుత్వం రాయలసీమకు నీరిచ్చేందుకు కృషి చేస్తోందన్నారు. ప్రతి ఎకరాకు నీరు అందించేందుకు కృషి చేస్తున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో డ్రోన్ సిటీ ద్వారా భారతదేశంలోనే ఆధునిక డ్రోన్ ఎకో సిస్టమ్‌కు శ్రీకారం చుట్టాం. రూ.686 కోట్లతో 8 సంస్థలు ఏర్పాటు కాబోతున్నాయి. వీటి ద్వారా 2,500 మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ఒకప్పుడు రాయలసీమ అంటే రతనాల సీమ. ఒకానోక దశలో అనంతపురం ఎడారిగా మారిపోయింది. రాయలసీమ రూపు రేఖలు పూర్తిగా మార్చిన ఘనత ఎన్టీఆర్‌ది. సీమకు నీళ్లు తీసుకురావాలి, ప్రజల జీవితాలను మార్చాలని ఎన్టీఆర్ సంకల్పించారు. ఆయన శ్రీకారం చుట్టిన ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం. సమర్థ నీటి నిర్వహణతో సీమకు జలహారతి ఇచ్చాం. కేంద్రం సహకారంతో రాయలసీమ రూపు రేఖలు మారబోతున్నాయి. రాయలసీమను మళ్లీ రతనాలసీమ చేసే బాధ్యతను ఎన్డీఏ ప్రభుత్వం తీసుకుంటుంది. కడప స్టీల్‌ప్లాంట్ పనులు జూన్‌లో ప్రారంభించి 2028 నాటికి నిర్మాణం పూర్తి చేసి రాయలసీమకు కానుకగా ఇస్తాం. దేశానికి ఏపీ రక్షణకవచంగా నిలబడుతోంది. ఒకప్పుడు గోల్డ్ అంటే కేజీఎఫ్.. ఇప్పుడు జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్. ఈ ఏడాది జొన్నగిరి గోల్డ్ ఫీల్డ్‌లో 600 కిలోలు, వచ్చే ఏడాది 1500 కిలోల బంగారం ఉత్పత్తి చేస్తాం. బంగారం ఉత్పత్తికి చిరునామాగా ఆంధ్రప్రదేశ్ మారబోతోందని సీఎం అన్నారు.

# పొదుపు చర్యల్లో టీడీపీ మరో అడుగు

- మహానాడును వర్చువల్‌గా నిర్వహించాలని నిర్ణయం
- నెల్లూరులో నిర్వహించాలనుకున్న మహానాడు రద్దు
- మంగళగిరి పార్టీ కార్యాలయంలో మహానాడు ఏర్పాట్లు
- వర్చువల్గా జిల్లా పార్టీ కార్యాలయాల ద్వారా ప్రసారం



**అమరావతి, మే 15:** పొదుపు చర్యల్లో భాగంగా తెదేపా అధినేత, సీఎం చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకున్నారు. మహానాడును ఈసారి ఆన్‌లైన్‌లో నిర్వహించాలని నిర్ణయించారు. అమరావతిలోని తెదేపా కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో వేదిక ఏర్పాటు చేసి నిర్వహించాలని పార్టీ నేతలకు సీఎం సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా 1,845 క్లస్టర్లలో పార్టీ శ్రేణుల కోసం ప్రత్యేక స్క్రీన్లు ఏర్పాటు చేయనున్నారు. ఎన్టీఆర్ భవన్ నుంచి పొలిట్ బ్యూరో సభ్యులు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈసారి నెల్లూరు జిల్లాలో మహానాడు నిర్వహించాలని తొలుత నిర్ణయించి ఏర్పాట్లు ప్రారంభించారు. పొదుపు చర్యల్లో భాగంగా ఆన్‌లైన్‌లో నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈనెల 27, 28న మహానాడు జరగనున్న సంగతి తెలిసిందే. తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే మహానాడుపై పార్టీ హై కమాండ్ కీలక నిర్ణయం తీసుకుంది. ముందుగా నెల్లూరులో మూడు రోజుల పాటు నిర్వహించాలని భావించిన మహానాడును ఇప్పుడు మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో హైబ్రిడ్ విధానంలో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు మే 27, 28 తేదీల్లో రెండు రోజుల పాటు మహానాడు కార్యక్రమం నిర్వహించేందుకు నిర్ణయించారు. భారీ జన సమీకరణకు బదులుగా సాంకేతికతను వినియోగిస్తూ రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులను అనుసంధానించే విధంగా ఈసారి మహానాడును నిర్వహించనున్నట్లు తెలుస్తోంది. టీడీపీ చరిత్రలో హైబ్రిడ్ విధానంలో మహానాడు నిర్వహణకు తీసుకున్న ఈ నిర్ణయం రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేకెత్తిస్తోంది. పార్టీ కార్యకర్తల భాగస్వామ్యాన్ని పెంచుతూ, సమర్థవంతమైన నిర్వహణకు ఈ విధానం ఉపయోగపడుతుందని టీడీపీ నేతలు భావిస్తున్నారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో పరిమిత సంఖ్యలో నేతలు ప్రత్యక్షంగా పాల్గొనగా, జిల్లాలు, నియోజకవర్గాలు, క్లస్టర్ల స్థాయిలో నాయకులు, కార్యకర్తలు వర్చువల్ విధానంలో హాజరుకానున్నారు. మంగళగిరిలో జరిగే మహానాడుకు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, కేంద్ర కమిటీ, రాష్ట్ర కమిటీ సభ్యులు, అధికార ప్రతినిధులు ప్రత్యేక ఆహ్వానితులుగా ప్రత్యక్షంగా హాజరవుతారు. అలాగే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, ఎంపీలు, ముఖ్య నాయకులు తమ తమ నియోజకవర్గాల నుంచి ఆన్‌లైన్ ద్వారా కార్యక్రమంలో పాల్గొంటారు. పార్టీకి చెందిన 1848 క్లస్టర్ల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు కూడా ఆయా క్లస్టర్ల నుంచే వర్చువల్‌గా మహానాడులో పాల్గొనేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ శ్రేణులు ఒకేసారి మహానాడును వీక్షించేలా సాంకేతిక సదుపాయాలను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. అంతేకాకుండా మహానాడులో ప్రవేశపెట్టే రాజకీయ, ఆర్థిక, సంక్షేమ తీర్మానాలు సహా అన్ని కార్యక్రమాలు సంప్రదాయ మహానాడు తరహాలోనే నిర్వహించనున్నట్లు టీడీపీ నేతలు వెల్లడించారు. తీర్మానాల ఆమోదం, నాయకుల ప్రసంగాలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చలు అన్నీ హైబ్రిడ్ మోడల్‌లో కొనసాగనున్నాయి. పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రభుత్వ విధానాలపై చర్చ, భవిష్యత్తు రాజకీయ వ్యూహాల రూపకల్పన వంటి అంశాలు ఈ మహానాడులో ప్రధాన అజెండాగా ఉండనున్నాయి.

# కొడంగల్ గ్రంథాలయంలో ఘనంగా 'గ్రంథాలయ దినోత్సవం'

- **ఉపాధ్యాయులు సభ్యత్వం తీసుకోవాలని ఎంఈఓ రామ్ రెడ్డి పిలుపు**

**కొడంగల్ మున్సిపల్, మే15(సమయం న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" విద్యా వారోత్సవాల్లో భాగంగా, శుక్రవారం కొడంగల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ గ్రంథాలయంలో "గ్రంథాలయ దినోత్సవం" అత్యంత ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖాధికారి (వీజూా) రామ్ రెడ్డి గారు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంఈఓ రామ్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంపొందించడంలో గ్రంథాలయాలు విజ్ఞాన గనులని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితం కాకుండా, నిరంతర జ్ఞాన సముపార్జన కోసం గ్రంథాలయాలను విరివిగా వినియోగించుకోవాలని సూచించారు. ప్రతి ఉపాధ్యాయుడు గ్రంథాలయ సభ్యత్వం పొంది, విద్యార్థులకు ఆదర్శంగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

**కార్యక్రమ విశేషాలు:** నూతన ఉపాధ్యాయురాలికి అభినందనలు: ఇటీవల ఉపాధ్యాయ నియామకాల్లో ఎంపికై, కొడంగల్ లోని సి.పి.ఎస్ (జూూా) బాయ్స్ ప్రైమరీ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా బాధ్యతలు చేపట్టిన మంజుల ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ కొలువు సాధించి విద్యా సేవలో చేరిన ఆమెను ఎంఈఓ రామ్ రెడ్డి



మరియు తోటి ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

**సభ్యత్వ నమోదు:** ఎంఈఓ పిలుపు మేరకు కార్యక్రమంలో పాల్గొన్న పలువురు ఉపాధ్యాయులు మరియు పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు ఉత్సాహంగా గ్రంథాలయ సభ్యత్వం తీసుకున్నారు.

**ప్రముఖుల భాగస్వామ్యం:** ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ రమేష్, పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయులు రాధాకృష్ణ, మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు అబ్దుల్ హక్, దినేష్ సింగ్, గోపీనాథ్, అశోక్, అబ్దుల్ హమీద్ బాషా మరియు విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పుస్తక ప్రదర్శన: గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన కొత్త పుస్తకాల ప్రదర్శనను ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. చివరగా, లైబ్రేరియన్ రమేష్ మాట్లాడుతూ గ్రంథాలయంలో అందుబాటులో ఉన్న వసతులను వివరించారు మరియు సభ్యత్వం తీసుకున్న ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం మండలంలోని విద్యా రంగంపై సానుకూల ప్రభావం చూపుతుందని, విద్యార్థుల్లో పుస్తక పఠనం పట్ల మక్కువ పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# హైదరాబాద్ కేంద్రంగా ప్రతిపాదిత హైస్పీడ్ రైలు కారిడార్ ప్రాజెక్టులపై సమీక్షా

**హైదరాబాద్ మే15( సమయం న్యూస్) :** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ కె. రామకృష్ణారావు శుక్రవారం డా. బి. ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో సమీక్షించారు. తెలంగాణ ప్రభుత్వం, కేంద్ర రైల్వే శాఖ భాగస్వామ్యంతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సి.ఎస్ అధికారులను ఆదేశించారు. ప్రాజెక్టు రిపోర్టులు, ప్రాజెక్టు అమలులో అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో కలసి పనిచేయాలని, ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, కనెక్టివిటీ, మౌలిక వసతుల అభివృద్ధి, ఇతర అంశాలపై తగు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. హైదరాబాద్ నుండి ముంబై, చెన్నై, బెంగళూరు ప్రధాన నగరాలకు అనుసంధానించే హై స్పీడ్ రైల్ ప్రాజెక్టు వలన తెలంగాణ రైజింగ్ 2047 ఎకనామిక్ గ్రోత్ కారిడార్ గా అభివృద్ధి చెందే అవకాశం ఉందని సి.ఎస్ పేర్కొన్నారు. దేశంలో వేగవంతమైన రవాణా వ్యవస్థకు హై స్పీడ్ రైలు ప్రాజెక్టు నిలుస్తుందని, ప్రజల భవిష్యత్ అవసరాలకు, పారిశ్రామిక, ఐటి, పర్యాటక రంగాలలో అభివృద్ధికి ఈ ప్రాజెక్ట్ ఉపకరిస్తుందని సి.ఎస్ తెలిపారు.

హైదరాబాద్ -- పూనే -- ముంబై హై స్పీడ్ రైల్ మార్గానికి సంబంధించి డి.పి.ఆర్ సిద్ధం అయ్యిందని రైల్వే అధికారులు తెలిపారు. సూమారు 671 కి. మీటర్ల



మార్గానికి ప్రతిపాదనలు సిద్ధం చేశామని, తెలంగాణ రాష్ట్రంలో 93 కి. మీటర్ల మేరకు భూ సేకరణ అవసరం ఉంటుందని, అదేవిధంగా హైదరాబాద్ -- బెంగళూరు కారిడార్, హైదరాబాద్ -- చెన్నై కారిడార్ లో సూమారు 123 కి.మీటర్ల నిడివిలో భూసేకరణ అవసరమని, కోకాపేట, శంషాబాద్ ప్రాంతాలలో రైల్వే డిపోలకు కొంత భూసేకరణ చేయాలని అధికారులు పేర్కొన్నారు. వీటికి సంబంధించి రోడ్లు, భవనాల శాఖ, హెచ్.యం.డి.ఎ, జీఎంఆర్ ఎయిర్ పోర్టు అధికారులు కేంద్ర రైల్వే ప్రాజెక్టు అధికారులతో సమన్వయం చేసుకొని హై స్పీడ్ రైలు ప్రాజెక్ట్ కు సహకరించాలని సి.ఎస్ అన్నారు. ఈ సమావేశంలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, ఎవీణూా మెట్రోపాలిటన్ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, కేంద్ర రైల్వే శాఖ అధికారులు, జీఎంఆర్ ఎయిర్ పోర్టు అధికారులు పాల్గొన్నారు.

# సహకార రంగ బలోపేతానికి చర్యలు వేగవంతం చేయాలి

- **ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు**

**హైదరాబాద్ మే15( సమయం న్యూస్,) :** సచివాలయంలో రాష్ట్ర సహకార అభివృద్ధి కమిటీ సమావేశంహైదరాబాద్, మే 15: రాష్ట్రంలో సహకార రంగాన్ని మరింత బలోపేతం చేసి గ్రామీణ ఆర్థికాభివృద్ధికి దోహదపడేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు. శుక్రవారం సచివాలయంలో కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శి అశీష్ కుమార్ భుటానీతో కలిసి నిర్వహించిన రాష్ట్ర సహకార అభివృద్ధి కమిటీ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ తెలంగాణలో సహకార ఉద్యమానికి బలమైన వ్యవస్థ ఉన్నదని, గ్రామీణ స్థాయిలో పీఏసీఎస్‌లను మరింత సేవాముఖంగా, ఆర్థికంగా బలోపేతం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యంగా పాల ఉత్పత్తి, మత్స్య రంగాల్లో సహకార వ్యవస్థ విస్తరణకు విస్తృత అవకాశాలు ఉన్నాయని, వీటి ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి, ఆదాయ అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. సహకార సంస్థల్లో ఆధునిక సాంకేతికత వినియోగం, డిజిటల్ సమీకరణ, పారదర్శక ఆర్థిక నిర్వహణ, సామర్థ్యాభివృద్ధిపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. వ్యవసాయ, సహకార శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం 60,925 సహకార సంఘాలు పనిచేస్తున్నాయని తెలిపారు. పీఏసీఎస్‌ల కంప్యూటరీకరణ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం



సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. రైతులకు మార్కెట్ అవకాశాలు పెంచేందుకు తెలంగాణ సహకార యూనియన్ ఆధ్వర్యంలో 311 పీఏసీఎస్‌లను రైతు ఉత్పత్తిదారుల సంస్థలుగా (ఎఫ్‌పీఓలు) అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడిం చారు .సహకార రంగ ఆధునీకరణ, వృత్తిపరమైన నిర్వహణ, ఆర్థిక స్థిరత్వం, డిజిటల్ రూపాంతరం లక్ష్యాలతో రాష్ట్ర సహకార విధానాన్ని ప్రభుత్వం రూపొందిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి సిద్ధార్థ్ జైన్, పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, పశుసంవర్ధక శాఖ కార్యదర్శి ఇళంబర్తి పాల్గొన్నారు.

# బండి బాగిరథ్ బెయిల్ పిటిషన్ విచారణలో మధ్యంతర ఉపశమనం అంశం కీలకంగా మారింది.

ఈ కేసుపై తెలంగాణకు చెందిన హక్కుల న్యాయవాది Rama Rao Immaneni విశ్లేషణ ప్రాధాన్యం సంతరించుకుంది.

వయస్సు నిర్ధారణ విషయంలో సుప్రీంకోర్టు తాజా తీర్పులు స్పష్టమైన మార్గదర్శకాలను ఇచ్చాయని ఆయన పేర్కొన్నారు.

ప్రత్యేకంగా State of Uttar Pradesh Vs Anirudh కేసులో సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.ూాజూూా చట్టం దుర్వినియోగంపై కోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

చట్టాల అమలులో అవకాశవాద దృక్పథం పెరిగిందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది.

నిజమైన ప్రేమ సంబంధాలను నేరంగా మలచడం ఆందోళనకరమని అభిప్రాయపడింది.

Romeo-Juliet Clause' అవసరాన్ని కూడా కోర్టు సూచించింది.

అసత్య ఆరోపణల ద్వారా వ్యక్తిగత కక్షలు తీర్చుకునే ధోరణిని అరికట్టాలని కేంద్ర ప్రభుత్వానికి సూచనలు జారీ చేసింది. వయస్సు నిర్ధారణలో పాఠశాల రికార్డులు, జనన ధృవపత్రాలు, వైద్య ఆధారాల మధ్య సారూప్యత ఉండాలని న్యాయ నిపుణులు చెబుతున్నారు. బాగిరథ్ కేసులో ద్వంద్వ జనన ధృవపత్రాల అంశం ఇప్పుడు కీలకంగా మారింది.

2021లో నమోదైన అండర్ ఏజ్ డ్రైవింగ్ కేసులో బాధితురాలి వయస్సు 15 సంవత్సరాలుగా నమోదైందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో "litmus tes" ఆధారంగా ఆధారాల విశ్వసనీయతను పరిశీలించాల్సిన అవసరం ఉందని Rama Rao Immaneni అభిప్రాయపడ్డారు. మధ్యంతర బెయిల్ అంశంలో కోర్టు ఆధారాల ప్రాథమిక విశ్వసనీయతను పరిశీలించే అవకాశం ఉందని న్యాయ వర్గాలు భావిస్తున్నాయి. POCSO చట్టం రక్షణ కోసం ఉద్దేశించినదే గానీ, వ్యక్తిగత కక్ష సాధనానికి ఆయుధంగా మారకూడదన్న చర్చ మళ్లీ ముందుకు వచ్చింది.

# తెలంగాణలో మాన్సూన్ ముందస్తు ప్రవేశానికి సంకేతాలు?

**హైదరాబాద్ మే15( సమయం న్యూస్) :** తెలంగాణలో ఈసారి మాన్సూన్ సాధారణ సమయానికే ప్రవేశించే అవకాశాలు కనిపిస్తున్నాయని వాతావరణ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితుల ప్రకారం జూన్ తొలి వారం చివరి నాటికి లేదా రెండో వారం ప్రారంభంలో మాన్సూన్ తెలంగాణలోకి ప్రవేశించే అవకాశం ఉందని సూచిస్తున్నారు. ఉత్తర దిశగా కదులుతున్న వీ×ూా సిగ్నల్ ప్రభావంతో మాన్సూన్ వేగంగా ముందుకు సాగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఎల్‌నినో పరిస్థితులు కొనసాగుతున్నప్పటికీ ఈసారి మాన్సూన్ సమయానికి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయని పేర్కొంటున్నారు. అయితే జూన్ రెండోర్ధంలో "బ్రేక్ మాన్సూన్" పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నప్పటికీ, ప్రస్తుతం తొల్షిర్థంపై మాత్రమే దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య గమనికలిఇవి ప్రాథమిక అంచనాలు మాత్రమే. అరేబియా సముద్రంలో తుఫాన్లు ఏర్పడితే పరిస్థితుల్లో మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. తదుపరి వాతావరణ పరిణామాల ఆధారంగా అంచనాలు మారవచ్చని వాతావరణ నిపుణులు పేర్కొంటున్నారు.

# పుస్తక ప్రదర్శన ను ప్రారంభించిన జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా



**మహబూబ్ నగర్ మే 15( సమయం న్యూస్). :** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం లో విద్య వారోత్సవాల సందర్భంగా శుక్రవారం 'లైబ్రరీ డే' ను నిర్వహించడం జరిగింది. జిల్లా గ్రంథాలయ సం దస్థ చైర్మన్ మల్లు నరసింహారెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కేంద్ర గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శనను ముఖ్య అతిథిగా విచ్చేసిన కలెక్టర్ ఖుష్బూ గుప్తా ప్రారంభించారు .ఈ సందర్భంగా లైబ్రరీ లో కలెక్టర్ పాఠకులతో, ప్రభుత్వ ఉద్యోగాలకు సిద్ధమయ్యే విద్యార్థిని విద్యార్థులతో మాట్లాడుతూ గ్రంథాలయంలో ఉన్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. మెట్టు గడ్డ గ్రంథాలయ భవనం ప్రక్కన నిరూపయోగంగా ఉన్న చీజూా భవనాన్ని గ్రంథాలయానికి కేటాయించే విషయం పరిశీలిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఞజూా ప్రవీణ్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి మనోజ్ కుమార్, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు

# కవిత కీలక వ్యాఖ్యలు.. తెలంగాణలో గుణాత్మక మార్పే లక్ష్యం

**హైదరాబాద్: మే15( సమయం న్యూస్) :** తెలంగాణ ప్రజల జీవితాల్లో గుణాత్మక మార్పు తీసుకురావడానికే తెలంగాణ రక్షణ సేనను ప్రారంభించానని కల్వకుంట్ల కవిత అన్నారు. తాను టైం పాస్ కోసం పార్టీ పెట్టలేదని, ప్రజలకు ఉపయోగపడే పనులే తన సంకల్పమని స్పష్టం చేశారు. ఉద్యమ నాయకుడిగా కేసీఆర్ గొప్పవారేనని, అయితే ముఖ్యమంత్రిగా తీసుకున్న నిర్ణయాలపై తనకు అభ్యంతరాలు ఉన్నాయని పేర్కొన్నారు. విద్య, వైద్యం ఉచితంగా అందించడం, వ్యవసాయం, సామాజిక న్యాయం, యువతకు ఉపాధి, మహిళల రక్షణ తమ పార్టీ ప్రధాన లక్ష్యాలని తెలిపారు. పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు పదేళ్లుగా పూర్తికాకపోవడంపై కవిత విమర్శించారు. ఖర్చులు పెరిగినా రైతులకు నీరు అందలేదని, క్షేత్రస్థాయిలోని చిన్న నీటి వనరులను వినియోగించుకునే ప్రత్యేక ప్రణాళిక తమ వద్ద ఉందన్నారు. మహిళలపై దాడులు, పోక్సో కేసుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. బండి సంజయ్ విషయంలో రేవంత్ ప్రభుత్వం ఉదాసీనంగా ఉందని, ఆడపిల్లలను కించపరిచే ప్రచారాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్, బీజేపీలపై విమర్శలు గుప్పించిన కవిత, రేవంత్ రెడ్డి బీజేపీపై మాట్లాడటం లేదని అన్నారు. ప్రాంతీయ పార్టీలను బలహీనపరచేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. 2028 లేదా 2029లో ఎన్నికలు ఎప్పుడు జరిగినా తమ పార్టీ అధికారంలోకి వస్తుందని కవిత ధీమా వ్యక్తం చేశారు. "చివరకు నిజమే గెలుస్తుంది. తెలంగాణకు మంచి చేశాననే పేరు రావాలి" అని ఆమె అన్నారు.

# చేపావ్ ప్రసాదం పంపిణీలో అగర్వాల్ సమాజ్ సేవలు

**హైదరాబాద్, మే 15( సమయం న్యూస్). :** హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జూన్ 8, 9 తేదీల్లో నిర్వహించనున్న బత్తిని సోదరుల చేప ప్రసాదం పంపిణీలో తెలంగాణ అగర్వాల్ సమాజ్ సభ్యులు స్వచ్ఛందంగా సేవలు అందించనున్నట్లు ఆ సమాజ్ వర్కింగ్ ప్రెసిడెంట్ నరేంద్ర గోయల్ తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మృగశిర కార్తె సందర్భంగా ప్రతి ఏటా నిర్వహించే ఈ కార్యక్రమానికి శ్వాసకోశ సమస్యలు, ముఖ్యంగా ఆస్తమా నివారణ కోసం వేలాది మంది హాజరవుతారని చెప్పారు. జూన్ 8 ఉదయం 8.30 గంటలకు ప్రారంభమయ్యే పంపిణీ మరుసటి రాత్రి వరకు నిరంతరాయంగా కొనసాగుతుందని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం ప్రభుత్వం 32 నుంచి 34 ప్రత్యేక కౌంటర్లు, 40కిపైగా క్యూలైన్లు ఏర్పాటు చేస్తోందని వివరించారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో చేప పిల్లలు విక్రయించబడతాయని, పంపిణీ ప్రాంతాన్ని పశువైద్యులు, మత్స్యశాఖ నిపుణులు పర్యవేక్షిస్తారని తెలిపారు.



**వరంగల్:** దుగ్గొండి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. వారసత్వ భూమి వ్యవహారంలో రూ.10 వేల లంచం తీసుకుంటుండగా ఆర్ఐ రాం ప్రభువును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. మధిర గ్రామానికి చెందిన లొల్లటి రాజు తన తండ్రి మరణాంతరం27 గుంటల భూమి తన పేరుపై మార్చేందుకు లంచం డిమాండ్ చేయడంతో ఏసీబీ అధికారులను రాజు ఆశ్రయించాడు.

# పెట్రోల్, డీజిల్ ధరల పెంపుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందన

**హైదరాబాద్ మే15(సమయం న్యూస్) :** : పెట్రోల్, డీజిల్ ధరల పెంపు ప్రజలపై భారం మోపేందుకు తీసుకున్న నిర్ణయం కాదని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. అమెరికా--ఇరాన్ యుద్ధ ప్రభావంతో అంతర్జాతీయంగా క్రూడాయిల్ ధరలు పెరగడంతో దేశవ్యాప్తంగా ఇంధన ధరలు పెరిగాయని తెలిపారు.అమెరికా, జర్మనీ, జపాన్ వంటి దేశాల్లోనూ పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగినట్లు ఆయన పేర్కొన్నారు. క్రూడాయిల్ దిగుమతికి భారీ ఖర్చు అవుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందన్నారు.కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఈ అంశాన్ని రాజకీయంగా వాడుకుంటున్నాయని విమర్శించిన కిషన్ రెడ్డి, ప్రజలు అలాంటి ప్రచారాలకు మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు.

## జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPSని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ఆర్డీవో-ఎల్.రమేష్



**నారాయణపేట, మే,15(సమయం న్యూస్) :** నారాయణపేట జిల్లాకు నూతనంగా నియమితులైన ఆర్డీవో ఎల్. రమేష్ జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ను ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఎస్పీ కి పూల మొక్కను అందజేశారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆర్డీవోకు జిల్లా ఎస్పీ శుభాకాంక్షలు తెలియజేస్తూ, జిల్లా అభివృద్ధి మరియు ప్రజలకు మెరుగైన సేవలందించడంలో పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆకాంక్షించారు.

# నీరుకుళ్ళ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన సిపి



**ఆత్మకూరు మే15( సమయం న్యూస్) :** ఆత్మకూర్ మండలం నీరుకుళ్ళ గ్రామంలో ఎర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్బంగా క్షేత్ర స్థాయిలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరుగుతున్న తీరును పోలీస్ కమిషనర్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్బంగా ధాన్యం కొనుగోలు సమయంలో రైతులు ఎదుర్కోంటున్న సమస్యలు, ఇబ్బందులను పోలీస్ కమిషనర్ రైతులను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకుకోవడంతో , ధాన్యం తరలించేందుకుగా అవసరమైన లారీలు అందుబాటు లేక చాలా ఇబ్బందులకు గురౌవుతున్నట్లు రైతులు పోలీస్ కమిషనర్ దృష్టికి తీసుక పోవడంతో స్పందించిన సిపి లారీల సమస్యను జిల్లా కలెక్టర్,సంబంధిత అధికారుల దృష్టికి తీసుకపోవడం జరుగుతుందని పోలీస్ కమిషనర్ రైతులకు బరోసానిచ్చారు.పోలీస్ కమిషనర్ వెంట ఆత్మకూర్ ఇన్స స్పెక్టర్ సంతోష్, ధాన్యం కొనుగోలు కేంద్రం అధికారులు వున్నారు

# బెస్ట్ అవలీబుల్ స్కూల్ స్కీమ్ లో విద్యార్థుల లక్కీడ్రా ద్వారా ఎంపిక చేసిన జిల్లా కలెక్టర్



**సిద్ధిపేట మే15( సమయం న్యూస్). :** శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీం ప్రక్రియ లో చేరే విద్యార్థులకు సంబంధించి లక్కీ డ్రా ను జిల్లా కలెక్టర్ కె. హైమావతి నేతృత్వంలో జరిగింది. జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఎస్టీ విద్యార్థులు బెస్ట్ అవైలబుల్ స్కూల్ లలో 3 వ తరగతిలో మొత్తం 5 సీట్లు ఉండగా 3 మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని వారికి నేరుగా సర్టిఫికెట్ వెరిఫై చేసి 3 తరగతిలో అడ్మిషన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. 5 వ తరగతిలో మొత్తం 3 సీట్లు ఉండగా 5 దరఖాస్తు చేసుకోగా వీరికి లక్కీ డ్రా ద్వారా 3 గురిలో ఒక బాలిక ఇద్దరు బాలురనీ ఎంపిక చేశారు. ఒకరిని రిజర్వ్ లో ఎంపిక చేశారు. ఇందులో ఎంపికైన ఎస్టీ విద్యార్థులకు సర్టిఫికెట వెరిఫై చేసి సిద్దిపేట అర్బన్ మండలం తడకపల్లి గ్రామంలోని శ్రీ విద్యారణ్య ఆవాస విద్యాలయంలో ఆయా తరగతులలో విద్యను అభ్యసిస్తారని తెలిపారు. బాగా చదవాలని విద్యార్థులకు ఆల్ ద బెస్ట్ తెలిపారు.కలెక్టర్ వెంట ఏ ఓ రాజ్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఫిట్‌నెస్, డ్రగ్స్ నియంత్రణ, ట్రాఫిక్‌పై డీజీపీ సీవీ ఆనంద్ కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, మే 15 (సమయం న్యూస్) :** తెలంగాణ డీజీపీ జు ూఖుఅ ఫిట్‌నెస్, ట్రాఫిక్ నిర్వహణ, డ్రగ్స్ నియంత్రణ, మహిళా సాధికారత, పోలీసింగ్ విధానాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. పోలీసు శాఖలో ప్రజాసేవ భావన అత్యంత ముఖ్యమని, డబ్బు లేదా పవర్ కోసం శాఖలోకి రావొద్దని సూచించారు.తన వృత్తిలో ఫిట్‌నెస్‌కు అత్యంత ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్న ఆయన, 33 ఏళ్లుగా తన బరువు 75-76 కిలోల మధ్యనే కొనసాగుతోందన్నారు. ఇప్పటికీ క్రికెట్ ఆడుతానని, షుగర్, మైదా, రైస్, సాల్ట్ వంటి "ఫోర్ వైట్స్" మానేశానని తెలిపారు. హైదరాబాద్ సీపీగా ఉన్న సమయంలో "ఫిట్ కాప్" కార్యక్రమాన్ని ప్రారంభించి, పోలీసుల ఆరోగ్య పరిస్థితిని యాప్ ద్వారా మానిటరింగ్ చేశామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో 93 వేల మంది పోలీసు సిబ్బంది సాంక్షన్ స్ట్రెంగ్త్ ఉండగా, 20 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు."నేను 150 పర్సెంట్ హైదరాబాదీ" అంటూ హైదరాబాద్‌తో తన అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. పేట్ల బురుజు ఆస్పత్రిలో జన్మించానని, చదువు, క్రికెట్ అన్నీ హైదరాబాద్‌లోనే జరిగాయని తెలిపారు. హైదరాబాద్, వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్, కృష్ణ జిల్లాల్లో పని చేసిన అనుభవం తనకు సమస్యలపై అవగాహన పెంచిందన్నారు.రాష్ట్రంలో ప్రస్తుతం సైబర్ నేరాలు వేగంగా పెరుగుతున్నాయని, ప్రజలు నిమిషాల్లో కోట్ల రూపాయలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ట్రాఫిక్ అడిషనల్ సీపీగా పనిచేసిన అనుభవంతో ట్రాఫిక్ ఫ్రీ ఫ్లో కోసం యూటర్న్‌లు అవసరమని తెలిపారు. ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ బ్యూరో ఏర్పాటుకు ముఖ్యమంత్రి A. Revanth Reddy ఆదేశాలు ఇచ్చారని వెల్లడించారు. హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించడం తప్పనిసరి అని, బ్యాక్ సీట్లో కూర్చున్న వారూ సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు.తెలంగాణలో ప్రధాన సమస్యగా డ్రగ్స్‌ను పేర్కొన్న డీజీపీ, ఈగల్ ఫోర్స్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా నియంత్రణ చర్యలు చేపడుతున్నామని తెలిపారు. స్కూల్స్, కాలేజీల్లో యాంటీ డ్రగ్, యాంటీ ర్యాగింగ్ కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ, పాన్ షాపులపై కూడా ప్రత్యేక నిఘా ఉంచుతున్నామని వెల్లడించారు.హైదరాబాద్ చరిత్రలో తొలిసారి మహిళా అధికారిని లాలగూడ ూూగా నియమించామని గుర్తుచేసిన ఆయన, ప్రస్తుతం 18 మంది ఇజూల్లో 9 మంది మహిళలేనని తెలిపారు. మహిళా అధికారులు మరింత సమర్థంగా పనిచేస్తున్నారని ప్రశంసించారు.పోలీసింగ్ ఎప్పుడూ కఠినంగా ఉండాలని, సంఘ వ్యతిరేక శక్తులు, రౌడీషీటర్లపై కఠిన చర్యలు తీసుకోవాల్సిందేనని స్పష్టం చేశారు. అదే సమయంలో ప్రజలు పోలీసులతో మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. కొత్త తరాల ఆలోచనా విధానం మారుతోందని, జెన్ జీ, ఆల్ఫా జనరేషన్ ప్రభావం పోలీస్ వ్యవస్థలో కూడా కనిపిస్తోందని డీజీపీ పేర్కొన్నారు.

## మిషన్ మోడ్ లో ధాన్యం. ఆన్ లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి

- ధాన్యం దిగుమతులలో రైస్ మిల్లర్ల నిర్లక్ష్యాన్ని సహించం
- కొనుగోలు కేంద్రాల దగ్గర స్టాక్ ఉన్న ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలి
- కేంద్రాలకు వచ్చే ధాన్యాంని బట్టి రవాణా శాఖ అధికారులు సరిపడా వాహనాల ను సమాకూర్చాలి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్ మే15( సమయం న్యూస్,).** :జిల్లాలో కొనుగోలు చేసిన ధాన్యం దిగుమతి ప్రక్రియను మిషన్ మోడ్ లో వేగవంతం జరగాలని జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్ అధికారులను ఆదేశించారు శుక్రవారం. జిల్లాలో సాఫీగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ, కొనుగోలు చేసిన ధాన్యం దిగుమతులు , తదితర అంశాలపై అదనపు కలెక్టర్ నగేష్ . అదనపు ఎస్పీ విక్రాంత్ సింగ్ , ఆర్డీవోలు,సివిల్ సప్లై, కోపరేటివ్,, తాసిల్దార్లు, ఎంపీడీవోలు పోలీస్, డి ఆర్ డి ఓ అధికారులతో కలెక్టరేట్ కార్యాలయం నుండి గూగుల్ మీట్ ఏర్పాటు చేసి దిశా నిర్దేశం చేశారు. . ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం వరి ధాన్యం కేంద్రాలను ఏర్పాటు చేసి నిబంధనల మేరకు కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ క్రమంలో జిల్లాలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు త్రాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి కేటాయించిన రైస్ మిల్లులకు, గోదాములకు తరలించడం జరుగుతుందని తెలిపారు.జిల్లాలో రైతులు ఇబ్బందులు పడకుండాలికేంద్రాలకు వచ్చే ధాన్యాంని బట్టి రవాణా శాఖ అధికారులు సరిపడా ట్రక్లను సమకూర్చాలన్నారు. వరి కొనుగోలు, దిగుమతి ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రస్తుతం కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిషన్ మోడ్ లో మిల్లులకు తరలించాలని, ధాన్యం దిగుమతుల విషయంలో మిల్లర్లు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం రవాణా విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.కొనుగోలు కేంద్రాల్లో తూకం, రవాణా, గన్నీ బ్యాగుల సరఫరా, హమాలీల ఏర్పాటు వంటి అంశాల్లో అలక్ష్యంగా వ్యవహరించకూడదన్నారు. రైస్ మిల్లులు, గోదాములకు తరలించబడిన ధాన్యాన్ని వేగంగా దిగుమతి చేసుకోవాలని, అవసరమైతే హమాలీల సంఖ్యను పెంపొందించుకోవాలని తెలిపారు. కార్మిక శాఖ సహాయ కమిషనర్ ఆధ్వర్యంలో హమాలీలను ఏర్పాటు చేయడం జరిగిందని, వరి ధాన్యం దిగుమతి త్వరితగతిన చేపట్టాలని తెలిపారు. రోజుకు కనీసం 10 నుంచి 15 లారీల ధాన్యాన్ని దిగుమతి చేయాలని తెలిపారు. ఈ గూగుల్ మీట్లో జిల్లా పౌరసరఫరాల అధికారి నిత్యానంద్, డిఎం సివిల్ సప్లై జగదీష్, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు వాహనాల పాత విడిభాగాల వేలానికి విశేష స్పందన



**హన్మకొండ మే15( సమయం న్యూస్) :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పోలీసు వాహనాల పాత విడిభాగాలకు (స్క్రాప్) సంబంధించి శుక్రవారం కమిషనరేట్ కార్యాలయంలో బహిరంగ వేలం నిర్వహించారు. ఈస్ట్ జోన్ డీసీపీ అంకిత్ కుమార్, అడిషనల్ డీసీపీ సురేష్ కుమార్ ఎస్. బి ఏసీపీ జితేందర్ రెడ్డి, ఆర్. ఐ శ్రీధర్ మరియు ఇతర పోలీస్ అధికారుల పర్యవేక్షణలో ఈ ప్రక్రియ జరిగింది. ఈ వేలానికి ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు హైదరాబాద్‌కు చెందిన పాత సామాను (స్క్రాప్) వ్యాపారస్తులు తరలివచ్చి ఉత్సాహంగా పాల్గొన్నారు.

## జనగామలో ఎఫ్.ఎస్.ఎస్.ఏ.ఐ లైసెన్స్ & రిజిస్ట్రేషన్ మేళా

**జనగామ మే15( సమయం న్యూస్) :** జనగామ జిల్లాలోని ఆహార వ్యాపార నిర్వాహకుల (ఫుడ్ బిజినెస్ ఆపరేటర్లు) కోసం ఎఫ్.ఎస్.ఎస్.ఏ.ఐ (ఖీూూ×) లైసెన్స్ మరియు రిజిస్ట్రేషన్ మేళాను మే 16, 2026 న నిర్వహించనున్నట్లు ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ సి.హెచ్. వినీల్ కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ మేళా జనగామ కలెక్టర్ కార్యాలయం (×ఖూజ)లోని రూమ్ నెం. +2లో మే 16 ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించబడుతుంది. తెలంగాణ రాష్ట్ర ఆహార పరిరక్షణ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పేర్కొన్నారు.జిల్లాలోని ఆహార వ్యాపార నిర్వాహకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని కొత్త ఎఫ్.ఎస్.ఎస్.ఏ.ఐ లైసెన్సులు, రిజిస్ట్రేషన్లు పొందడంతో పాటు, ఇప్పటికే ఉన్న లైసెన్సులను రెన్యువల్ చేసుకోవాలని అధికారులు సూచించారు.ఇతర వివరాల కోసం ఈ క్రింది ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని తెలిపారు.

ఆహార భద్రత అధికారి: 7306335795
గెజిటెడ్ ఫుడ్ ఇన్స్పెక్టర్: 9985820544

## ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలి

**-వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్**





**హన్మకొండ మే15( సమయం న్యూస్) :** పోలీస్ చెక్ పోస్టుల్లో సిబ్బంది తప్పని సరిగా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాల్సి వుంటుందని వరంగల్ పోలీస్ కమిషనర్ సూచించారు. గోవులతో పాటు మూగ జీవాల అక్రమ రవాణా నియంత్రణ చేసేందుకు వరంగల్ పోలీస్ కమిషనరేట్ సరిహద్దుల్లో ప్రత్యేకంగా పోలీస్ చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ చెక్ పోస్టుల్లో సిబ్బంది పనితీరును పరిశీలించేందుకు వరంగల్ పోలీస్ కమిషనర్ శుక్రవారం ఆత్మకూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని కటాక్షపూర్ పోలీస్ చెక్‌పోస్ట్‌ను అకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీ భాగంగా ముందుగా పోలీస్ కమిషనర్ చెక్‌పోస్ట్ వద్ద ఎర్పాటు చేసిన బారికేడ్లను పరిశీలించడంతో పాటు, ఇక్కడ విధులు నిర్వహిస్తున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిపి ఈ చెక్‌పోస్ట్‌లో రికార్డుల నిర్వహణ, వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకోని చెక్‌పోస్ట్‌లో సిబ్బంది కోసం ఎయిర్‌కూలర్, మంచినీటి ఎర్పాట్లను పోలీస్ కమిషనర్ తనిఖీ చేసారు. ఈ సందర్బంగా పోలీస్ కమిషనర్ చెక్‌పోస్ట్ సిబ్బంది పలు సూచనలు చేస్తూ పోలీస్ సిబ్బంది నిరంతరం తనిఖీలు నిర్వహించాలని, ముఖ్యంగా ఇక్కడ నియమించబడిన సిబ్బందిలో సగం మంది తనిఖీ నిర్వహించాలని, మరో సగం మంది విశ్రాంతి తీసుకోవాల్సి వుంటుందని. ముఖ్యంగా ప్రతి ఒక్క వాహనాన్ని తనిఖీ చేయాలని,కంటైనర్లను సైతం తనిఖీ చేయాల్సి వుంటుందని. విధి నిర్వహణలో చెక్‌పోస్ట్ సిబ్బంది అలసత్వం వహిస్తే సహించేది లేదని పోలీస్ కమిషనర్ హెచ్చరించారు. పోలీస్ కమిషనర్ వెంట ఆత్మకూర్ ఇన్స్పెక్టర్ సంతోష్ వున్నారు.

# చివరి గింజ వరకూ మద్దతు ధరతో కొనుగోలు

■ కలెక్టర్ కోయ శ్రీహర్ష

**పెద్దపల్లి, మే 15:( సమయం న్యూస్) :** రైతుల వద్ద ఉన్న చివరి గింజ వరి, మొక్కజొన్న పంటను కూడా మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష స్పష్టం చేశారు. శుక్రవారం రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝాతో కలిసి పెద్దకల్వలలోని అన్నపూర్ణ రైస్ మిల్, పెద్దబొంకూరులోని రాఘవేంద్ర రైస్ మిల్‌తో పాటు పలు మిల్లులు, పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు 1.6 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, రైతులకు రూ. 280 కోట్ల చెల్లింపులు చేసినట్లు తెలిపారు. మే 20 నాటికి 80 శాతం ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తామని చెప్పారు. రోజువారీ కొనుగోళ్లు 6 వేల మెట్రిక్ టన్నుల నుంచి 13 వేల మెట్రిక్ టన్నులకు పెంచినట్లు తెలిపారు. రవాణా, హమాలీ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, హమాలీ కూలీని ఒక్కో సంచికి రూ. 6 నుంచి రూ. 8.50కు పెంచినట్లు పేర్కొన్నారు. గన్నీ సంచులు తీసుకువచ్చే రైతులకు ఒక్కో సంచికి రూ. 21 చెల్లిస్తామని తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కూడా మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నామని, రైతులు ఆందోళన చెందవద్దని కలెక్టర్ భరోసా ఇచ్చారు. జిల్లాలో



మొక్కజొన్న కొనుగోళ్ల కోసం 8 కేంద్రాలు ప్రారంభించామని, రైతుల ట్రాక్టర్ల ద్వారా గోదాములకు తరలించినా రవాణా చార్జీలు చెల్లిస్తామని చెప్పారు. అనంతరం సుల్తానాబాద్ మండలం దుబ్బపల్లి చెక్‌పోస్ట్‌ను కలెక్టర్ తనిఖీ చేసి, బక్రీద్ నేపథ్యంలో అక్రమ ఆవుల రవాణా జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

# శాంతిభద్రతల పరిరక్షణకు పటిష్ట చర్యలు తీసుకోవాలి

- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS
- అక్రమ గోవుల రవాణాపై కఠిన చర్యలు
- బార్డర్ చెక్‌పోస్టుల వద్ద 24 గంటల నిఘా
- పోలీసు, రెవెన్యూ, వెటర్నరీ శాఖల సమన్వయంతో ప్రత్యేక తనిఖీలు



**నారాయణపేట, మే,15(సమయం న్యూస్) :** నారాయణ పేట: రానున్న బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతలు పరిరక్షించడంతో పాటు అక్రమ గోవుల రవాణాను పూర్తిగా అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఆదేశించారు. శుక్రవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో పోలీసు, రెవెన్యూ అధికారులు, వెటర్నరీ డాక్టర్లతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యాప్తంగా అమలు చేయాల్సిన భద్రతా చర్యలు, చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు, పశువుల రవాణాపై నిఘా తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... బక్రీద్ పండుగను ప్రజలందరూ శాంతియుత వాతావరణంలో సోదరభావంతో జరుపుకోవాలని సూచించారు. జిల్లాలో ఎక్కడైనా అక్రమంగా గోవులను తరలించినా, నిబంధనలకు విరుద్ధంగా వాహనాలలో రవాణా చేసినా సంబంధిత వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పరిధిలోని బోర్డర్ చెక్‌పోస్టుల్లో 24ఐ7 పోలీసు సిబ్బందితో పాటు వెటర్నరీ డాక్టర్లు కూడా అందుబాటులో ఉండి తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. ముఖ్యంగా మక్తల్, మద్దూర్, కోస్గి సంతలు జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని సూచించారు. పశువుల రవాణా సమయంలో ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం సరైన అనుమతి పత్రాలు మరియు "ఫిట్ ఫర్ ట్రాన్స్‌పోర్ట్" సర్టిఫికేట్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. అక్రమ రవాణాలో పట్టుబడిన ఆవులు, లేగ దూడలను తాత్కాలిక గోశాలల్లో ఉంచేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ ప్రాంతాల్లో అనుమతి పొందిన వధశాలల్లో మాత్రమే కార్యకలాపాలు నిర్వహించాలని, వధ అనంతరం మిగిలే వ్యర్థాలను అదే రోజు తొలగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వ్యర్థాలను ఎక్కడ వేయాలో ముందుగానే మున్సిపల్ అధికారులు గుర్తించి అక్కడే గోతి తీసి పూర్చి వేయాలని ఆదేశించారు. అలాగే సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు, రెచ్చగొట్టే పోస్టులు, వదంతులు వ్యాప్తి చేసిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. ప్రజలు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా పోలీసులకు సహకరించాలని కోరారు. జిల్లాలో ఎక్కడైనా అనుమానాస్పద పరిస్థితులు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100కు సమాచారం అందించాలని సూచించారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి పెట్రోలింగ్ అధికారులను ఏర్పాటు చేసి నిరంతర తనిఖీలు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ ఎండీ రియాజ్ హుల్ హక్, డీఎస్పీ లు నల్లపు లింగయ్య, మహేష్, ఆర్డీఓ ఎల్. రమేష్, సిఐ లు శివ శంకర్, సైదులు, రామ్ లాల్, భగవంత్ రెడ్డి, ఎస్సై లు రెవెన్యూ శాఖ అధికారులు, వెటర్నరీ డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

## వరి, మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసినజిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ )వెంకటచారి.



**పరిగి, మే,15(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం లో వరి, మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) వెంకటాచారి. శుక్రవారము పరిగి మండలంలో సుల్తాన్ పూర్ వరి కొనుగోలు కేంద్రాన్ని ,మరియు పరిగి వెంకట సాయి రైస్ మిల్లును పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ, లోడింగ్, లిఫ్టింగ్ తదితర పనుల పురోగతిని అదనపు కలెక్టర్ సమీక్షించారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. లోడింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని, అందుకు అవసరమైన లారీలు, హమాలీలను తగిన సంఖ్యలో ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా కాంటా వేసి మిల్లులకు తరలించేవిధంగా చర్యలు చేపట్టాలన్నారు. రైతులు తమ పంటను విక్రయించే సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా అవసరమైన అన్ని సౌకర్యాలు కొనుగోలు కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని తెలిపారు. తేమ శాతం, నాణ్యత ప్రమాణాల పరిశీలనలో పారదర్శకత పాటించాలని సూచించారు..పరిగి మండలం లో నిర్వహిస్తున్న మొక్కజొన్న సేకరణ కేంద్రాన్ని సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. మొక్కజొన్నను వెంటనే సేకరించేలా తగిన సంఖ్యలో హమాలీలను ఏర్పాటు చేయాలని, సేకరించిన ధాన్యాన్ని కేటాయించిన గోదాములకు తరలించేందుకు అవసరమైన వాహనాలను అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టర్ ఆదేశించారు. ట్యాబ్ ఎంట్రీలను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రాబోయే వర్షాలను దృష్టిలో ఉంచుకుని వరి, మొక్కజొన్న నిల్వలో ఎటువంటి నష్టం జరగకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని, ధాన్యాన్ని భద్రపరిచేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలగకుండా కొనుగోలు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. అదనపు కలెక్టర్ పర్యటనలో డి ఎం సి ఎస్ మోహన్ కృష్ణ ,డి ఎస్ ఓ సుదర్శన్, తహసీల్దార్ వెంకటేశ్వరి. ఎంపీడీవో హరి ప్రియ రెడ్డి. మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి. రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మిల్లుల్లో ధాన్యం దిగుమతి వేగవంతం చేయాలి

- హమాలీలను పెంచి షిఫ్ట్‌ల వారీగా పని చేపట్టాలి.
- మిల్లర్ యజమానులకు కలెక్టర్ హైమావతి ఆదేశాలు



**రాయపోల్, మే 15:** మిల్లుల్లో ధాన్యం దిగుమతిలో ఎలాంటి జాప్యం లేకుండా ఎక్కువ మంది హమాలీలను సమకూర్చుకుని షిఫ్ట్‌ల వారీగా పనులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి మిల్లర్ యజమానులను ఆదేశించారు. శుక్రవారం దౌల్తాబాద్ మండలం ముత్యంపేట గ్రామంలోని స్వాతి ఇండస్ట్రీస్,రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలోని శివసాయి బాలాజీ ఇండస్ట్రీస్‌లలో ధాన్యం దిగుమతి ప్రక్రియను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు సజావుగా సాగాలంటే కొనుగోలు కేంద్రాల నుంచి లారీలు, ట్రాక్టర్ల ద్వారా మిల్లులకు చేరుతున్న ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేసుకోవాలని సూచించారు. దిగుమతిలో ఆలస్యం జరగకుండా అదనపు హమాలీలను అందుబాటులో ఉంచి షిఫ్ట్‌ల వారీగా పనులు నిర్వహించాలని ఆదేశించారు. గ్రామాల్లో స్థానికంగా పని చేసే హమాలీలను సమకూర్చుకుని కొనుగోలు కేంద్రాల వద్దే పనులు చేపడితే మిల్లుల్లో దిగుమతికి జాప్యం ఉండదని రైతులకు తెలిపారు. ధాన్యం దిగుమతి పూర్తికాగానే మిల్లర్ అక్నాలెడ్జ్‌మెంట్, ట్రక్ షీట్ జనరేషన్, ఓపీఎంఎస్ అప్‌లోడ్ వంటి ప్రక్రియలను పెండింగ్‌లో ఉంచకుండా వెంటనే పూర్తి చేయాలని సూచించారు. దిగుమతి ప్రక్రియను వేగవంతం చేసేందుకు రెవెన్యూ అధికారులను కూడా నియమించినట్లు తెలిపారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రైతులు సన్న వడ్లు సాగు చేయాలని, సన్న వడ్లకు ప్రభుత్వం బోనస్ కూడా అందిస్తోందన్నారు. జిల్లాలో పండే సన్న బియ్యం స్థానిక ప్రజల అవసరాలకు సరిపోతుందని, ప్రస్తుతం రేషన్ దుకాణాల కోసం ఇతర జిల్లాల నుంచి సన్న బియ్యాన్ని దిగుమతి చేసుకోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లై అధికారి తనూజతో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



రాష్ట్ర మంత్రులు శ్రీ దామోదర్ రాజనర్సింహ, శ్రీ దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు గార్లు తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్ పర్సన్ శ్రీమతి నిర్మల జగ్గారెడ్డి గారి క్యాంపు కార్యాలయం ను సంగారెడ్డిలో ప్రారంభించారు.

ఈ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యులు సురేష్ షెట్కర్, నారాయణఖేడ్ శాసనసభ్యులు డా. సంజీవరెడ్డి లు పాల్గొన్నారు.

## ఈ నెల 16,17 తేదీలలో మామిడి ప్రదర్శన

**సంగారెడ్డి మే15( సమయం న్యూస్) :** ఫల పరిశోధన స్థానం సంగారెడ్డి డైమండ్ జూబిలీ వేడుకలను, మరియు మ్యాంగో డైవర్సిటీ ఫెయిర్ లేదా మ్యాంగో మేళాను మే 16 ఉదయం 10 గంటలకు ప్రారంభిస్తున్నారు. ఈ కార్యక్రమం 2026 మే 16 మరియు 17 తేదీలలో నిర్వహించబడుతుంది. మామిడి ప్రేమికులందరూ ఈ కార్యక్రమానికి హాజరై, విభిన్న రకాల మామిడి పండ్ల ప్రదర్శనను ఆస్వాదించవలసిందిగా కోరుతున్నాము. అలాగే, రైతులు శాస్త్రవేత్తలతో ప్రత్యక్షంగా మాట్లాడే అవకాశాన్ని పొందుతూ, మామిడి సాగులో కొత్త సాంకేతికతలు మరియు ఆవిష్కరణల గురించి తెలుసుకోవచ్చు. ఈ రెండు రోజుల కార్యక్రమంలో రైతులు తమ వద్ద ఉన్న ప్రత్యేకమైన లేదా కొత్త మామిడి రకాలను ప్రదర్శించవచ్చు. అదేవిధంగా, మామిడి పండ్లతో తయారు చేసిన ప్రాసెస్డ్ ఉత్పత్తులను కూడా ప్రదర్శించవచ్చు. ప్రవేశం పూర్తిగా ఉచితం. అందువల్ల, అందరూ ఈ కార్యక్రమానికి విచ్చేసి విజయవంతం చేయవలసిందిగా మనవి.

## ఆర్ అండ్ బి డి.ఈ నాగలక్ష్మి మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గారు



**హైదరాబాద్ మే15( సమయం న్యూస్). :** రోడ్లు భవనాలు శాఖ (శంషాబాద్ సబ్ డివిజన్)డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీమతి నాగలక్ష్మి మృతి పట్ల రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి గారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆర్ అండ్ బి శాఖలో చురుగ్గా,నిబద్ధతతో పనిచేసే మంచి ఇంజనీర్‌ను కోల్పోయామని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. 2025 గ్లోబల్ సమ్మిట్ సమయంలో రోడ్లు భవనాలు శాఖ తరుపున ఆమె పనితీరును ప్రశంసించిన విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. డి.ఈ నాగలక్ష్మి గారి మృతి తీవ్ర విచారకరమని,తీవ్ర విషాదంలో ఉన్న వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించాలని భగవంతుణ్ణి ప్రార్థించారు. "కలుపుగోలు వ్యక్తిత్వం గల నాగలక్ష్మి గారు మన మధ్య లేకపోవడం పట్ల తీవ్ర విచారంలో ఉన్న నా ఆర్ అండ్ బి కుటుంబ సభ్యులకు,ఆమె శ్రేయోభిలాషులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్న" అని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.

## వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా ఐపీఎస్, పరిగి డీఎస్పీ శ్రీనివాస్ ఆదేశాల మేరకు,పరిగి "షీ" టీమ్ పోలీసుల అవగాహన



**కుల్కచర్ల మండలం, మే,15(సమయం న్యూస్) :** కుల్కచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో,రాంరెడ్డి పల్లి outskirts Brick Kiln lo పరిగి సబ్ డివిజన్ "షీ" టీ మ్ ఇంచార్జ్ నర్సిములు సమక్షంలో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశాలు:

1మహిళలపై జరుగుతున్న నేరాలు

2 నిర్భయ చట్టం,ఞూజూూ చట్టం గురించి

3 .100 డయల్, "షీ" టీమ్ నం - 181

సీసీ కెమెరాలు

4 బాల్య వివాహాలు,5 బాల కార్మిక వ్యవస్థ

6 కమ్యూనిటీ పోలీసింగ్,7 మానవ అక్రమ రవాణా

8 మద్యపాన నిషేధం

9 బ్యాంకింగ్ ఆన్‌లైన్ మోసాలు

10 గంజాయి నిర్మూలన, 11 డ్రగ్స్ నిషేధం

12 సైబర్ నేరాలపై అవగాహన (నం: 1930). వివిధ అంశాలపై అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో దీతీఱషఎ ఖఱశ్రీఅ ఔశీతీఎం ఖఱఅ "షీ" టీమ్ సభ్యులు సావిత్రి,శోభ పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ని మర్యాద పూర్వకంగా కలిసిన... కొడంగల్ బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు కుర్వ నర్మదా కృష్ణప్ప..



**కొడంగల్, మే,15(సమయం న్యూస్) :** బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర మాజీ మంత్రిబీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు (ఖు=)ని హైదరాబాద్ లో మర్యాద పూర్వకంగా కలిసిన కొడంగల్ బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు కుర్వ నర్మద కిష్టప్ప. విజయ్ ఆర్యా క్షేత్రియ మరియు సత్యమ్మ లు ఉన్నారు.

## సీఎం సహాయనిధి నిరుపేదలకు వరం

- లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



**రాయపోల్, మే 15 :** సీఎం సహాయనిధి నిరుపేద కుటుంబాలకు వరం లాంటిదని దుబ్బాక కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు.

శుక్రవారం మండల కేంద్రం రాయపోల్‌లో లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను సమర్థంగా అమలు చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాయపోల్ సర్పంచ్ రాజు,రామారశీ సర్పంచ్ స్వామి,తిమ్మక్కపల్లి సర్పంచ్ అశోక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తప్పేట సుధాకర్, పార్టీ నాయకులు సత్తుగారి కిష్టారెడ్డి, యాదవ రెడ్డి, మహేష్, దుర్గాప్రసాద్, అనిల్ గౌడ్, నరసింహులు, మల్లేశం,ఏఎంసీ డైరెక్టర్ ఆదిరెడ్డి,మాజి ఎంపిటిసి స్వామి,. పాల రామా గౌడ్,యాదగిరి ,కర్నాకర్,మల్లారెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపల్లిలో సీసీ కెమెరాల ప్రారంభం

- సిద్దిపేట సురక్ష నేత్రం నాలుగో దశలో ఏర్పాటు



**రాయపోల్, మే 15 :** సిద్దిపేట సురక్ష నేత్రం కార్యక్రమంలో భాగంగా రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామంలో ఎనిమిది సీసీ కెమెరాలను శుక్రవారం ప్రారంభించారు. రష్మి పెరుమాళ్ ఆదేశాల మేరకు నాలుగో దశలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తోగుట సీఐ ఎస్.కే. లతీఫ్, ఎస్సై కె. మానస గ్రామ సర్పంచ్ శ్యామల మల్లేశం, ఉపసర్పంచ్ స్వామి,పంచాయతీ కార్యదర్శి పరమేశ్వర్,గ్రామ ప్రజల సమక్షంలో సీసీ కెమెరాలను ప్రారంభించారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు వల్ల నేరాల నియంత్రణకు తోడ్పాటుతో పాటు ప్రజల్లో భద్రతాభావం పెరుగుతుందని సిఐ లితిఫ్ తెలిపారు. ప్రజలు కూడా పోలీసులకు సహకరించి గ్రామ భద్రతకు భాగస్వాములు కావాలని సూచించారు.

## జిల్లా కలెక్టర్ దీపక్ తివారి (ఐఏఎస్ )ను మర్యాద పూర్వకంగా కలిసిన..ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు..



**వికారాబాద్, మే,15(సమయం న్యూస్) :** ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు జిల్లా కలెక్టర్ దీపక్ తివారి నీ మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా, రెడ్ క్రాస్ సొసైటీ కార్యకలాపాలు మరియు దాని సంస్థాగత నిర్మాణం గురించి జిల్లా కలెక్టర్ గారికి వివరించడం జరిగిందిఅనంతరం, స్వయంగా కలెక్టరే రెడ్ క్రాస్ సొసైటీలో జీవితకాల సభ్యత్వాన్ని కలెక్టర్ స్వీకరించారు. అధికారులు అందరూ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ (IRCS)లో జీవితకాల సభ్యత్వాన్ని పొందాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. రెడ్ క్రాస్ సొసైటీ సభ్యత్వం కోసం చేపట్టే నెల రోజుల సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షించడానికి, ఆయన జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీ ఆర్ డి ఓ) శ్రీనివాస్‌ను నోడల్ అధికారిగా నియమించారు. అంతేకాకుండా, కలెక్టరేట్ ప్రాంగణంలోని డి ఆర్ డి ఓ కార్యాలయ భవనం మొదటి అంతస్తులో రెడ్ క్రాస్ సభ్యత్వ నమోదు కేంద్రాన్ని ఏర్పాటు చేయడానికి ఆయన అనుమతి మంజూరు చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ హెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్‌టి. సాయి చౌదరి,ఛైర్మన్, వైస్ ఛైర్మన్ డాక్టర్ సత్యనారాయణ గౌడ్,పాల్గొన్నారు

## ఎడ్యుకేషన్ వీక్ సందర్భంగా "లైబ్రరీ డే" ఘనంగా నిర్వహణ

- ప్రజాపాలన -- ప్రగతి నివేదిక కార్యక్రమాలలో భాగంగా ఎడ్యుకేషన్ వీక్ సందర్భంగా.
- ముఖ్యఅతిథిగా పాల్గొన్న జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు సేరి రాజేష్ రెడ్డి



**వికారాబాద్, మే,15(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయం ఆధ్వర్యంలో "లైబ్రరీ డే" కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. జ్ఞానానికి నిలయమైన గ్రంథాలయాల ప్రాముఖ్యతను సమాజానికి చాటిచెప్పే విధంగా ఈ కార్యక్రమం ఎంతో వైభవంగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు సేరి రాజేష్ రెడ్డి పాల్గొనగా, విశిష్ట అతిథులుగా జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకా దేవి మరియు మండల విద్యాధికారి యన్. బాబు సింగ్ హాజరయ్యారు. అతిథులు జ్యోతి ప్రజ్వలన చేసి పుస్తక ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు సేరి రాజేష్ రెడ్డి మాట్లాడుతూ,"గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు. విద్యార్థులు, ఉద్యోగార్థులు గ్రంథాలయ వనరులను సద్వినియోగం చేసుకొని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలి" అని పేర్కొన్నారు. ప్రభుత్వం గ్రంథాలయాల అభివృద్ధి, పాఠశాల స్థాయిలో పఠన సంస్కృతి బలోపేతానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నదని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి రేణుకా దేవి మాట్లాడుతూ, గ్రంథాలయంలో చదవడం ద్వారా మానసిక ప్రశాంతతతో పాటు ఏకాగ్రత పెంపొందుతుందని, తద్వారా విద్యార్థులు తమ లక్ష్యాలను సులభంగా సాధించగలరని అన్నారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో చదువుతున్న విద్యార్థుల కోసం ప్రభుత్వ పాఠ్యపుస్తకాలను అందుబాటులో ఉంచేందుకు సహకరిస్తామని తెలిపారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి. సురేష్ బాబు మాట్లాడుతూ, 1959 సంవత్సరం నుండి 2026 వరకు జిల్లా గ్రంథాలయం సాధించిన ప్రగతిని వివరించారు. సిబ్బంది కొరత ఉన్నప్పటికీ ఉద్యోగార్థులు, విద్యార్థుల కోసం మెరుగైన మౌలిక వసతులు, ప్రశాంత పఠన వాతావరణం కల్పించేందుకు కృషి జరుగుతోందని తెలిపారు. గ్రంథాలయాన్ని విజ్ఞాన దేవాలయంగా భావించి పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకుంటే విజయం సాధ్యం అవుతుందని సూచించారు. ఈ సందర్భంగా వివిధ పోటీ పరీక్షలలో విజయం సాధించి ఉద్యోగాలు పొందిన సుమారు 13 మందిని ఘనంగా సన్మానించారు. తరచుగా గ్రంథాలయాన్ని వినియోగిస్తున్న పాఠకులను కూడా అభినందించారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు తమ అనుభవాలను ఇతర చదువరులతో పంచుకుంటూ, గ్రంథాలయం విజయానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా మండల విద్యాధికారి యన్. బాబు సింగ్ వ్యవహరించగా, కార్యక్రమ వ్యాఖ్యాతగా ఎం. అశోక్ (గా+ు, నాగసముందర్) సేవలందించారు. చివరగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి శ్రీ పి. సురేష్ బాబు సభకు విచ్చేసిన అతిథులు, అధికారులు, పాఠకులు, విద్యార్థులు, ఉద్యోగార్థులు మరియు సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది అరవింద్, స్రవంతి, సరిత, విద్యాశాఖ సిబ్బంది, సుమారు 100 మంది ఉద్యోగార్థులు, విద్యార్థులు, పాఠకులు మరియు గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి

- జిల్లా లో వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు రైతులకు ఎటువంటి
- జిల్లా కలెక్టర్ దీపక్ తివారి



**వికారాబాద్, మే,15(సమయం న్యూస్) :** జిల్లాలో వరి కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడంతో పాటు రైతులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ దేపాక్ తివారి మిలర్లకు సూచించారు. శుక్రవారము కలెక్టర్ చాంబర్ లో మిల్లర్లు,అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎక్కువ మంది హమాలిలను ఏర్పాటు చేసుకొని రైతులు తీసుకొచ్చిన ధాన్యాన్ని తక్షణమే స్వీకరించి, నాణ్యత ప్రమాణాల ప్రకారం మిల్లింగ్ ప్రక్రియను సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం నిల్వలు పెరగకుండా మిలర్లు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ధాన్యం రవాణా, హమాలి, నిల్వ మరియు మిల్లింగ్ ప్రక్రియలో ఎటువంటి ఆలస్యం జరగకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ సూచించారు. రైతులకు చెల్లింపులు త్వరితగతిన జమ అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం రైతుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని, వరి కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రతి మిల్లు దగ్గర సంబంధిత అధికారులు పర్య వేక్షణ చేస్తారని , మీకున్న లక్ష్యాన్ని పూర్తి చేయాలనీ మిల్లర్లకు ఆదేశించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగ కుండ పోలీస్ అధికారుల సహకార ముంటుందని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటా చారి,అడిషనల్ ఎస్ పి రాము నాయక్, డి ఆర్ డి ఎ శ్రీనివాస్,డి ఎస్ పి లు , పౌర సరఫరాల శాఖ అధికారులు, మోహన్ కృష్ణ, సుదర్శన్ మార్కెటింగ్ శాఖ అధికారులు, మిలర్లు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాల నిర్మూలనకు పోలీస్ జాగిలంతో ప్రత్యేక తనిఖీలు

- టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు
- జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ IPS ఆదేశాల మేరకు



**నారాయణపేట, మే,15(సమయం న్యూస్) :** జిల్లాలో మత్తు పదార్థాల నిర్మూలనకు చేపడుతున్న ప్రత్యేక చర్యల్లో భాగంగా శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో ఈగల్ ఫోర్స్ టీంతో ప్రత్యేక శిక్షణ పొందిన నార్కోటిక్స్ స్నైపర్ పోలీసు జాగిలంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించినట్లు నారాయణపేట టౌన్ ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా కొరియర్ కార్యాలయాలు, పాన్ షాపులు, బస్టాండ్ ప్రాంతాలు తదితర ప్రదేశాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మత్తు పదార్థాల రవాణా, నిల్వ, విక్రయాలు మరియు వినియోగాన్ని పూర్తిగా అరికట్టేందుకు పకడ్బందీగా తనిఖీలు నిర్వహిస్తున్నామని ఎస్సై తెలిపారు. ప్రజలు ఎవరైనా గంజాయి, డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలను వినియోగిస్తున్నా, రవాణా చేస్తున్నా లేదా సరఫరా చేస్తున్నా వెంటనే టోల్ ఫ్రీ నెంబర్ 1908 లేదా డయల్-100కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. ఈ తనిఖీల్లో నార్కోటిక్స్ స్నైపర్ డాగ్ విక్కి, డాగ్ హ్యాండ్లర్ పరమేశ్, పీసీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మన గ్రంథాలయ జ్ఞానోత్సవం

ముఖ్యఅతిథిగా పాల్గొన్న కొడంగల్ ఎంఈఓ కె. రామ్ రెడ్డి



**కొడంగల్ మున్సిపల్, మే,15(సమయం న్యూస్) :** కొడంగల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక - విద్యా వారోత్సవాల్లో భాగంగా మన గ్రంథాలయ జ్ఞానోత్సవం అను వినూత్న కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొడంగల్ మండల విద్యాధికారి కల్వకోటి రాంరెడ్డి హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పుస్తకం మనకు మంచి స్నేహితుడన్నారు. సోషల్ మీడియా ప్రభావం వల్ల విద్యార్థుల్లో పుస్తక పఠనం తగ్గిందని, చిన్న పిల్లలు మరియు యువతకు పుస్తక పఠనం అలవాటు చేయాలన్నారు. పుస్తకాల ద్వారానే సంపూర్ణ జ్ఞానాన్ని పొందగలమన్నారు. "చిరిగిన చొక్కా అయినా తొడుక్కో కాని ఒక మంచి పుస్తకం కొనుక్కో" అని కందుకూరి వీరేశలింగం అన్నారని అదేవిధంగా "పుస్తకాలు లేని గది ఆత్మ లేని దేహం వంటిది" అని గాంధీజీ చెప్పారని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ డా. బి. శ్రీనివాస్ రెడ్డి "ఇకిగాయ్" అను జపనీస్ పుస్తకం గూర్చి విశ్లేశించారు మరియు పుస్తక పఠనం ప్రాధాన్యతను వివరించారు. అనంతరం పుస్తక ప్రదర్శనను నిర్వహించి గ్రంథాలయాన్ని తరచుగా సందర్శించే విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రఫియా ఖానం అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇసుక రవాణా కు ఆన్ లైన్ అనుమతులు ఇవ్వాలి.

**● జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఐఏఎస్.**

**నారాయణపేట, మే,15(సమయం న్యూస్) :** జిల్లాలో ఇసుక లభ్యత గల పది రీచ్ ల నుంచి మన ఇసుక మన వాహనం ద్వారా ఆన్ లైన్ అనుమతులు ఇవ్వాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక సూచించారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో కలెక్టర్ అధ్యక్షతన డి.ఎల్.ఎస్.సి( డిస్టిక్ లెవెల్ స్యాశీడ్ కమిటీ) సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... గుర్తించిన పది ఇసుక రీచ్ ల నుంచి ఇసుక రవాణాకు ఆన్ లైన్ అనుమతులు ఇవ్వాలన్నారు.గోటూరు, సమస్తా పూర్, నాగిరెడ్డి పల్లి, ఓబులాపురం 1,2, దాసర్ దొడ్డి, వడ్వాట్, అడవి సత్యారశీ, అమ్మపల్లి రీచ్ ల నుంచి మన ఇసుక - మన వాహనం ద్వారా ఇసుక రవాణా కు అనుమతులు ఇవ్వాలన్నారు. ఇసుక రీచ్ ల వద్ద సీసీ కెమెరాలతో నిఘా పెట్టాలన్నారు. ఇసుక బుకింగ్ అయిన వెంటనే త్వరగా డెలివరీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాగా గత వారం జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు భూగర్భ జల వనరులు, రెవెన్యూ, నీటి పారుదల గనులు మరియు భూగర్భ శాస్త్ర విభాగాల అధికారులు సంయుక్తంగా ఈ నెల 11 నుంచి 13 వరకు ఇసుక ఉన్న ప్రాంతాలను తనిఖీ చేసిన



నివేదికను జిల్లా కలెక్టర్ కు సమర్పించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, కలెక్టరేట్ ఏ వో శ్రీధర్, మైనింగ్ ఏ డీ గోవింద రాజు, రాయల్టీ ఇన్స్ పెక్టర్ ప్రతాప్ రెడ్డి, ఆయా మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

# ఎస్ఐ చైతన్య కిరణ్, సిబ్బంది పనితీరును అభినందించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్

**● నిందితుడిని రిమాండ్‌కు తరలింపు.**

**రాయికోడ్ సమయం న్యూస్ మే 15** పోలీస్ స్టేషన్ పరిధిలో బైక్ దొంగతనానికి పాల్పడిన నిందితుడి అరెస్ట్.

1 బైక్, 2 ఆటో రిక్షాలు స్వాధీనం చేసుకొని నిందితుడిని రిమాండ్‌కు తరలింపు.

రాయికోడ్ ఎస్ఐ చైతన్య కిరణ్, సిబ్బంది పనితీరును అభినందించిన జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

సంగారెడ్డి జిల్లా సురక్ష ప్రతినిధి: వివరాలలోకి వెళితే, ఈ నెల మే 9వ తేదీన సంగాపూర్ గ్రామానికి చెందిన కాపాడి సుమన్ గౌడ్ తన ఇంటి ముందు పార్క్ చేసిన బైక్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారని రాయికోడ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రాయికోడ్ ఎస్ఐ ఎం.చైతన్య కిరణ్ సీసీటీవీ కెమెరాలు మరియు సాంకేతిక ఆధారాల సహాయంతో నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించారు. విచారణలో నిందితుడి వద్ద నుండి 1 బైక్ మరియు 2 ఆటో రిక్షాలను స్వాధీనం చేసుకొని, అనంతరం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.నిందితుడు నారాయణఖేడ్ మండలం ర్యాకల్ గ్రామానికి చెందిన పండరి గౌడ్‌గా గుర్తించారు. నిందితుడిపై గతంలో కూడా పలు చోరీ కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. చైతన్యపురి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఏటీఎం చోరీ కేసు, నారాయణఖేడ్ పోలీస్ స్టేషన్




పరిధిలో ఇంట్లో బంగారు ఆభరణాల చోరీ కేసు, బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలయ చోరీ కేసులతో పాటు మరికొన్ని కేసుల్లో కూడా నిందితుడిగా ఉన్నట్లు తెలిసింది. ఈ కేసును ఛేదించడంలో కీలకంగా వ్యవహరించిన రాయికోడ్ ఎస్ఐ ఎం.చైతన్య కిరణ్, సిబ్బంది పనితీరును జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్, ఐపీఎస్ అభినందించారు.

# రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వెంట వెంటనే గోదాములకు చేర్చాలి

**● జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**

**నిర్మల్ మే15( సమయం న్యూస్). :** రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని వెంట వెంటనే గోదాములకు తరలించి భద్రపరచాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శుక్రవారం, జిల్లా కలెక్టర్ భవేశ మిశ్రా సారంగాపూర్ మండలంలోని చించోలి (బి) గ్రామంలో గల గోదామును పరిశీలించారు. ధాన్యం అన్లోడ్ అవుతున్న తీరును చూశారు. అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఇప్పటివరకు గోదాములో నిల్వచేసిన ధాన్యం వివరాలను అడిగి తెలుసుకున్నారు. తగినంత మంది హమాలీలతో అన్లోడింగ్ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసి, లారీలను వేగవంతంగా ఖాళీ చేయాలన్నారు. అన్లోడింగ్ పూర్తయిన వెంటనే లారీలు తిరిగి కొనుగోలు కేంద్రాలకు తిరిగి పంపాలని తెలిపారు. ఎక్కడ కూడా కొనుగోలు కేంద్రాలలో తూకం వేసిన ధాన్యం నిల్వ ఉండరాదని అన్నారు. ధాన్యం అన్లోడింగ్ ప్రక్రియను అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఉండాలని తెలిపారు. ఈ గోదాము పరిశీలన ప్రక్రియలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, పౌరసరఫరాల అధికారులు రాజేందర్, సుధాకర్ తహసిల్దార్ విజయ



కాంతారావు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీల సంక్షేమం, హక్కుల రక్షణకు కట్టుబడి ఉన్నాం

- దళితవాడల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం
- అట్రాసిటీ కేసుల్లో జాప్యం లేకుండా పరిహారం అందించాలి
- జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఎమ్మెల్యే పాయల్ శంకర్

**అదిలాబాద్ మే15( సమయం న్యూస్) :** జిల్లాలో షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) సంక్షేమానికి, వారి చట్టపరమైన హక్కుల రక్షణకు యంత్రాంగం పూర్తిగా కట్టుబడి ఉందని జిల్లా కలెక్టర్ రాజర్షి షా, ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ, ఎస్సీ సామాజిక వర్గాల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, చట్టపరమైన రక్షణలు క్షేత్రస్థాయిలోని అర్హులైన నిరుపేదలకు నేరుగా చేరాలని ఆకాంక్షించారు. దళితవాడల్లో మౌలిక సదుపాయాల కల్పనపై



అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సంక్షేమ నిధుల వినియోగంలో పూర్తి పారదర్శకత పాటించాలని, బాధితులకు సకాలంలో న్యాయంతో పాటు పరిహారం అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ రాజర్షి షా మాట్లాడుతూ, ఎస్సీల రక్షణకు సంబంధించిన చట్టాలను జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల విచారణలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని, బాధితులకు ప్రభుత్వం నుంచి అందాల్సిన పరిహారాన్ని తక్షణమే విడుదల చేయాలని పోలీస్, రెవెన్యూ అధికారులను ఆదేశించారు.విజిలెన్స్ కమిటీ తరచుగా సమావేశమై కేసుల పురోగతిని సమీక్షించాలని, ఎస్సీలపై ఎలాంటి వేధింపులు జరగకుండా యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గ్రామ స్థాయిలో పౌర హక్కుల దినోత్సవాలను పకడ్బందీగా నిర్వహి చి ప్రజల్లో చట్టాలపై అవగాహన పెంచాలన్నారు.అర్హులైన ఎస్సీ యువతను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు స్వయం ఉపాధి పథకాల ద్వారా పూర్తి స్థాయిలో చేయూతనిస్తామని కలెక్టర్ వెల్లడించారు. వివిధ పథకాల కింద పెండింగ్‌లో ఉన్న సబ్సిడీ యూనిట్ల గ్రౌండింగ్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ఈ సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఏఎస్పీ ఋత్విక్ సాయి కొట్టే, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి సునీత, ఆర్డీవో జగదీశ్వర్ రావ్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఎత్తొండ శివారులో ఘోర ప్రమాదం: డివైడర్‌ను ఢీకొట్టిన కారు.. యువకుడి బలి



**కోటగిరి, మే 15 (సమయం న్యూస్ )**కోటగిరి మండల కేంద్రానికి చెందిన ముత్తిపేట సాత్విక్ (19), మాశెట్టి ప్రతాప్ అనే వ్యక్తితో కలిసి కారులో ఎత్తొండ వైపు వెళుతుండగా ప్రమాదం జరిగింది. ఎత్తొండ క్యాంప్ అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకోగానే, అతివేగం కారణంగా కారు అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సాత్విక్ తలకు, పక్కటెముకలకు తీవ్ర గాయాలయ్యాయి. రక్తపు మడుగులో ఉన్న అతడిని వెంటనే బోధన్‌లోని ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి సాత్విక్ గురువారం రాత్రి కన్నుమూశాడు.ఎస్సై సునీల్ తెలిపిన వివరాల ప్రకారం.. డ్రైవర్ ప్రతాప్ అజాగ్రత్తగా, అతివేగంతో వాహనాన్ని నడపడమే ఈ ప్రమాదానికి కారణమని తేలింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. చేతికి అందిన కొడుకు మరణించడంతో సాత్విక్ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

## కొడంగల్ 12వ వార్డులో అంగన్వాడీ భావన నిర్మాణ పనులను..

# పరిశీలించిన 12వ వార్డు కౌన్సిలర్ సుష్మా దామోదర్



**కొడంగల్ మున్సిపల్, మే,15(సమయం న్యూస్) :** వికారాబాద్ జిల్లా కొడంగల్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో జరుగుతున్న అంగన్వాడి భవన నిర్మాణ పనులను 12వ వార్డు కౌన్సిలర్ సుష్మా దామోదర్ పరిశీలించారు.ఈ అంగన్వాడి భవన నిర్మాణాన్ని అతి త్వరలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్ సుభాష్ నాయక్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఆయా ఆశమ్మ పాల్గొన్నారు

# నైపుణ్య శిక్షణతో యువతకు ఉపాధి అవకాశాలు

**భూపాల పల్లి మే15( సమయం న్యూస్) :** జిల్లా విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టాస్క్ ప్రతినిధులు తెలిపారు.

జిల్లా కేంద్రంలోని జయశంకర్ విగ్రహం వద్ద, సింగరేణి ఏరియా వర్క్‌షాప్ పక్కన ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో కంప్యూటర్ బేసిక్స్, కమ్యూనికేషన్ స్కిల్స్, అర్థమెటిక్, రీజనింగ్, సీ లాంగ్వేజ్, జావా, వెబ్ డిజైనింగ్, ట్యాలీ, డేటాబేస్, ఆటోక్యాడ్ తదితర అంశాల్లో ప్రాక్టికల్ శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు.ఈ శిక్షణలతో యువతలో ఉద్యోగ నైపుణ్యాలు పెంపొందడంతో పాటు, ప్లేస్‌మెంట్ డ్రైవ్స్, జాబ్ మేళాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. స్వయం ఉపాధి, స్టార్టప్‌లకు కూడా ప్రోత్సాహం అందించనున్నట్లు తెలిపారు.కొత్త బ్యాచ్‌ల నమోదు ప్రారంభమైందని, ఆసక్తి గల అభ్యర్థులు ఆధార్, విద్యార్హత పత్రాల జిరాక్స్ కాపీలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. క్యూ ఆర్ కోడ్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. మరిన్ని వివరాలకు 8074031962 నంబర్‌ను సంప్రదించాలి.

# సుజాతనగర్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఎస్పీ రోహిత్ రాజు





**సుజాత నగర్ మే15( సమయం న్యూస్)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు శుక్రవారం సందర్శించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. గన్నీ బ్యాగులు, తార్పాలిన్ పట్టాలు, ధాన్యం రవాణా వంటి అంశాల్లో సమస్యలు లేకుండా రైతులకు అండగా నిలవాలని పేర్కొన్నారు. సమస్యలు ఉంటే వెంటనే అధికారులతో పాటు పోలీసులకు సమాచారం ఇవ్వాలని రైతులను కోరారు. అనంతరం ధాన్యం గ్రేడింగ్, కొనుగోలు విధానాన్ని పరిశీలించారు.



# అర్ష్‌దీప్ వ్యాఖ్యలపై దుమారం

**ధర్మశాల, మే 15 :** భారత క్రికెటర్ అర్ష్‌దీప్ సింగ్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. ముంబై జట్టు బ్యాటర్ తిలక్ వర్మపై అర్ష్‌దీప్ చేసిన వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. హోటల్‌లో జరిగిన ఈ ఘటనపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. వైరల్ అవుతున్న వీడియోలో అర్ష్‌దీప్, అటుగా వెళ్తున్న తిలక్ వర్మను సరదాగా పిలుస్తూ మాట్లాడినట్లు కనిపిస్తోంది. ఇద్దరూ కొద్దిసేపు నవ్వుకుంటూ మాట్లాడుకున్నప్పటికీ, అర్ష్‌దీప్ ఉపయోగించిన పదజాలంపై కొందరు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఆయన మాట్లాడిన తీరు వర్ణవివక్షను సూచించేలా ఉందని సామాజిక మాధ్యమాల్లో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొంతమంది నెటిజన్లు అర్ష్‌దీప్ వ్యాఖ్యలు సరదాగా చేసినవేనని చెబుతుండగా, మరికొందరు మాత్రం ప్రజా వేదికలపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరైంది కాదని అభిప్రాయపడుతున్నారు. ప్రముఖ క్రీడాకారులు మాట్లాడే ప్రతి మాట అభిమానులపై ప్రభావం చూపుతుందని, అందువల్ల మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచిస్తున్నారు. అర్ష్‌దీప్ సింగ్ సామాజిక మాధ్యమాల్లో తరచూ సరదా వీడియోలు, చిన్న చిన్న దృశ్యాలను అభిమానులతో పంచుకుంటూ ఉంటారు. అయితే ఈసారి తిలక్ వర్మతో జరిగిన సంభాషణ వివాదాస్పదంగా మారడంతో క్రికెట్ అభిమానుల మధ్య పెద్ద ఎత్తున చర్చ కొనసాగుతోంది. ఇప్పటివరకు ఈ అంశంపై అర్ష్‌దీప్ సింగ్ గానీ, తిలక్ వర్మ గానీ అధికారికంగా స్పందించలేదు.

# ఆకాశ్ అంబానీకి తగిలిన ఫోన్



**ధర్మశాల, మే 15 :** ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ధర్మశాలలో జరిగిన ముంబై ఇండియన్స్ – పంజాబ్ కింగ్స్ మ్యాచ్ అనంతరం అనూహ్య ఘటన చోటుచేసుకుంది. ముంబై ఇండియన్స్ విజయం తర్వాత జట్టు యజమాని ఆకాశ్ అంబానీ మైదానంలో అభిమానులతో కలిసి సందడి చేస్తుండగా, ఒక అభిమాని చేతిలోని ఫోన్ అదుపుతప్పి నేరుగా ఆయన ముఖానికి బలంగా తగిలింది. ముంబై విజయం తర్వాత స్టేడియంలో అభిమానులు సెల్ఫీల కోసం ఒక్కసారిగా ముందుకు రావడంతో అక్కడ తోపులాట పరిస్థితి నెలకొంది. ఈ క్రమంలో ఒక భారీ మొబైల్ ఫోన్ ఎగిరివచ్చి ఆకాశ్ అంబానీ ముఖానికి బలంగా తాకింది. ఒక్కసారిగా షాక్‌కు గురైన ఆయన నొప్పితో అక్కడే ఆగిపోయినట్లు కనిపించారు. ఈ ఘటనతో కొద్దిసేపు వాతావరణం ఉద్రిక్తంగా మారింది. ఫోన్ తగలడంతో ఆకాశ్ అంబానీ తీవ్ర అసహనం వ్యక్తం చేసినట్లు అక్కడున్నవారు తెలిపారు. పరిస్థితిని గమనించిన భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమై ఆయన చుట్టూ రక్షణ వలయం ఏర్పాటు చేశారు. తన వల్లే ఈ ఘటన జరిగిందని గుర్తించిన అభిమాని వెంటనే క్షమాపణలు కోరాడు. మిగిలిన అభిమానులు కూడా సారీ చెబుతూ పరిస్థితిని చల్లార్చే ప్రయత్నం చేశారు. అభిమానులు కావాలని చేయలేదని అర్థం చేసుకున్న ఆకాశ్ అంబానీ తర్వాత శాంతించారు. అనంతరం మళ్లీ అభిమానులతో కలిసి నవ్వుతూ సెల్ఫీలు దిగడం అక్కడున్నవారిని ఆకట్టుకుంది. ఇదిలా ఉండగా మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ అద్భుత విజయాన్ని నమోదు చేసింది. 201 పరుగుల భారీ లక్ష్యాన్ని మరో బంతి మిగిలి ఉండగానే ఛేదించి ప్లే ఆఫ్స్ ఆశలను సజీవంగా ఉంచుకుంది. ముఖ్యంగా తిలక్ వర్మ తన ధాటైన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. కేవలం 33 బంతుల్లోనే 75 పరుగులు చేసి మ్యాచ్‌ను ముంబై వైపు తిప్పేశాడు. తన ఈ ఇన్నింగ్స్‌ను రోహిత్ శర్మకు అంకితం ఇవ్వడం అభిమానులను మరింత ఆకట్టుకుంది.

# ఐపీఎల్‌కు రికార్డు స్థాయి వ్యూయర్‌షిప్




**ముంబై, మే 15 :** ఐపీఎల్ 2026 సీజన్ క్రికెట్ అభిమానులను అలరించడమే కాకుండా, ప్రసార రంగంలో కూడా సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ఈ ఏడాది టోర్నీకి డిజిటల్, టెలివిజన్ మాధ్యమాల్లో భారీ స్థాయిలో ఆదరణ లభిస్తున్నట్లు జియో హాట్‌స్టార్ వెల్లడించింది. కంపెనీ విడుదల చేసిన గణాంకాల ప్రకారం, గత సీజన్‌తో పోలిస్తే ఈసారి డిజిటల్ వ్యూయర్‌షిప్ దాదాపు 15 శాతం పెరిగింది. ఇప్పటివరకు ఐపీఎల్ మ్యాచ్‌లకు మొత్తం 1.1 బిలియన్లకు పైగా డిజిటల్ వ్యూస్ నమోదయ్యాయి. ఇది ఐపీఎల్ చరిత్రలోనే ఒక కీలక మైలురాయిగా భావిస్తున్నారు. ప్రస్తుతం యువత ఎక్కువగా మొబైల్ ఫోన్లు, ట్యాబ్లెట్లు, స్మార్ట్ పరికరాల ద్వారా మ్యాచ్‌లను వీక్షిస్తోంది. ఎక్కడైనా, ఎప్పుడైనా మ్యాచ్‌లను చూసే సౌకర్యం ఉండటంతో డిజిటల్ స్ట్రీమింగ్‌కు భారీ ఆదరణ పెరిగినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు టెలివిజన్ మాధ్యమం కూడా తన ప్రాధాన్యతను నిలబెట్టుకుంది. ఈ సీజన్‌లో టీవీ వీక్షకుల సంఖ్య 500 మిలియన్ల మార్కును దాటినట్లు వెల్లడించారు. ముఖ్యంగా కుటుంబ సభ్యులు కలిసి ఇంట్లో టీవీల్లో మ్యాచ్‌లను వీక్షించడాన్ని ఇంకా కొనసాగిస్తున్నారని ప్రసార సంస్థలు పేర్కొంటున్నాయి. డిజిటల్, టీవీ రెండింటిలోనూ ఏకకాలంలో భారీ ఆదరణ రావడం వల్ల ఐపీఎల్ బ్రాండ్ విలువ మరింత పెరిగినట్లు మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా అత్యధికంగా వీక్షించబడే క్రీడా లీగ్‌లలో ఐపీఎల్ మరోసారి తన స్థానాన్ని బలంగా నిలబెట్టుకుందని వారు చెబుతున్నారు. ప్రతి సీజన్‌తో కొత్త రికార్డులు సృష్టిస్తూ వస్తున్న ఐపీఎల్, కేవలం క్రికెట్ టోర్నీగానే కాకుండా ప్రపంచస్థాయి వినోద వేదికగా కూడా రూపాంతరం చెందిందని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# చెన్నైకి లక్నో పంచ్!

**ఏడు వికెట్ల తేడాతో సూపర్ కింగ్స్ ఘోర పరాజయం**

**చెలరేగిన మిచెల్ మార్ష్..**

**కష్టాల్లో ప్లేఆఫ్ అవకాశాలు**

**ఐపీఎల్ టోర్నీలో చెన్నై సూపర్ కింగ్స్ కు భారీ షాక్ తగిలింది. పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉన్న లక్నో సూపర్ జెయింట్స్ చేతిలో ఏడు వికెట్ల తేడాతో పరాజయాన్ని మూటగట్టుకుంది. తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై నిర్ణీత ఓవర్లలో 187 పరుగులు చేయగా.. లక్నో బ్యాటర్లు కేవలం 16.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించారు. ఈ ఓటమితో చెన్నై ప్లేఆఫ్ ఆశలు తీవ్ర సంక్లిష్టంగా మారాయి.**





**లక్నో, మనసులో మాట:** ఎకానా క్రికెట్ స్టేడియం బి గ్రౌండ్ వేదికగా శుక్రవారం జరిగిన ఉత్కంఠ పోరులో చెన్నై సూపర్ కింగ్స్ పై లక్నో సూపర్ జెయింట్స్ అద్భుత విజయం సాధించింది. టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన చెన్నై జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఐదు వికెట్ల నష్టానికి 187 పరుగులు చేసింది. అనంతరం 188 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన లక్నో జట్టు కేవలం 16.4 ఓవర్లలో మూడు వికెట్లు మాత్రమే కోల్పోయి లక్ష్యాన్ని సునాయాసంగా ఛేదించింది. ఏకంగా 20 బంతులు మిగిలి ఉండగానే లక్నో గెలుపొందడం విశేషం. పాయింట్ల పట్టికలో ఆఖరి స్థానంలో ఉన్న లక్నో ఈ విజయంతో ఊరట పొందగా.. చెన్నై మాత్రం తీవ్ర నిరాశలో కూరుకుపోయింది.

## కార్తీక్ శర్మ ఒంటరి పోరాటం..

టాస్ గెలిచిన లక్నో జట్టు ఫీల్డింగ్ ఎంచుకోవడంతో చెన్నై బ్యాటింగ్ కు దిగింది. ఓపెనర్ కార్తీక్ శర్మ ఆరంభం నుంచే ధాటిగా ఆడాడు. కేవలం 42 బంతుల్లోనే 71 పరుగులు చేసి జట్టుకు భారీ స్కోరు అందించే ప్రయత్నం చేశాడు. మిగతా టాప్ ఆర్డర్ బ్యాటర్లు ఆశించిన స్థాయిలో రాణించలేకపోయారు. చివర్లో శివమ్ దూబె 16 బంతుల్లో అజేయంగా 32 పరుగులు, డెవాల్డ్ బ్రెవిస్ 16 బంతుల్లో 25 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. దీంతో చెన్నై గౌరవప్రదమైన స్కోరు సాధించగలిగింది. లక్నో బౌలర్లలో ఆకాశ్ సింగ్ అద్భుతంగా బౌలింగ్ చేసి నాలుగు ఓవర్లలో 26 పరుగులిచ్చి మూడు కీలక వికెట్లు పడగొట్టాడు. మహ్మద్ షమీ, షాబాజ్ అహ్మద్ చెరో వికెట్ దక్కించుకున్నారు.

## మార్ష్ విధ్వంసకర ఇన్నింగ్స్..

భారీ లక్ష్య ఛేదనలో లక్నో బ్యాటర్లు ఎక్కడా తడబడలేదు. ముఖ్యంగా మిచెల్ మార్ష్ చెన్నై బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 38 బంతుల్లోనే 90 పరుగులు చేసి జట్టు విజయాన్ని ఖాయం చేశాడు. అతడికి తోడుగా జోష్ ఇంగ్లిస్ 32 బంతుల్లో 36 పరుగులు సాధించాడు. చివర్లో నికోలస్ పూరన్ 17 బంతుల్లో అజేయంగా 32 పరుగులు చేసి లాంఛనాన్ని పూర్తి చేశాడు. చెన్నై బౌలర్లు ఏ దశలోనూ లక్నో బ్యాటర్లను కట్టడి చేయలేకపోయారు. ముకేశ్ చౌదరి ఒక వికెట్, స్పెన్సర్ జాన్సన్ ఒక వికెట్ మాత్రమే తీశారు. నూర్ అహ్మద్ తన నాలుగు ఓవర్ల కోటాలో 21 పరుగులిచ్చి పొదుపుగా బౌలింగ్ చేసినా వికెట్ దక్కలేదు.

## సంక్లిష్టంగా చెన్నై ప్లేఆఫ్ దారులు..

ఈ పరాజయంతో చెన్నై సూపర్ కింగ్స్ ప్లేఆఫ్ అవకాశాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పాయింట్ల పట్టికలో ప్రస్తుతం ఆ జట్టు 12 మ్యాచ్ లాడి ఆరు విజయాలు, ఆరు ఓటములతో 12 పాయింట్లు సాధించి ఆరో స్థానంలో కొనసాగుతోంది. ఆ జట్టు నెట్ రన్ రేట్ ప్లస్ 0.027 గా ఉంది. మరోవైపు ఆర్ సీ బీ, గుజరాత్ టైటాన్స్ జట్లు చెరో 16 పాయింట్లతో తొలి రెండు స్థానాల్లో ఉండి దాదాపు ప్లేఆఫ్ బెర్తులను ఖాయం చేసుకున్నాయి. సన్ రైజర్స్ 14 పాయింట్లు, పంజాబ్ కింగ్స్ 13 పాయింట్లు సాధించి చెన్నై కంటే ముందున్నాయి. రాజస్థాన్ రాయల్స్ కేవలం 11 మ్యాచ్ లు మాత్రమే ఆడి 12 పాయింట్లతో ఐదో స్థానంలో ఉంది. చెన్నై మిగిలి ఉన్న రెండు మ్యాచ్ లలో గెలిచినా గరిష్టంగా 16 పాయింట్లకు మాత్రమే చేరుకుంటుంది. ఇప్పటికే రాజస్థాన్ చేతిలో ఇంకా మూడు మ్యాచ్ లు ఉండటంతో ఆ జట్టు సునాయాసంగా ముందుకు వెళ్లే అవకాశం ఉంది. సన్ రైజర్స్, పంజాబ్ కింగ్స్ జట్లు కూడా చెన్నై పాలిట అడ్డంకిగా మారాయి. చెన్నై ప్లేఆఫ్ చేరాలంటే మిగిలిన రెండు మ్యాచ్ లలో భారీ తేడాతో తప్పక గెలవడంతో పాటు.. రాజస్థాన్, పంజాబ్, సన్ రైజర్స్ జట్లు తమ తదుపరి మ్యాచ్ లలో ఘోరంగా ఓడిపోవాలని ప్రార్థించాల్సిన పరిస్థితి ఏర్పడింది. బంతులు మిగిలి ఉండగానే లక్నో చేతిలో ఓడిపోవడం చెన్నై రన్ రేట్ పై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపింది.

# హీరోలు ఆటకు అవసరమే: ద్రవిడ్

**ముంబై, మే 15:** భారత క్రికెట్ జట్టులో సూపర్ స్టార్ సంస్కృతిని తగ్గించాలనే ప్రస్తుత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ ఆలోచనలతో మాజీ హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ విభేదించాడు. ఏ క్రీడకైనా హీరోలు చాలా అవసరమని, వారి ప్రదర్శనలే భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తాయని ఆయన స్పష్టం చేశాడు. 2024 టీ20 ప్రపంచకప్‌లో భారత్‌ను విజేతగా నిలిపిన తర్వాత కోచ్ పదవి నుంచి తప్పుకున్న ద్రవిడ్, తాజాగా ఓ పాడ్‌కాస్ట్‌లో మాట్లాడారు. ఈ సందర్భంగా భారత క్రికెట్‌లో సూపర్ స్టార్ల ప్రాధాన్యతపై తన అభిప్రాయాలను వెల్లడించారు. "ఏ ఆటకు అయినా హీరోలు అవసరం. మైదానంలో అసాధారణ ప్రదర్శనలు చేయకుండా ఎవరూ హీరోలు కాలేరు. ముఖ్యంగా భారతదేశంలో ఆటగాళ్లు ప్రశంసలతో పాటు తీవ్ర విమర్శలు, ఒత్తిడిని కూడా ఎదుర్కోవాల్సి ఉంటుంది. వాటన్నింటిని తట్టుకుని జట్టుకు విజయాలు అందించినప్పుడే ఒక ఆటగాడు లెజెండ్‌గా, సూపర్ స్టార్‌గా ఎదుగుతాడు" అని ద్రవిడ్ పేర్కొన్నారు. గంభీర్ అమలు చేయాలనుకుంటున్న "జట్టే ముఖ్యమని, వ్యక్తిగత స్టార్‌డమ్ అవసరం లేదనే" భావజాలానికి భిన్నంగా ద్రవిడ్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇదే సమయంలో భారత టెస్టు జట్టు ఇటీవల ఆశించిన స్థాయిలో రాణించకపోవడంపై కూడా ద్రవిడ్ స్పందించారు. "విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, రవిచంద్రన్ అశ్విన్ వంటి దిగ్గజ ఆటగాళ్లు తప్పుకోవడంతో వారి లోటు స్పష్టంగా కనిపిస్తోంది. అలాంటి ఆటగాళ్ల స్థానాన్ని వెంటనే భర్తీ చేయడం చాలా కష్టం. అయినప్పటికీ భారత క్రికెట్ బలంగానే ఉంది. కొంత సమయం పట్టినా జట్టు మళ్లీ పుంజుకుంటుందని నాకు నమ్మకం ఉంది" అని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుత క్రికెట్ షెడ్యూల్‌పై కూడా ద్రవిడ్ ఆందోళన వ్యక్తం చేశారు. "ఇప్పటి ఆటగాళ్లు ఒకేసారి అన్ని ఫార్మాట్లలో



ఆడుతున్నారు. పరిమిత ఓవర్ల క్రికెట్ ఎక్కువగా ఉండటంతో టెస్టు సిరీస్‌లకు సిద్ధమయ్యే సమయం వారికి సరిపోవడం లేదు. ఇది ఆటగాళ్ల తప్పు కాదు. ప్రస్తుత క్రికెట్ వ్యవస్థ అలాంటిదిగా మారింది" అని వ్యాఖ్యానించారు. రెడ్ బాల్ క్రికెట్ పట్ల యువ ఆటగాళ్లలో ఆసక్తి ఉన్నప్పటికీ, విపరీతమైన మ్యాచ్‌ల ఒత్తిడి కారణంగా పూర్తి స్థాయిలో టెస్టులకు సిద్ధం కాలేకపోతున్నారని ద్రవిడ్ అభిప్రాయపడ్డారు.

# పాక్ క్రికెట్‌కు ఐసీసీ 'డబుల్ షాక్'

**పాయింట్ల కోత, భారీ జరిమానా**

**బంగ్లాదేశ్ చేతిలో చారిత్రక ఓటమి..**

**స్లో ఓవర్ రేట్‌తో కోలుకోలేని దెబ్బ**

**బంగ్లాకూ తప్పని పెనాల్టీ**



**రావల్పిండి, మే 15:** పాకిస్థాన్ క్రికెట్ జట్టు ప్రస్తుతం అత్యంత దారుణమైన కాలాన్ని ఎదుర్కొంటోంది. మైదానంలో వరుస వైఫల్యాలతో సతమతమవుతున్న ఆ జట్టుకు, అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) తీసుకున్న కఠిన నిర్ణయాలు మరో గట్టి దెబ్బ తీశాయి. రావల్పిండి వేదికగా బంగ్లాదేశ్‌తో జరిగిన తొలి టెస్టులో 10 వికెట్ల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసిన పాక్‌కు, క్రమశిక్షణారాహిత్యం కారణంగా ఐసీసీ భారీ జరిమానా విధించింది. నిర్ణీత సమయంలో ఓవర్లను పూర్తి చేయనందుకు (స్లో ఓవర్ రేట్) మ్యాచ్ రిఫరీ రంజన్ మదుగల్లె పాకిస్థాన్ జట్టుపై తీవ్ర చర్యలు తీసుకున్నారు. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పాయింట్ల పట్టికలో పాక్‌కు ఏకంగా 8 పాయింట్ల కోత విధించారు. ఇప్పటికే పట్టికలో దిగువన ఉన్న పాకిస్థాన్‌కు, ఈ నిర్ణయం కోలుకోలేని దెబ్బగా మారింది. దీనివల్ల ఆ జట్టు ఫైనల్ రేసులో నిలవడం మరింత సంక్లిష్టంగా మారింది. పాయింట్ల కోతతో పాటు, ఐసీసీ ప్రవర్తనా నియమావళి ప్రకారం ఆటగాళ్లందరికీ వారి మ్యాచ్ ఫీజులో 30 నుండి 40 శాతం వరకు జరిమానా విధించారు.

## బంగ్లాదేశ్‌కూ షాక్:

పాకిస్థాన్‌పై చారిత్రక విజయం సాధించి సంబరాల్లో ఉన్న బంగ్లాదేశ్ జట్టుకు కూడా ఐసీసీ షాక్ ఇచ్చింది. ఆ జట్టు కూడా మూడు ఓవర్ల స్లో ఓవర్ రేట్ నమోదు చేయడంతో, 3 డబ్ల్యూటీసీ పాయింట్ల కోతతో పాటు 15 శాతం మ్యాచ్ ఫీజును జరిమానాగా కట్టాలని ఆదేశించింది. సొంతగడ్డపై బంగ్లాదేశ్ చేతిలో టెస్టుల్లో ఓడిపోవడం పాకిస్థాన్ చరిత్రలో ఇదే తొలిసారి. ఒకవైపు బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో వైఫల్యం, మరోవైపు మైదానంలో సమయాన్ని వృథా చేయడం వంటి చర్యలు ఆ జట్టు ప్రతిష్టను దిగజార్చుతున్నాయని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కెప్టెన్ షాన్ మసూద్ తన వ్యూహాలను మార్చుకోకపోతే, టెస్ట్ ఛాంపియన్‌షిప్ రేసు నుంచి పాక్ పూర్తిగా నిష్క్రమించే ప్రమాదం పొంచి ఉంది.




## 'నాగబంధం'లో అనసూయ పవర్‌ఫుల్ లుక్

**హైదరాబాద్, మే 15:** టాలీవుడ్ యువ హీరో విరాట్ కర్ణ ప్రధాన పాత్రలో తెరకెక్కుతున్న పాన్ ఇండియా ఫాంటసీ థ్రిల్లర్ 'నాగబంధం' సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి రోజురోజుకు పెరుగుతోంది. ఐశ్వర్య మీనన్, నభా నటేష్ కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రం జూలై 3న ప్రపంచవ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతోంది. సినిమా ప్రచార కార్యక్రమాల్లో భాగంగా నటి అనసూయ భరద్వాజ్ పుట్టినరోజు సందర్భంగా చిత్రబృందం ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో అనసూయ గంభీరమైన, మిస్టరీతో నిండిన పాత్రలో కనిపిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఆమె లుక్‌లో కనిపిస్తున్న తీవ్రత, ప్రత్యేకమైన శైలి సినిమాపై మరింత ఆసక్తిని పెంచుతున్నాయి. ఫాంటసీ మరియు థ్రిల్లర్ అంశాల సమ్మేళనంగా రూపొందుతున్న ఈ చిత్రంలో విరాట్ కర్ణ ఒక విభిన్నమైన పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పోస్టర్లు సినిమాలోని భారీ విజువల్స్ మరియు సాంకేతిక విలువలను ప్రతిబింబిస్తున్నాయి. అనసూయ కీలక పాత్రలో నటిస్తుండటం సినిమాకు మరింత ఆకర్షణగా మారింది. కథలో ఆమె పాత్రకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుందని సినీ వర్గాలు చెబుతున్నాయి. జూలై 3న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందో చూడాలి.

# థియేటర్ వివాదానికి ముగింపు దిశగా అడుగులు

**హైదరాబాద్, మే 15:** తెలుగు సినీ పరిశ్రమలో గత కొన్ని రోజులుగా కొనసాగుతున్న థియేటర్ల పర్సంటేజీ విధాన వివాదానికి పరిష్కారం దిశగా కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. నిర్మాతలు, సింగిల్ స్క్రీన్ థియేటర్ల యాజమాన్యాల మధ్య నెలకొన్న విభేదాలను చర్చల ద్వారా ముగించేందుకు తెలుగు చలనచిత్ర వాణిజ్య మండలి ముందుకొచ్చింది. చలనచిత్ర వాణిజ్య మండలి అధ్యక్షుడు డి. సురేశ్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన అత్యవసర సమావేశంలో అగ్ర నిర్మాతలు, థియేటర్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ప్రధానంగా పర్సంటేజీ షేరింగ్ విధానం, థియేటర్ల నిర్వహణ ఖర్చులు, వర్చువల్ ప్రింట్ ఫీజు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం 15 మంది సభ్యులతో ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇందులో ఐదుగురు నిర్మాతలు, ఐదుగురు డిస్ట్రిబ్యూటర్లు, ఐదుగురు ఎగ్జిబిటర్లకు ప్రాతినిధ్యం కల్పించారు. ఈ కమిటీ రెండు నెలల పాటు అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించి తమ తుది నివేదికను వాణిజ్య మండలికి సమర్పించనుంది. సమావేశం అనంతరం నిర్మాత సి. కళ్యాణ్ మాట్లాడుతూ పరిశ్రమ ప్రయోజనాల కోసం అందరూ ఏకాభిప్రాయానికి వచ్చారని తెలిపారు. రాబోయే రెండు నెలల్లో ఈ సమస్యకు




పూర్తి స్థాయి పరిష్కారం లభిస్తుందని, అప్పటివరకు కొత్త సినిమాల విడుదలలు, థియేటర్ల ప్రదర్శనలు ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ కీలక సమావేశంలో అల్లు అరవింద్, దిల్ రాజు, చదలవాడ శ్రీనివాసరావు, సుప్రియ యార్లగడ్డ, స్రవంతి రవికిషోర్, మైత్రీ రవి, రాధామోహన్, చెరుకూరి సుధాకర్, భోగవల్లి బాపినీడు, సాహు గారపాటి, సతీష్ కిలారు, సూర్యదేవర నాగవంశీ, ఎస్‌కేఎన్, రాజేష్ దండా, ధీరజ్ మొగిలినేని తదితర ప్రముఖ నిర్మాతలు పాల్గొన్నారు. అలాగే థియేటర్ ఎగ్జిబిటర్ల సంఘం తరఫున విజయేందర్ రెడ్డి, శ్రీధర్ సహా పలువురు ప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు. కమిటీ సమర్పించే నివేదిక ఆధారంగా టాలీవుడ్‌లో కొత్త థియేట్రికల్ విధానానికి రూపురేఖలు సిద్ధమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# పెద్ది ప్రమోషన్లలో కొత్త ఎమోషన్




## బుచ్చిబాబును లాంగ్ డ్రైవ్ తీసుకెళ్లిన రామ్‌చరణ్

రామ్ చరణ్, బుచ్చిబాబు కాంబినేషన్‌లో వస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ 'పెద్ది' విడుదలకు సిద్ధమవుతోంది. జూన్ 4న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో, చిత్ర యూనిట్ ప్రమోషన్ల స్పీడ్ పెంచింది. సినిమాపై హైప్ క్రియేట్ చేసేందుకు సరికొత్తగా ప్లాన్ చేస్తోంది. తాజాగా హీరో రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు ప్రచారంలో భాగంగా ఒక ప్రత్యేకమైన ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. అయితే ఇది మామూలు ఇంటర్వ్యూలా కాకుండా, రామ్ చరణ్ స్వయంగా కారు డ్రైవ్ చేస్తూ బుచ్చిబాబును ఒక షికారుకి తీసుకెళ్లారు. ప్రయాణంలోనే వీరిద్దరూ సినిమా ముచ్చట్లను పంచుకున్నారు. ఈ సందర్భంగా బుచ్చిబాబు మాట్లాడుతూ.. సినిమా పనులతో ఇంత బిజీగా ఉన్నప్పటికీ, నన్ను ఇలా లాంగ్ డ్రైవ్‌కు తీసుకువచ్చినందుకు థాంక్యూ చరణ్ సార్ అంటూ తన ఆనందాన్ని పంచుకున్నారు. దానికి చరణ్ స్పందిస్తూ.. 'అదంతా సరే కానీ, మన 'పెద్ది' సినిమా ఎప్పుడు వస్తుందో ప్రేక్షకులకు కచ్చితంగా చెప్పు' అని నవ్వుతూ అడిగారు. దీంతో వీరిద్దరూ కలిసి జూన్ 4న 'పెద్ది' సినిమా థియేటర్లలోకి వస్తోందని అధికారికంగా ప్రకటించారు. భారీ అంచనాలతో వస్తున్న ఈ చిత్రాన్ని ప్రేక్షకులందరూ థియేటర్లలో చూసి ఎంజాయ్ చేయాలని రామ్ చరణ్, బుచ్చిబాబు కోరారు



## ఆలియా వ్యాఖ్యలపై చర్చ



బాలీవుడ్ ప్రముఖ నటి ఆలియా భట్ అంతర్జాతీయ సినీ ఉత్సవ వేదికపై చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో పెద్ద చర్చకు దారితీశాయి. భారతీయ చిత్ర పరిశ్రమలో ఇప్పటికీ పురుషాధిక్యత కొనసాగుతోందని ఆమె చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. సినిమాల్లో కథ కంటే హీరోలకు ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నారని ఆలియా అభిప్రాయపడ్డారు. చాలా చిత్రాలు ఇప్పటికీ హీరోల చుట్టూనే తిరుగుతున్నాయని, కథ బలంగా ఉండటమే అసలు ముఖ్యమని ఆమె పేర్కొన్నారు. సినిమాను విజయవంతం చేసేది కేవలం హీరో కాదని, మంచి కథే ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చెప్పారు. ఆమె వ్యాఖ్యలకు సామాజిక మాధ్యమాల్లో భిన్న స్పందనలు వస్తున్నాయి. కొందరు ఆలియా ధైర్యంగా నిజం మాట్లాడిందని ప్రశంసిస్తుండగా, మరికొందరు మాత్రం తీవ్ర విమర్శలు చేస్తున్నారు. భారతీయ సినిమాను తక్కువ చేసి మాట్లాడుతున్నారని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఇక ఆమె భర్త నటించిన కొన్ని చిత్రాల్లో కూడా పురుషాధిక్యత కనిపించిందని, అలాంటి సినిమాలపై ఎందుకు స్పందించలేదని నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. పరిశ్రమలో మార్పు గురించి మాట్లాడేవారు ముందుగా తమ చుట్టూ ఉన్న విషయాలపై స్పందించాలని కొందరు వ్యాఖ్యానిస్తున్నారు. మరోవైపు ఆలియా చెప్పిన విషయాల్లో నిజం ఉందని పలువురు సినీ అభిమానులు అభిప్రాయపడుతున్నారు. హీరోలకు భారీ పారితోషికాలు, ప్రత్యేక ప్రాధాన్యత, విస్తృత ప్రచారం లభిస్తున్నప్పటికీ హీరోయిన్లకు సమాన గుర్తింపు దక్కడం లేదని చర్చ జరుగుతోంది. గతంలో కూడా పలువురు నటీమణులు సినీ పరిశ్రమలో మహిళలకు సరైన ప్రాధాన్యత దక్కడం లేదని బహిరంగంగానే వ్యాఖ్యానించారు. ఇప్పుడు ఆలియా వ్యాఖ్యలతో మరోసారి భారతీయ సినిమాల్లో కథలకు ప్రాధాన్యత పెరగాల్సిన అవసరంపై చర్చ మొదలైంది.




# 'దూరదర్శిని' మూవీ రివ్యూ..

**హైదరాబాద్, మే 15 :** ప్రస్తుతం చిన్న సినిమాలు కూడా బలమైన కథతో వస్తే ప్రేక్షకులు ఆదరిస్తున్న పరిస్థితి నెలకొంది. అలాంటి కథా బలంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన తాజా చిత్రం 'దూరదర్శిని'. పేరు వినగానే 90వ దశకపు జ్ఞాపకాలను గుర్తు చేసే ఈ సినిమా నేడు థియేటర్లలో విడుదలైంది. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ ప్రేమకథ ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుందో ఇప్పుడు చూద్దాం. మట్టపర్రు అనే పల్లెటూరి నేపథ్యంలో సినిమా సాగుతుంది. చిన్నప్పటి నుంచి ఒకరినొకరు ఇష్టపడే హరి, వాణి ప్రేమకథ చుట్టూనే కథ తిరుగుతుంది. ప్రతి శుక్రవారం దూరదర్శనిలో వచ్చే 'చిత్రలహరి' కార్యక్రమం వీరిద్దరినీ మరింత దగ్గర చేస్తుంది. అయితే గ్రామంలో ఉన్న కుల రాజకీయాలు, వాణి కుటుంబ ప్రభావం వీరి ప్రేమకు అడ్డంకిగా మారతాయి. వాణి అన్నయ్య పరశురామ్‌తో హరికి జరిగిన గొడవ తర్వాత కథ ఆసక్తికర మలుపు తిరుగుతుంది. చివరకు తమ ప్రేమను వారు ఎలా గెలిపించుకున్నారు అనేదే సినిమా ప్రధానాంశం. దర్శకుడు కార్తికేయ 90వ దశకపు గ్రామీణ వాతావరణాన్ని చాలా సహజంగా చూపించారు. పల్లెటూరి జీవనం, అప్పటి టెలివిజన్ సంస్కృతి, కుటుంబ భావోద్వేగాలను తెరపై చక్కగా ఆవిష్కరించారు. ముఖ్యంగా 'చిత్రలహరి' నేపథ్యంలో వచ్చే సన్నివేశాలు అప్పటి ప్రేక్షకులకు ప్రత్యేక అనుభూతిని కలిగిస్తాయి. తొలి భాగంలో కథనం కొంత నెమ్మదిగా సాగినా, గ్రామీణ హాస్యం మరియు భావోద్వేగ సన్నివేశాలు ఆకట్టుకుంటాయి. రెండో భాగంలో కుల వివక్ష, ప్రేమ కోసం చేసే పోరాటం వంటి అంశాలు సినిమాను మరింత బలంగా నిలబెట్టాయి. క్లైమాక్స్‌లో వచ్చే మలుపు ప్రేక్షకులను ఆశ్చర్యపరుస్తుంది. హీరోగా నటించిన సువీక్షిత్ తన తొలి చిత్రంలోనే మంచి నటన కనబరిచాడు. హీరోయిన్ గీతికా రతన్ కూడా సహజ నటనతో ఆకట్టుకుంది. హీరో స్నేహితుల పాత్రల్లో కనిపించిన భద్ర, బలరామ్ హాస్యంతో అలరించారు. పరశురామ్ పాత్రలో నటించిన నటుడు తన గంభీరమైన నటనతో మెప్పించాడు. సాంకేతికంగా కూడా సినిమా బాగానే నిలిచింది. ఆనంద్ గుర్రన అందించిన నేపథ్య సంగీతం భావోద్వేగ సన్నివేశాలను మరింత ఎత్తుకు తీసుకెళ్లింది.



పాటలు సాధారణంగా ఉన్నా, నేపథ్య సంగీతం సినిమాకు ప్రధాన బలంగా నిలిచింది. నిర్మాణ విలువలు కథకు తగ్గట్టుగా ఉన్నాయి. అయితే తొలి భాగంలో కొన్ని సన్నివేశాలు సాగదీతగా అనిపించడం సినిమాకు చిన్న మైనస్‌గా మారింది. మొత్తంగా చూస్తే 'దూరదర్శిని' పాత జ్ఞాపకాలను గుర్తు చేసే ఒక భావోద్వేగ గ్రామీణ ప్రేమకథ. ముఖ్యంగా 90వ దశకపు అనుభూతులను మళ్లీ ఆస్వాదించాలనుకునే ప్రేక్షకులకు ఈ సినిమా మంచి ఎంపికగా చెప్పొచ్చు.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **7036644111, 9490140565**

# శుభకార్యాలకు 'అధిక' బ్రేక్!

- ముగిసిన ముహూర్తాల సందడి..
- ఆదివారం నుంచి 'అధిక జ్యేష్టం'
- నెల రోజుల పాటు శుభకార్యాలకు విరామం..
- భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు



**విజయవాడ, మే 15:** తెలుగు రాష్ట్రాల్లో గత కొన్ని నెలలుగా కొనసాగిన పెళ్లిళ్ల సందడికి తాత్కాలికంగా విరామం పడింది. మే 13తో శుభ ముహూర్తాలు ముగియగా, రాబోయే ఆదివారం నుంచి 'అధిక జ్యేష్ఠ మాసం' ప్రారంభం కానుంది. దీంతో జూన్ 20వ తేదీ వరకు సుమారు నెల రోజుల పాటు ఎటువంటి శుభకార్యాలకు అవకాశం లేదని పంచాంగ కర్తలు, పురోహితులు స్పష్టం చేస్తున్నారు. ఫిబ్రవరి నుంచి మే వరకు కళకళలాడిన తెలుగు లోగిళ్లు, ఇప్పుడు నెల రోజుల పాటు విరామం తీసుకోనున్నాయి. పండితుల సమాచారం ప్రకారం, జూన్ 20న అధిక మాసం ముగిసిన తర్వాత జూన్ చివరి వారంలో కేవలం 8 రోజులు మాత్రమే మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఆ తర్వాత జూలైలో 4 రోజులే అవకాశం ఉండగా, ఆగస్టు నుంచి అక్టోబర్ వరకు చతుర్మాసం కారణంగా ముహూర్తాలకు ఇబ్బందులు ఎదురవనున్నాయి. మళ్లీ నవంబర్‌లో 11 రోజులు, డిసెంబర్‌లో 14 రోజులు పెళ్లిళ్లకు అనువైన రోజులు ఉన్నట్లు పురోహితులు వివరిస్తున్నారు. ఈ సుదీర్ఘ విరామం వల్ల ఫోటోగ్రాఫర్లు, క్యాటరింగ్, కల్యాణ మండపాలపై ఆధారపడ్డ వారు ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు

మరోవైపు ముహూర్తాలు ముగియడం, అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చితులకు తోడు కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాలు పెంచిన నేపథ్యంలో భారత్‌లో బంగారం ధరల ర్యాలీకి బ్రేక్ పడింది. శుక్రవారం ఉదయం హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో పసిడి, వెండి ధరలు భారీగా పతనమయ్యాయి. 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర ఏకంగా 2,240 రూపాయల మేర తగ్గి 1,60,090 రూపాయల వద్ద ట్రేడవుతోంది. అదేవిధంగా 22 క్యారెట్ల బంగారం ధర కూడా 2,050 రూపాయలు క్షీణించి 1,46,750 రూపాయలకు చేరుకుంది. కేవలం పసిడి ధరలే కాకుండా వెండి ధరలో కూడా ఊహించని విధంగా 10,000 రూపాయల భారీ కోత కనిపించింది. ప్రస్తుతం కిలో వెండి ధర 3.05 లక్షల రూపాయల వద్ద కొనసాగుతోంది. దేశంలోని ఇతర ప్రధాన నగరాలైన ఢిల్లీ, ముంబై, చెన్నైలలో కూడా ఇదే తరహాలో ధరలు దిగివచ్చాయి. ముహూర్తాల సీజన్ ముగియడంతో కొనుగోళ్లు మందగించి జ్యువెలరీ మార్కెట్లు వెలవెలబోతున్నాయి.

## నీట్ పేపర్ లీక్ సూత్రధారి కులకర్ణి

### ప్రొఫెసర్‌ను అరెస్ట్ చేసిన సీబీఐ

**న్యూఢిల్లీ, మే 15:** నీట్ యూజీ 2026 పరీక్ష పేపర్ లీక్ ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న ప్రొఫెసర్ పి.వి.కులకర్ణిని సీబీఐ అరెస్టు చేసింది. నిందితుడిని పుణెకు చెందిన రసాయన శాస్త్ర అధ్యాపకుడిగా గుర్తించిన అధికారులు ఆయనను అదుపులోకి తీసుకున్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) తరఫున పరీక్ష ప్రక్రియలో కొన్నేళ్లుగా కులకర్ణి పాల్గొంటున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రశ్నపత్రాలను పొందే అవకాశం అతనికి దొరికింది. ఏప్రిల్ చివరి వారంలో మరో నిందితురాలైన మనీషా వాఘ్మారే సహాయంతో నిందితుడు పేపర్ లీక్ కుట్రకు పాల్పడినట్లు సీబీఐ అధికారులు ఆరోపిస్తున్నారు. మహారాష్ట్రలోని పుణెలో తన నివాసంలో ఎంపిక చేసిన విద్యార్థులకు ప్రత్యేక కోచింగ్ తరగతులను కులకర్ణి నిర్వహించినట్లు సీబీఐ అధికారులు తెలిపారు. మనీషా సహాయంతో పలువురు విద్యార్థులను సమీకరించి వారికి రహస్యంగా కోచింగ్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నీట్ ప్రశ్నపత్రాలను లీక్ చేసినట్లు ఆరోపించారు. ఈ తరగతుల్లోనే ప్రశ్నలు, సరైన జవాబులను విద్యార్థులకు చెప్పారని అధికారులు తెలిపారు. ఆ ప్రశ్నలు మే 3న నిర్వహించిన అసలు నీట్ యూజీ 2026 ప్రశ్నపత్రాల్లో వచ్చాయని వెల్లడించారు. దీంతో మే 14న మనీషాను అరెస్టు చేయగా.. తాజాగా కులకర్ణిని అరెస్టు చేశారు. ఈ కేసుకు సంబంధించి జైపూర్, గురుగ్రామ్, నాసిక్, పుణె, అహల్యానగర్ ప్రాంతాల్లో ఇప్పటివరకు ఏడుగురిని సీబీఐ అరెస్టు చేసింది. వారిలో ఐదుగురిని ఇప్పటికే కోర్టులో హాజరుపర్చగా.. ఏడు రోజులపాటు పోలీసు కస్టడీకి అప్పగించింది. గురువారం అరెస్టయిన మిగిలిన ఇద్దరు నిందితులను ట్రాన్సిట్ రిమాండ్ నిమిత్తం పుణెలోని కోర్టులో హాజరుపరిచారు. తదుపరి విచారణ కోసం ఆ ఇద్దరినీ ఢిల్లీకి తరలించనున్నారు.





## రాహుల్ విదేశీ పర్యటనలపై కిరణ్ రిజిజు అభ్యంతరం

### పార్లమెంట్‌కు సమాచారం ఇవ్వడం లేదన్న కేంద్రమంత్రి

**న్యూఢిల్లీ, మే 15:** లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు శుక్రవారనాడు ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంటరీ నిబంధనలను రాహుల్ పాటించాలని, నిబంధనల ప్రకారం విదేశీ పర్యటనలకు ముందు లోక్‌సభ లేదా రాజ్యసభ సెక్రటేరియట్‌కు ఆ వివరాలు తెలియజేయాల్సి ఉంటుందని శుక్రవారంనాడిక్కడ మీడియాతో మాట్లాడుతూ చెప్పారు. రాహుల్ విదేశీ పర్యటనలు చేసే హక్కును తాము నిరోధించడం లేదని, అయితే సమాచారం మాత్రం ఇవ్వాలని కోరుతున్నామని కిరణ్ రిజిజు చెప్పారు. 'ప్రతి ఎంపీ విదేశీ పర్యటనలకు వెళ్లొచ్చు. కానీ మూడు వారాల ముందు సమాచారం ఇవ్వాలి. రాహుల్ గాంధీని ఆహ్వానించే ఏజెన్సీలు, సంస్థలు ఆ ఖర్చులు పెట్టుకోవచ్చు. అయితే అది విదేశీ కంట్రిబ్యూషన్ (నియంత్రణ) చట్టం కిందకు వస్తుంది. అందువల్ల ఆ సమాచారాన్ని హోం శాఖకు షేర్ చేయాల్సి ఉంటుంది' అని అన్నారు. రాహుల్ గాంధీ 2004లో తొలిసారి ఎంపీ అయినప్పటి నుంచి 54 సార్లు విదేశీ పర్యటనలు చేసినట్టు రిజిజు చెప్పారు. '54 పర్యటనలకే అది పరిమితం కాదు. ఎన్నిరోజులు ఆయన విదేశాల్లో ఉన్నారు, ఖర్చుల సంగతేమిటి? ఇవన్నీ లెక్కల్లోకి వస్తాయి. ఆ దృష్ట్యా రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ నిబంధనలు పాటించి తగిన సమాచారాన్ని అధికారులకు ఇవ్వాలి. మూడు వారాలకు ముందే ప్రతిపాదిత పర్యటనను లోక్‌సభ స్పీకర్‌కు చెప్పాలి. విదేశీ అతిథ్యాన్ని ఆయన అంగీకరించి ఉంటే ఆ విషయాన్ని ఎఫ్‌సీఆర్ఏ కింద హోం శాఖకు తెలియజేయాల్సి ఉటుంది' అని వివరించారు. చట్టం అనేది అందరికీ సమానమేనని, కేవలం లోక్‌సభ విపక్షనేతను ఉద్దేశించి తాను ఈ విజ్ఞప్తి చేయడం లేదని చెప్పారు. దేశంలో అమల్లో ఉన్న చట్టాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని సూచించారు.

## అలజడులు సృష్టిస్తున్న వైసిపి అల్లరిమూకలు

### చిల్లర విషయలతో ఆందోళనలతో అరాచకం

### నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి ఘాటు విమర్శలు

**కర్నూలు, మే 15:** వైసీపీ నేతలపై నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. కర్నూలులో వైసీపీ నేతల ఆందోళనలపై స్పందించారు. రౌడీ మూకల గురించి మాట్లాడాల్సిన అవసరం లేకపోయినా ప్రజాప్రతినిధిగా మాట్లాడుతున్నట్లు తెలిపారు. వైసీపీ నాయకులు చిల్లర ఇష్యూలను పట్టుకొని అల్లరి మూకలతో అలజడులు సృష్టిస్తున్నారని మండిపడ్డారు. కర్నూలులో గురువారం జరిగిన వైసీపీ ఆందోళనలో సగం మందికి పైగా గంజాయి బ్యాచ్, క్రిమినల్ బ్యాక్ గ్రౌండ్ కలిగిన వారే పాల్గొన్నారని తెలిపారు. ఎస్వీ మోహన్ రెడ్డి స్క్రాప్ మనుషులతో మాట్లాడిస్తున్నారని మండిపడ్డారు. బాలు అనే వ్యక్తి అమ్మాయిలను బ్లాక్ మెయిల్ చేసి డబ్బులు దోచుకున్నాడని తెలిపారు. పోలీసులు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటే



వైసీపీ నాయకులు ఇలాంటి వారి కోసం ఆందోళనలు చేయడం సిగ్గుచేటని విమర్శించారు. ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన మంత్రిపై ఏవేవో మాట్లాడుతున్నారని బైరెడ్డి శబరి ఆగ్రహం వ్యక్తం చేశారు. వారు వ్యాపారాలు చేసి కష్టపడి సంపాదించడం తప్పా అని ప్రశ్నించారు. తండ్రి పేరు చెప్పుకొని రాజకీయాల్లోకి వచ్చారని వైసీపీ నేత అంటున్నారని.. జగన్ తండ్రి పేరు చెప్పి రాజకీయాల్లోకి రాలేదా అని ప్రశ్నించారు. గంజాయి బ్యాచ్‌పై నిఘా పెడతామని స్పష్టం చేశారు. ముచ్చుమర్రిలో మైనర్ బాలికను అత్యాచారం చేసి చంపిన వాళ్లు వైసీపీ కార్యకర్తలే అంటూ ఆరోపించారు. బాలికను చంపిన వారిని వైసీపీ నేతలు పరామర్శించి.. తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినా తాను శవ రాజకీయం చేయలేదన్నారు. బాలిక శవం కోసం 5 రోజులు గాలించామని.. అప్పుడు వైసీపీ నేతలంతా ఎక్కడికి వెళ్లారని ప్రశ్నించారు. వైసీపీ నేతలు కాదు...రాక్షసులంటూ విరుచుకుపడ్డారు. రాయలసీమ అభివృద్ధిపై బహిరంగ చర్చకు వైసీపీ నేతలు సిద్ధమా.. తాను సిద్ధం అంటూ ఎంపీ సవాల్ విసిరారు. 'అమ్మాయిలను బ్లాక్ మెయిల్ చేసి వీడియోలు తీసి బెదిరిస్తుంటే పోలీసులు స్పందించడం తప్పా. పోలీసులను లాక్కొచ్చి పనిష్మెంట్ ఇస్తారట.. పోలీసులు అంటే ఏమనుకుంటున్నారు. టీడీపీ ఎవరినీ వదలదు.. మేము తప్పుచేసినా యాక్షన్ తీసుకుంటారు. భూకబ్జాలు చేశారంటున్న వాళ్లు ఆధారాలతో ఎందుకు ముందుకు రాలేదు' అని ఎంపీ బైరెడ్డి శబరి ప్రశ్నించారు.



## ఆగివున్న రైలు బోగీలో మంటలు

హైదరాబాద్, మే 15: నాంపల్లి రైల్వేస్టేషన్‌లో అగ్నిప్రమాదం జరిగింది. జైపూర్ వెళ్లాల్సిన రైలు ఏసీ బోగీలో మంటలు వచ్చాయి. నాలుగో నంబర్ ప్లాట్‌ఫామ్‌పై నిలిపి ఉండగా ఈ ఘటన చోటుచేసుకుంది. అగ్నిమాపక సిబ్బంది మూడు ఫైరిరజన్లతో ఘటనాస్థలికి చేరుకుని బీ1 బోగీలో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అగ్నిప్రమాదానికి గల కారణాలపై అధికారులు విచారణ చేపట్టారు.




## ఫైటర్‌జెట్ల తయారీ కేంద్రం ఏర్పాటు

### ప్రధాని మోడీకి పవన్ కల్యాణ్ కృతజ్ఞతలు

**అమరావతి, మే 15:** శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో ఏఎంసీఏ ప్రాజెక్టుకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శంకుస్థాపన చేశారు. పుట్టపర్తిలో రూ.15,803 కోట్ల పెట్టుబడితో ఫైటర్‌జెట్ల తయారీ కేంద్రం ఏర్పాటు కానుంది. ఈ ప్రాజెక్టు ద్వారా 7,500 మంది ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఏఎంసీఏ ప్రాజెక్టుపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందించారు. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి, పరివర్తనాత్మక జాతీయ కార్యక్రమాల ద్వారా రాష్ట్రాలకు సాధికారత కల్పించడానికి అచంచలమైన నిబద్ధత కనబరుస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి పవన్ కృతజ్ఞతలు తెలియజేశారు. 'రక్షణ, ఏరోస్పేస్, డీప్ టెక్నాలజీ రంగాలలో ఆంధ్రప్రదేశ్ ఒక శక్తి కేంద్రంగా మారే ప్రయాణంలో ఇది ఒక కీలకమైన మైలురాయి. రూ.15,800 కోట్ల పెట్టుబడితో 650 ఎకరాలలో ఎయిర్‌క్రాఫ్ట్ ఇంటిగ్రేషన్ / ఫ్లైట్ టెస్ట్ సెంటర్‌తో పాటు ప్రధాన రక్షణ, డ్రోన్ ఎకోసిస్టమ్ ప్రాజెక్టులను స్థాపించడం అనేది, నవకల్పన ఆధారిత వృద్ధి, వ్యూహాత్మక స్వావలంబన దిశగా ఒక చరిత్రాత్మక ముందడుగు. సాంకేతిక పురోగతిని వేగవంతం చేయడంతో పాటు, 7,500కు పైగా ఉపాధి అవకాశాలను సృష్టిస్తుందని అంచనా. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణానికి, పరివర్తనాత్మక జాతీయ కార్యక్రమాల ద్వారా రాష్ట్రాలకు సాధికారత కల్పించడానికి అచంచలమైన నిబద్ధత కనబరుస్తున్న ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి నా హృదయపూర్వక కృతజ్ఞతలు. భారతదేశ వ్యూహాత్మక రక్షణ వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్ పాత్రను బలోపేతం చేయడానికి నిరంతరం మద్దతు ఇస్తున్న కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు నా హృదయపూర్వక ధన్యవాదాలు. ఏపీ సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్.. పారిశ్రామిక వృద్ధి, ఆవిష్కరణలు, భవిష్యత్తు – సిద్ధ పెట్టుబడుల కోసం తన దార్శనికతను బలోపేతం చేస్తూనే ఉంది' అంటూ ఎక్స్‌లో పవన్ కల్యాణ్ పోస్ట్ చేశారు.

## సర్ అర్థర్ కాటన్‌కు జగన్ నివాళి



**అమరావతి, మే 15:** సర్ ఆర్థర్ కాటన్ జయంతి సందర్భంగా వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్.. సర్ ఆర్థర్ కాటన్‌కు నివాళి అర్పించారు. ఈ క్రమంలో వ్యవసాయ, నీటిపారుదల రంగానికి ఆయన చేసిన కృషిని ఎప్పటికీ మరువలేమని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ట్విట్టర్ వేదికగా.. 'గోదావరి జిల్లాలు నేడు పచ్చని పంట పొలాలతో అలరారుతున్నాయంటే అందుకు కారణం సర్ ఆర్థర్ కాటన్. సముద్రంలో కలిసిపోతున్న వరద నీటికి అడ్డుకట్ట వేసి రాజమహేంద్రవరం సమీపంలో ధవళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి.. లక్షల ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందించిన మహనీయుడు. వ్యవసాయ, నీటిపారుదల రంగానికి ఆయన చేసిన కృషిని ఎప్పటికీ మరువలేం అని' పోస్టు చేశారు. గోదావరి జిల్లాలు నేడు పచ్చని పంట పొలాలతో అలరారుతున్నాయంటే అందుకు కారణం సర్ ఆర్థర్ కాటన్ గారు. సముద్రంలో కలిసిపోతున్న వరద నీటికి అడ్డుకట్ట వేసి రాజమహేంద్రవరం సమీపంలో ధవళేశ్వరం ప్రాజెక్టును నిర్మించి లక్షల ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందించిన మహనీయుడు ఆయన అని కోనియాడారు.

## నేడు శ్రీకాకుళం జిల్లాలో చంద్రబాబు పర్యటన

### 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం

**అమరావతి, మే 15 :** 'స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర' కార్యక్రమంలో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో పర్యటించనున్నారు. రేపు ఉదయం 9.00 గంటలకు ఉండవల్లి క్యాంప్ ఆఫీస్ నుంచి బయలుదేరి 10.40 గంటలకు శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం తామ్రపల్లి చేరుకుంటారు. అనంతరం సీఎం నరసన్నపేటలో ఏర్పాటు చేసిన ప్రజావేదిక సమావేశంలో పాల్గొంటారు. ఉదయం 11.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు 'స్వర్ణాంధ్ర -- స్వచ్ఛాంధ్ర' కార్యక్రమానికి సీఎం హాజరుకానున్నారు. మధ్యాహ్నం 1.20 గంటలకు నరసన్నపేటలోని ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ దగ్గర ప్రజలతో సమావేశమై స్థానిక సమస్యలు, అభివృద్ధి అంశాలపై ప్రజలతో మాట్లాడనున్నారు. అనంతరం మధ్యాహ్నం 2.10 గంటల నుంచి 3.40 గంటల వరకు తామ్రపల్లి గ్రామంలో నిర్వహించే స్థానిక పార్టీ కేడర్ సమావేశంలో పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తారు. 3.55 గంటలకు తామ్రపల్లి నుంచి తిరుగు ప్రయాణమై సాయంత్రం 5.35 గంటలకు ఉండవల్లి క్యాంప్ ఆఫీసుకు చేరుకుంటారు. రాష్ట్రంలో గత 16 నెలలుగా ప్రతీ నెలా 3వ శనివారం రాష్ట్ర ప్రభుత్వం 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా పరిశుభ్రత, పర్యావరణం వంటి అంశాల్లో పురోగతి సాధించాలని ముఖ్యమంత్రి కృత నిశ్చయంతో ఉన్నారు.

# రికార్డు కనిష్ఠానికి రూపాయి విలువ



**న్యూఢిల్లీ, మే 15 :** అమెరికన్ డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ శుక్రవారం రికార్డు స్థాయిలో పతనమైంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు భారీగా పెరగడం, విదేశీ పెట్టుబడిదారులు భారత మార్కెట్ల నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకోవడం వంటి పరిణామాల ప్రభావంతో రూపాయి ఒక దశలో డాలర్‌కు రూ.96.14 వద్ద ట్రేడైంది. ఇది ఇప్పటివరకు నమోదైన అత్యల్ప స్థాయిగా ఆర్థిక వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ వారం మొత్తం రూపాయి వరుసగా బలహీనపడుతుండగా, శుక్రవారం మరింత ఒత్తిడికి గురైంది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు, హోర్ముజ్ జలసంధి ప్రాంతంలో చమురు రవాణాకు ఏర్పడిన ఆటంకాలు ప్రపంచ మార్కెట్లపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. భారత్ దిగుమతి చేసుకునే ముడి చమురులో అధిక భాగం ఈ మార్గం ద్వారానే వస్తుండటంతో దేశ ఆర్థిక వ్యవస్థపై కూడా ప్రభావం పడుతోంది. అమెరికా కేంద్ర బ్యాంక్ వడ్డీ రేట్ల తగ్గింపుపై స్పష్టత ఇవ్వకపోవడం వల్ల అంతర్జాతీయంగా డాలర్ మరింత బలపడింది. దీంతో పెట్టుబడిదారులు సురక్షిత పెట్టుబడుల వైపు మొగ్గు చూపుతూ అభివృద్ధి చెందుతున్న దేశాల మార్కెట్ల నుంచి నిధులను వెనక్కి తీసుకుంటున్నారు. భారత మార్కెట్ నుంచి విదేశీ పెట్టుబడులు బయటకు వెళ్లడం కూడా రూపాయి పతనానికి ప్రధాన కారణంగా మారింది. ఇక దేశీయంగా టోకు ధరల సూచీ దాదాపు నాలుగేళ్ల గరిష్ఠ స్థాయికి చేరుకోవడం, ద్రవ్యోల్బణ అంచనాలు పెరగడం కూడా ఆందోళన కలిగిస్తున్నాయి. పలువురు ఆర్థిక నిపుణులు భారత ఆర్థిక వృద్ధి అంచనాలను తగ్గిస్తుండగా, ధరల పెరుగుదలపై హెచ్చరికలు చేస్తున్నారు. రూపాయి మరింత పతనం కాకుండా నిలువరించేందుకు భారతీయ రిజర్వ్ బ్యాంక్ రంగంలోకి దిగింది. విదేశీ మారక మార్కెట్లో డాలర్లను విక్రయిస్తూ పరిస్థితిని అదుపులో ఉంచేందుకు ప్రయత్నాలు చేస్తోంది. అయినప్పటికీ రూపాయి బలహీనత కొనసాగితే దిగుమతుల వ్యయం మరింత పెరిగే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రత్యేకంగా ముడి చమురు, ఎలక్ట్రానిక్ వస్తువులు, పప్పుధాన్యాలు వంటి దిగుమతి ఆధారిత ఉత్పత్తుల ధరలు పెరిగే ప్రమాదం ఉందని ఆర్థిక వర్గాలు పేర్కొంటున్నాయి. దీంతో రాబోయే రోజుల్లో ద్రవ్యోల్బణం మరింత పెరిగే అవకాశం ఉందని విశ్లేషిస్తున్నారు.

# ఐటీఆర్ దాఖలు ప్రారంభం.. విడుదలైన కొత్త ఫారాలు




**న్యూఢిల్లీ, మే 15 :** పన్ను చెల్లింపుదారులకు ఆదాయపు పన్ను శాఖ కీలక ప్రకటన చేసింది. 2026-27 అసెస్‌మెంట్ సంవత్సరానికి సంబంధించిన ఆదాయపు పన్ను రిటర్నుల దాఖలు ప్రక్రియను అధికారికంగా ప్రారంభించింది. ఈ సందర్భంగా ఐటీఆర్-1 (సహజ్), ఐటీఆర్-4 (సుగం) ఫారాలకు సంబంధించిన ఎక్సెల్ యుటిలిటీలను ఈ-ఫైలింగ్ వేదికలో అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో పన్ను చెల్లింపుదారులు తమ రిటర్నులను ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్ విధానంలో కూడా దాఖలు చేసుకునే అవకాశం కల్పించింది. ఆదాయపు పన్ను శాఖ సామాజిక మాధ్యమ వేదిక ద్వారా ఈ విషయాన్ని వెల్లడించింది. పన్ను చెల్లింపుదారులు నేరుగా ఈ-ఫైలింగ్ వేదికలో ఫారాలను నింపి సమర్పించవచ్చని తెలిపింది. అలాగే ఎక్సెల్ యుటిలిటీని డౌన్‌లోడ్ చేసుకుని ఆఫ్‌లైన్‌లో వివరాలు నమోదు చేసి, అనంతరం జేసన్ దస్త్రాన్ని రూపొందించి అప్‌లోడ్ చేసే సదుపాయం కూడా కల్పించినట్లు పేర్కొంది. ఆడిట్ పరిధిలోకి రాని పన్ను చెల్లింపుదారులకు సాధారణంగా జులై 31 వరకు గడువు ఉంటుంది. వార్షిక ఆదాయం రూ.50 లక్షల వరకు ఉన్న నివాస భారతీయులు ఐటీఆర్-1 (సహజ్) ఫారాన్ని ఉపయోగించవచ్చు. అలాగే రూ.50 లక్షల వరకు ఆదాయం ఉన్న వ్యక్తులు, హిందూ అవిభాజ్య కుటుంబాలు, పరిమిత బాధ్యత భాగస్వామ్య సంస్థలు మినహా ఇతర సంస్థలు ఐటీఆర్-4 (సుగం) ఫారాన్ని దాఖలు చేయవచ్చు. ఈసారి కొత్త నిబంధనలతో కూడిన ఫారాలను కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి ఇప్పటికే ప్రకటించింది. దీర్ఘకాలిక మూలధన లాభాలు, షేర్ల తిరిగి కొనుగోలు లావాదేవీల వల్ల కలిగిన నష్టాలకు సంబంధించిన అదనపు వివరాలను వెల్లడించాల్సి ఉంటుంది. మరోవైపు 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశ నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు 5.12 శాతం వృద్ధితో రూ.23,40,406 కోట్లకు చేరినట్లు కేంద్ర ప్రత్యక్ష పన్నుల మండలి గణాంకాలు వెల్లడించాయి.

# పెట్రో ధరల పెంపుతో నిత్యావసరాలపై భారం?



**హైదరాబాద్, మే 15 :** అంతర్జాతీయ చమురు ధరల ప్రభావంతో దేశీయంగా పెట్రోల్, డీజిల్ ధరలు లీటరుకు రూ.3 పెరగడంతో సామాన్య వినియోగదారులపై పరోక్షంగా పెద్ద భారం పడే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా ముడి చమురు సరఫరా, ఉత్పత్తి ప్రభావితమవడంతో నాలుగేళ్ల తర్వాత ఇంధన ధరల సవరణ చోటుచేసుకుంది. ఇంధన ధరల పెరుగుదల కేవలం పెట్రోల్, డీజిల్‌కే పరిమితం కాకుండా రవాణా, ఆహార పదార్థాలు, నిత్యావసర వస్తువులపై కూడా ప్రభావం చూపనుందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. రవాణా ఖర్చులు పెరిగితే ఆటో, క్యాబ్ ఛార్జీలు మాత్రమే కాకుండా గూడ్స్ ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు కూడా పెరుగుతాయని విశ్లేషిస్తున్నారు. దీని ప్రభావం నేరుగా మార్కెట్‌పై పడే అవకాశం ఉంది. కూరగాయలు, పండ్లు, పాలు, పప్పుధాన్యాలు వంటి రోజువారీ వినియోగ వస్తువుల ధరలు పెరగడం ఖాయమని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఇప్పటికే కొన్ని డెయిరీ సంస్థలు లాజిస్టిక్స్ ఖర్చుల పేరుతో ధరలు పెంచినట్లు తెలుస్తోంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై ఈ పెంపు మరింత ప్రభావం చూపనుంది. డీజిల్‌తో నడిచే ట్రాక్టర్లు, పంపు సెట్లు, వ్యవసాయ యంత్రాల ఖర్చు పెరగడం వల్ల సాగు వ్యయం అధికమవుతుందని నిపుణులు చెబుతున్నారు. దీని ఫలితంగా భవిష్యత్తులో ఆహార ధాన్యాల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు. మొత్తంగా చూస్తే, ఇంధన ధరల పెరుగుదల ప్రభావం ఒక్క ఇంధనానికే పరిమితం కాకుండా, ఆహారం నుంచి రవాణా వరకు ప్రతి రంగంపైనా కనిపించే అవకాశం ఉందని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# ఒమన్-భారత్ గ్యాస్ పైప్‌లైన్‌కు మళ్లీ ఊపిరి



**న్యూఢిల్లీ, మే 15 :** హర్మూజ్ జలసంధిలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో దేశ ఇంధన భద్రతను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక చర్యలకు శ్రీకారం చుట్టింది. ఒమన్ నుంచి గుజరాత్‌కు సముద్ర గర్భం ద్వారా సహజవాయువును తరలించే భారీ పైప్‌లైన్ ప్రాజెక్టును మళ్లీ పరిశీలనలోకి తీసుకుంది. 'మిడిల్ ఈస్ట్-ఇండియా డీప్‌వాటర్ పైప్‌లైన్' పేరుతో ప్రతిపాదిత ఈ ప్రాజెక్టుపై సమగ్ర నివేదిక సిద్ధం చేయాలని ప్రభుత్వ రంగ సంస్థలకు కేంద్ర పెట్రోలియం శాఖ ఆదేశించినట్లు సమాచారం. హర్మూజ్ జలసంధిలో ఇటీవల నెలకొన్న సంక్షోభం వల్ల ప్రపంచవ్యాప్తంగా చమురు, సహజవాయువు రవాణా తీవ్రంగా దెబ్బతిన్నది. భారత్ తన వంటగ్యాస్ అవసరాల్లో దాదాపు 90 శాతం, ద్రవీకృత సహజవాయువు అవసరాల్లో 60 శాతం ఈ మార్గం ద్వారానే దిగుమతి చేసుకుంటోంది. ఈ పరిణామాల కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో సహజవాయువు ధరలు భారీగా పెరగడంతో, కేంద్రం ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించింది. ప్రతిపాదిత ప్రాజెక్టు ప్రకారం ఒమన్‌లోని రాస్ అల్ జిఫాన్ ప్రాంతం నుంచి అరేబియా సముద్రం గుండా గుజరాత్‌లోని పోర్‌బందర్ వరకు సముద్ర గర్భంలో పైప్‌లైన్ నిర్మించనున్నారు. సుమారు 2 వేల కిలోమీటర్ల పొడవుతో, 3,450 మీటర్ల లోతులో ఈ పైప్‌లైన్ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. రోజుకు 31 మిలియన్ మెట్రిక్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ల సహజవాయువును తరలించే సామర్థ్యంతో ఈ ప్రాజెక్టును రూపకల్పన చేశారు. మొత్తం వ్యయం సుమారు రూ.40 వేల కోట్లుగా అంచనా వేస్తున్నారు. గతంలో అధిక వ్యయం, సాంకేతిక సమస్యల కారణంగా ఈ ప్రాజెక్టు నిలిచిపోయింది. అయితే డీప్‌వాటర్ సాంకేతిక పరిజ్ఞానంలో వచ్చిన పురోగతితో ఇప్పుడు ఇది సాధ్యమవుతుందని నిపుణులు భావిస్తున్నారు. నిర్మాణానికి అవసరమైన అనుమతులు లభిస్తే ఐదు నుంచి ఏడేళ్లలో పనులు పూర్తయ్యే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టు అమల్లోకి వస్తే ఒమన్‌తో పాటు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, సౌదీ అరేబియా, ఖతార్ వంటి దేశాల నుంచి భారత్‌కు నిరంతరాయంగా సహజవాయువు సరఫరా అవుతుంది. దీంతో దేశ ఇంధన భద్రత మరింత బలోపేతం కావడంతో పాటు, అంతర్జాతీయ సంక్షోభాల ప్రభావాన్ని తగ్గించే అవకాశముందని కేంద్ర ప్రభుత్వం భావిస్తోంది.



# భారీగా తగ్గిన బంగారం, వెండి

**హైదరాబాద్, మే 15 :** దేశంలో గత కొన్ని రోజులుగా వరుసగా పెరుగుతున్న బంగారం ధరలకు నేడు భారీ బ్రేక్ పడింది. అంతర్జాతీయ మార్కెట్లలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, కేంద్ర ప్రభుత్వం దిగుమతి సుంకాల పెంపు ప్రభావంతో బంగారం, వెండి ధరలు ఒక్కసారిగా భారీగా పడిపోయాయి. దీంతో కొనుగోలుదారులకు కొంత ఊరట లభించింది. నేటి ఉదయం 10 గంటల సమయానికి హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,60,090కు చేరుకుంది. నిన్నటి ధరతో పోలిస్తే ఏకంగా రూ.2,240 తగ్గింది. అదే సమయంలో 22 క్యారెట్ల 10 గ్రాముల ఆభరణాల బంగారం ధర రూ.1,46,750 వద్ద కొనసాగుతోంది. ఈ ధరపై రూ.2,050 మేర కోత నమోదైంది. వెండి ధరల్లో కూడా భారీ పతనం కనిపించింది. నగరంలో కిలో వెండి ధర రూ.10 వేల మేర తగ్గి ప్రస్తుతం రూ.3.05 లక్షల వద్ద కొనసాగుతోంది. వరుసగా పెరుగుతున్న ధరల తర్వాత ఒక్కసారిగా ఇలా తగ్గిపోవడంతో వ్యాపార వర్గాలు కూడా ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నాయి. ఇతర ప్రధాన నగరాల్లో కూడా బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,63,390గా ఉండగా, ఢిల్లీలో రూ.1,60,240గా నమోదైంది. ముంబైలో హైదరాబాద్‌తో సమానంగా రూ.1,60,090 వద్ద కొనసాగుతోంది. 22 క్యారెట్ల బంగారం ధర చెన్నైలో రూ.1,49,500గా ఉండగా, ఢిల్లీలో రూ.1,46,900గా నమోదైంది. ముంబైలో రూ.1,46,750 వద్ద కొనసాగుతోంది. వెండి ధర కూడా దేశవ్యాప్తంగా దాదాపు ఒకే స్థాయిలో కొనసాగుతుండగా, చెన్నై సహా పలు నగరాల్లో కిలో వెండి ధర రూ.3.05 లక్షలుగా ఉంది. బంగారం, వెండి ధరల్లో ఒక్కరోజులోనే ఇంత భారీ తగ్గుదల రావడంతో పెట్టుబడిదారులు, ఆభరణాల కొనుగోలుదారులు మార్కెట్ పరిస్థితులను జాగ్రత్తగా గమనిస్తున్నారు.

# ఎయిర్‌టెల్ నుంచి 56 ఎడ్జ్ డాటా సెంటర్లు




**న్యూఢిల్లీ, మే 15 :** దేశీయ టెలికాం రంగ దిగ్గజ సంస్థ భారతి ఎయిర్‌టెల్ దేశవ్యాప్తంగా భారీ స్థాయిలో ఎడ్జ్ డాటా సెంటర్ల ఏర్పాటుకు సిద్ధమైంది. వచ్చే రెండేళ్లలో దేశంలోని పలు కీలక నగరాల్లో మొత్తం 56 ఎడ్జ్ డాటా సెంటర్లను ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ గోపాల్ విట్టల్ వెల్లడించారు. డిజిటల్ సేవల వినియోగం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో, వినియోగదారులకు మరింత వేగవంతమైన డేటా సేవలు అందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ తెలిపింది. ముఖ్యంగా కృత్రిమ మేధస్సు, క్లౌడ్ సేవలు, ఐఓటీ, ఐదు జీ సేవల విస్తరణకు ఈ ఎడ్జ్ డాటా సెంటర్లు కీలకంగా మారనున్నాయి. దేశవ్యాప్తంగా వ్యాపార విస్తరణను మరింత వేగవంతం చేయాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టును చేపడుతున్నట్లు కంపెనీ పేర్కొంది. స్థానిక స్థాయిలో డేటా ప్రాసెసింగ్ సౌకర్యాలు అందుబాటులోకి రావడం వల్ల లేటెన్సీ తగ్గి, వినియోగదారులకు మెరుగైన ఇంటర్నెట్ అనుభవం లభించనుంది.

# నాట్కో ఫార్మాకు రూ.4.92 కోట్ల నోటీసు

**న్యూఢిల్లీ, మే 15 :** రెండు ఔషధాలను అధిక ధరలకు విక్రయించారనే ఆరోపణలపై జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ నాట్కో ఫార్మాపై చర్యలు చేపట్టింది. ఔషధ ధరల నియంత్రణ ఉత్తర్వులు--2013 నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తించిన అనంతరం సంస్థకు రూ.4.92 కోట్ల డిమాండ్ నోటీసును జారీ చేసింది. జాతీయ ఔషధ ధరల నియంత్రణ సంస్థ ఆదేశాల ప్రకారం జరిమానాతో పాటు వడ్డీ కలిపి మొత్తం రూ.4,92,25,923ను డిపాజిట్ చేయాలని నాట్కో ఫార్మాకు సూచించింది. ఈ విషయాన్ని సంస్థ బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్‌కు అధికారికంగా తెలియజేసింది. ఏప్రిల్ 2023 నుంచి నవంబర్ 2023 మధ్యకాలంలో రెండు కీలక ఔషధాలను నిర్ణయించిన ధరలకు మించి విక్రయించినట్లు వచ్చిన ఫిర్యాదులపై సంస్థ విచారణ చేపట్టింది. విచారణ అనంతరం నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు గుర్తించి ఈ నోటీసు జారీ చేసినట్లు సమాచారం. ఔషధాల ధరలను నియంత్రించేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఔషధ ధరల నియంత్రణ ఉత్తర్వుల ప్రకారం, సంస్థలు నిర్ణయించిన పరిమితికి మించి ధరలు వసూలు చేయరాదు. ఉల్లంఘన జరిగితే అదనంగా వసూలు చేసిన మొత్తాన్ని వడ్డీతో సహా తిరిగి చెల్లించాల్సి ఉంటుంది. ఈ పరిణామం ఔషధ రంగంలో చర్చనీయాంశంగా మారింది. ఔషధ కంపెనీలు ధరల నియంత్రణ నిబంధనలను కచ్చితంగా పాటించాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

